బుధవారం
19-04-2023
విజయవాడ ప్రచురణ
సంపుటి : 71, సంచిక : 296
పేజీలు : 8, వెల: రూ.5.00
Simultaneously published from
Vijayawada, Hyderabad, Visakapatnam,
Kurnool, Tirupathi, Karimnagar, Khammam
www.visalaandhra.com
స్థాపితం : 1952
విశాలాంధ్ర
VISALAANDHRA Regd No.VJ/042/2021-23
అక్షరాక్షరం అభ్యుదయం

పలస్తీనాపై ఇజ్రాయిల్ దాడులు ఆగాలి
గ్రీస్ కమ్యూనిస్టు పార్టీ డిమాండ్

ఏటా ఏప్రిల్ 17వ తేదీని ఇజ్రాయిల్‌లో పలస్తీనా రాజకీయ ఖైదీల దినోత్సవంగా పాటిస్తారు. ఈ సంవత్సరం రాజకీయ ఖైదీల దినోత్సవం నాటికి పలస్తీనాపై ఇజ్రాయిల్ విరుచుకుపడటం యాధృచ్ఛికం. తాజా పరిణామాలు మరింత ప్రమాదకరంగా పరిణమిస్తున్నాయని గ్రీస్ కమ్యూనిస్టు పార్టీ (కేకేఈ) కేంద్ర కమిటీ అంతర్జాతీయ సంబంధాల విభాగం ఒక ప్రకటనలో పేర్కొంది.

2లో

ఇవేం ఎండలు

రాష్ట్రవ్యాప్తంగా ఒకేసారి పెరిగిన ఉష్ణోగ్రతలు

- పోడూరు, బుచ్చిరెడ్డిపాలెంలో 46 డిగ్రీల నమోదు
- అత్యధిక ప్రాంతాల్లో 44 డిగ్రీలకు పైనే
- మధ్యాహ్నం కర్ఫ్యూను తలపిస్తున్న రహదారులు
- తల్లడిల్లుతున్న వృద్ధులు, పిల్లలు, మహిళలు

విశాలాంధ్ర బ్యూరో–అమరావతి: రాష్ట్రంలో అగ్నివర్షం కురుస్తోంది. ఉదయం 10 గంటల నుంచే ఎండలు మండిపోతున్నాయి. ఎండకు తోడు వడగాడ్పులు కూడా మొదలవ్వడంతో ప్రజలు అల్లాడిపోతున్నారు. మంగళవారం రాష్ట్రవ్యాప్తంగా దాదాపు అన్ని జిల్లాల్లోనూ 44 డిగ్రీల ఉష్ణోగ్రత పైగా నమోదు కావడం విశేషం. కర్నూలు జిల్లా పోడూరులో అత్యధికంగా 46 డిగ్రీలను తాకగా, నెల్లూరు జిల్లా బుచ్చిరెడ్డిపాలెంలో 45.35 డిగ్రీలు నమోదైంది. దెందులూరు, ఉదయగిరి, రాజాం మండల కేంద్రాల్లోనూ 45 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. దాదాపు 24 మండలాల్లో 44 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు నమోదు కాగా, 18 మండలాల్లో 43 డిగ్రీలకుపైగా ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. అనకాపల్లి జిల్లాలో 17, కాకినాడ 2, కృష్ణా1, నంద్యాల 2, విశాఖ 2, విజయనగరం 2, వైఎస్ఆర్ కడప జిల్లాలో 3 మండలాలు సహా మొత్తం 110 మండలాల్లో వడగాడ్పులు వీచినట్లు విపత్తుల సంస్థ వెల్లడించింది. దీంతో నిత్యం రద్దీగా ఉండే ముఖ్య నగరాల్లో కూడా రహదారులు కర్ఫ్యూ వాతావరణాన్ని తలపించాయి. కార్లు ఉన్న వాహన యజమానులు సైతం ఎండ తీవ్రతకు ప్రమాదాలు జరిగే

- మిగతా 2 లో

వివేక హత్య కేసు

సీబీఐ కస్టడీకి సీఎం చిన్నాన్న

- భాస్కర్ రెడ్డితోపాటు ఉదయ్‌కుమార్ రెడ్డి కూడా
- 6 రోజుల కస్టడీకి అనుమతిచ్చిన నాంపల్లి కోర్టు
- ఎంపీ అవినాశ్‌రెడ్డికి కొంత ఊరట
- 25వ తేదీ వరకు అరెస్ట్ చేయొద్దని హైకోర్టు ఆదేశం
- సీబీఐ విచారణకు హాజరు కావాలని స్పష్టీకరణ

విశాలాంధ్ర బ్యూరో– అమరావతి: మాజీమంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసు దర్యాప్తులో కీలక పరిణామం చోటు చేసుకుంది. ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డికి స్వయానా చిన్నాన్న అయిన వైఎస్ భాస్కరరెడ్డి, ఆయన ముఖ్య అనుచరుడు ఉదయ్‌కుమార్ రెడ్డిలను సీబీఐ అధికారులు అరెస్ట్ చేయడం, కోర్టు వారికి 14 రోజుల రిమాండ్ విధించడంతో ప్రస్తుతం వారు చంచలగూడ జైలులో ఉన్న విషయం తెలిసిందే. అయితే ఈ కేసుకు సంబంధించి ఇంకా కీలక సమాచారం సేకరించాల్సి ఉన్నందున వైఎస్ భాస్కర్ రెడ్డి, ఉదయ్ కుమార్ రెడ్డిలను కస్టడీకి ఇవ్వాలని కోరుతూ సీబీఐ మంగళవారం పిటిషన్ దాఖలు చేసింది. దీనిపై విచారణ చేపట్టిన సీబీఐ కోర్టు వారిద్దరిని 6 రోజుల కస్టడీకి అనుమతిచ్చింది. వివేక హత్యకు భాస్కర్‌రెడ్డి నెల రోజుల ముందు కుట్ర పన్నారని, అందుకోసం రూ.40 కోట్లను సిద్ధం చేసుకున్నారని, అందులో నాలుగైదు కోట్ల రూపాయలు చేతులు మారాయని సీబీఐ అధికారులు కోర్టుకు తెలిపారు. భాస్కర్ రెడ్డి సమాజంలో పలుకుబడి ఉన్న వ్యక్తి అని, దర్యాప్తును ప్రభావితం చేసే అవకాశాలున్నాయని, పైగా ఆయన విచారణలో సరైన సమాధానాలు ఇవ్వడం లేదని సీబీఐ అధికారులు వివరించారు. అందుకే అతడిని అరెస్ట్ చేశామని, కస్టడీలోకి తీసుకుని విచారిస్తే మరిన్ని విషయాలు వెలుగులోకి వస్తాయని కోర్టుకు తెలిపారు. దీంతో వారిని సీబీఐ కస్టడీకి అనుమతిస్తూ కోర్టు ఆదేశాలు జారీ చేసింది.

25 వరకు అవినాశ్‌రెడ్డిని అరెస్ట్ చేయొద్దు: హైకోర్టు

కడప పార్లమెంటు సభ్యులు, వైఎస్ భాస్కరరెడ్డి కుమారుడు అవినాశ్ రెడ్డికి మంగళవారం తెలంగాణ హైకోర్టులో ఊరట లభించింది. ఆయనను ఈ నెల 25వ తేదీ వరకు అరెస్ట్ చేయవద్దని సీబీఐకి ఉన్నత న్యాయస్థానం ఆదేశాలు జారీ చేసింది. అవినాశ్ విచారణకు సంబంధించి ఆడియో, వీడియో రికార్డింగ్ చేయాలని స్పష్టం చేసింది. అయితే 25వ తేదీ వరకు అవినాశ్ రెడ్డి రోజూ విచారణకు హాజరు కావాలని చెప్పింది.

ఆ రోజున ముందస్తు బెయిల్ పిటిషన్ పైన తుది తీర్పు ఇస్తామని స్పష్టం చేసింది. ఇప్పటికే 5 సార్లు విచారించిన సీబీఐ అధికారులు ఇక తనను ఖాయంగా అరెస్ట్ చేస్తారన్న అనుమానంతో అవినాశ్ రెడ్డి తెలంగాణ హైకోర్టులో ముందస్తు బెయిల్ పిటిషన్ దాఖలు చేసుకున్న విషయం తెలిసిందే. ఈ పిటిషన్‌పై రెండు రోజులుగా వాదనలు కొనసాగాయి. అవినాశ్‌రెడ్డి ముందస్తు బెయిల్ పిటిషన్‌లో వివేకానందరెడ్డి కుమార్తె సునీత కూడా ఇంప్లీడ్ కావడంతో మంగళవారం దీనిపై రెండు పక్షాల న్యాయవాదుల మధ్య వాడివేడిగా వాదనలు జరిగాయి.

అవినాశ్ రెడ్డికి ఈ హత్యతో ఎలాంటి సంబంధం లేదని, అప్రూవర్‌గా మారిన దస్తగిరి వాంగ్మూలం ఆధారంగా ఆయనను అరెస్ట్ చేయాలని సీబీఐ ఆతృత పడుతోందని ఎంపీ తరపు న్యాయవాది హైకోర్టులో వాదనలు వినిపించారు. వివేక హత్య కేసు రోజున మృతదేహం వద్దకు అవినాశ్ వెళ్లే వరకు చాలామంది ఉన్నారని చెప్పారు. సాక్ష్యాలు తారుమారు చేసే ఆలోచన లేదన్నారు. ఈ హత్యకు కుటుంబ తగాదాలు, వ్యాపార తగదాలు కావొచ్చునని, రాజకీయ కారణాలు కూడా ఉండవచ్చునని వాదనలు వినిపించారు. అవినాశ్‌కు మాత్రం ఈ కేసుతో సంబంధం లేదని చెప్పారు. మరోవైపు సీబీఐ తరపు న్యాయవాది వాదనలు వినిపిస్తూ వివేక హత్య వెనుక కుటుంబ తగాదాలు, వ్యాపార తగాదాలు లేవని కోర్టుకు తెలిపారు. అవినాశ్ రెడ్డి విచారణకు సహకరించడం లేదని, ఆయన సాక్ష్యాలు తారుమారు చేసే ప్రయత్నాలు చేశారని విన్నవించారు. ఈ దశలో జోక్యం చేసుకున్న ధర్మాసనం వివేకకు గుండెపోటు అని ఎందుకు చెప్పారని ప్రశ్నించింది. అక్కడున్న వారు గుండెపోటు అని చెపితే అదే విషయం చెప్పారని తెలిపారు.

ఇంకోవైపు ఇంప్లీడ్ అయిన సునీత తరపు న్యాయవాది మొదటినుండి ఈ కేసు విచారణను ఆలస్యం చేసేందుకు అవినాశ్‌రెడ్డి ప్రయత్నం చేస్తున్నారని, సీబీఐ విచారణకు ఏమాత్రం సహకరించడం లేదని వాదించారు. ముగ్గురు న్యాయవాదుల వాదనలు విన్న అనంతరం న్యాయమూర్తి తీర్పును 25వ తేదీకి వాయిదా వేశారు.

హరీశ్ ప్రశ్నలకు సమాధానమేది?
జగన్‌ను నిలదీసిన రామకృష్ణ

విశాలాంధ్ర బ్యూరో–అమరావతి: ఆంధ్రప్రదేశ్ మంత్రులకు, ఎమ్మెల్యేలకు చేతనైతే రాష్ట్రానికి ప్రత్యేక హోదా, పోలవరం ప్రాజెక్టు నిర్మాణం, విశాఖ ఉక్కు ప్రైవేటీకరణలపై పోరాడాలంటూ తెలంగాణ మంత్రి హరీశ్‌రావు చేసిన సవాల్‌కు సీఎం వైఎస్ జగన్ సమాధానమివ్వాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ డిమాండ్ చేశారు. ఈ మేరకు రామకృష్ణ మంగళవారం ఓ ప్రకటన విడుదల చేశారు. వైసీపీ అధికారం చేపట్టిన ఈ నాలుగేళ్లలో రాష్ట్రంలో అభివృద్ధి ఏ మాత్రం జరగలేదని, వ్యవసాయ, పారిశ్రామిక, నీటిపారుదల రంగాలన్నీ

- మిగతా 2 లో

‘భోగాపురం’ సమస్యలు
తీరేదెప్పుడు?

విమానాశ్రయం శంకుస్థాపనకు రంగం సిద్ధం

- నిర్వాసితుల సమస్యలు పరిష్కారం కాని వైనం
- ఇళ్ల నిర్మాణానికి చాలని పరిహారం
- ఉపాధి పనులకు దూరంగా నిర్వాసితుల కాలనీలు
- నష్టపరిహారం ఇవ్వాలంటున్న వలసలు వెళ్లిన స్థానికులు
- అప్రోచ్ రోడ్డు కోసం భూములు కోల్పోయిన రైతులు

విశాలాంధ్ర–విజయనగరం : భోగాపురం విమానాశ్రయం శంకుస్థాపనకు జిల్లా యంత్రాంగం సర్వం సిద్ధం చేస్తోంది. మే 3న ముఖ్యమంత్రి వైస్ జగన్‌మోహన్‌రెడ్డి విమానాశ్రయ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేయనున్న నేపథ్యంలో జిల్లా యంత్రాంగం అందుకు అనుగుణంగా చర్యలు తీసుకుంటోంది. గత ఏడాది నవంబరు నాటికి విమానాశ్రయం భూ సేకరణలో నెలకొని ఉన్న న్యాయపరమైన చిక్కులు కూడా తొలగిపోయాయి. అదే నెలలో ప్రధాని మోదీ చేతుల మీదుగా విమానాశ్రయం నిర్మాణ పనులకు శంకుస్థాపన చేస్తారనే ప్రచారమూ సాగింది. కానీ అటువంటిదేమీ జరగలేదు. భూసేకరణ పూర్తి కావడం, న్యాయపరమైన చిక్కులు వీడిపోవడంతో సీఎం చేతుల మీదుగా శంకుస్థాపనకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. రెండున్నరేళ్లలో విమానాశ్రయం నిర్మాణం పూర్తయ్యే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. ఇక భోగాపురం విమానాశ్రయం కోసం 2,753 ఎకరాలను ప్రభుత్వం సేకరించగా, అందులో 500 ఎకరాలు ప్రభుత్వం వద్ద ఉంచుకుని, 2,203 ఎకరాలు విమానాశ్రయానికి అప్పగించనున్నారు. విమానాశ్రయం నిర్మానం వల్ల రెల్లిపేట, బొల్లింకలపాలెం, ముడసర్లపేట,

- మిగతా 2 లో

ఇదీ లోకం!

సూడాన్‌లో 200కు పెరిగిన మృతులు

- వివరాలు 2 లో

పలస్తీనాపై ఇజ్రాయిల్ దాడులు ఆగాలి

రాజకీయ ఖైదీలను తక్షణమే విడుదల చేయాలి

గ్రీస్ కమ్యూనిస్టు పార్టీ డిమాండ్

గ్రీస్: ఏటా ఏప్రిల్ 17వ తేదీని ఇజ్రాయిల్‌లో పలస్తీనా రాజకీయ ఖైదీల దినోత్సవంగా పాటిస్తారు. ఈ సంవత్సరం రాజకీయ ఖైదీల దినోత్సవం నాటికి పలస్తీనాపై ఇజ్రాయిల్ విరుచుకుపడటం యాధృచ్ఛికం. తాజా పరిణామాలు మరింత ప్రమాదకరంగా పరిణమిస్తున్నాయని గ్రీస్ కమ్యూనిస్టు పార్టీ (కేకేఈ) కేంద్ర కమిటీ అంతర్జాతీయ సంబంధాల విభాగం ఒక ప్రకటనలో పేర్కొంది. పలస్తీనా ప్రజలకు సంఘీభావాన్ని ప్రకటించింది. ఇజ్రాయిల్ జైళ్లల్లో వేలాది మంది పలస్తీనా ఖైదీలు మగ్గుతున్నారని ఆందోళన వ్యక్తంచేసింది. అమెరికా, ఈయూ, నాటో తదితర శక్తుల మద్దతుతో పలస్తీనాపై ఇజ్రాయిల్ దాడులు చేస్తోందని, దశాబ్దాలుగా ఇది కొనసాగిస్తూ పౌరహత్యలకు పాల్పడుతోందని పేర్కొంది. పలస్తీనా ప్రజలను దీర్ఘకాలం నిర్బంధానికి గురిచేస్తూ వారితో అమానవీయంగా ప్రవర్తిస్తోందని ఇజ్రాయిల్ తీరును గ్రీస్ కమ్యూనిస్టు పార్టీ తీవ్రంగా ఖండించింది.

ఇజ్రాయిల్ జైళ్లలో ఉన్న పలస్తీనా రాజకీయ ఖైదీల సంఖ్య 4,900కుపైగా ఉన్నదని, వీరిలో పిల్లలు (160 మంది), 30 మంది మహిళలు, నలుగురు పార్లమెంటేరియన్లు, 1,016 ఖైదీలు ఉన్నారని, విచారణ లేకుండా బంధీగా ఉన్నారని కేకేఈ ఆవేదన వ్యక్తంచేసింది. పలస్తీనాపై ఇజ్రాయిల్ యుద్ధనేరాలను నిరసించాలని, పలస్తీనా ప్రజలకు మరింతగా మద్దతు, సంఘీభావం తెలుపాలని గ్రీస్ ప్రజలకు కమ్యూనిస్టు పార్టీ పిలుపునిచ్చింది. ఇజ్రాయిల్ దండయాత్రకు చరమగీతం పాడేందుకు మరింత ఉధృత పోరు అవసరమని నొక్కిచెప్పింది.

నిర్బంధంలో ఉన్న పలస్తీనా ప్రజలు, ఇజ్రాయిల్ జైళ్లల్లో మగ్గుతున్న రాజకీయ ఖైదీలను తక్షణమే విడుదల చేయాలని, తూర్పు జెరూసలేం రాజధానిగా, 1967 నాటి సరిహద్దులు ప్రామాణికంగా స్వతంత్ర పలస్తీనా ఏర్పాటు కావాలని, పలస్తీనా శరణార్థులందరికీ తమ స్వస్థలానికి, ఇళ్లకు తిరిగి వచ్చే హక్కు ఉన్నదని గ్రీస్ కమ్యూనిస్టు పార్టీ పేర్కొంది.

విశాలాంధ్ర ప్రపంచం

సూడాన్‌లో 200కు పెరిగిన మృతులు

ఖార్టూమ్: సూడాన్ ఆర్మీ, పారామిలటరీ రాపిడ్ సపోర్ట్ ఫోర్సెస్ (ఆర్ఎస్‌పీ) మధ్య మూడ్రోజులుగా కొనసాగుతున్న ఘర్షణల్లో ఇప్పటికే 200 మంది చనిపోగా 1800 మంది గాయపడ్డారని ఆ దేశంలోని ఐరాస మిషన్ హెడ్ వోల్కర్ పెర్తెస్ తెలిపారు. తాజా పరిస్థితులతో సుడాన్ ఆరోగ్య వ్యవస్థ దెబ్బతిన్నదన్నారు. ఆసుపత్రులు, క్లీనిక్‌ల వద్ద భయానక దృశ్యాలు ఆవిష్కృతమయ్యాయి. మృతదేహాలు, బంధువుల ఆర్తనాథాలతో ఆయా ప్రాంగణాలు కిటకిటలాడుతున్నాయి. ఘర్షణల కారణంగా కొన్ని ఆసుపత్రులు పూర్తిగా దెబ్బతిన్నాయి.ఇద్దరు సైన్యాధికారుల అధికార దాహం కారణంగా సూడాన్‌లో మూడు రోజులుగా హింస జరుగుతోంది.

యూరప్ రాయబారి నివాసంపై దాడి

సూడాన్ రాజధాని ఖార్టూమ్‌లోని ఐరోపా రాయబారి నివాసంపై దాడి జరిగింది. ఈ ఘటన నుంచి రాయబారి సురక్షితంగా బయటపడినట్టు తెలుస్తోంది. ఐరాస వరల్డ్ ఫుడ్ ప్రోగ్రామ్‌కు చెందిన ముగ్గురు సిబ్బంది చనిపోయారు. దర్ఫర్‌లో ఔషదాలు, ఆహారం సరఫరా చేస్తున్న క్రమంలో ఘర్షణల్లో చిక్కుకుని వీరు ప్రాణాలు కోల్పోయారు.

మానవతా సాయం దాదాపు అసాధ్యం: ఐఎఫ్ఆర్‌సీ

సూడాన్‌లో నెలకొన్న హింసాత్మక పరిస్థితుల్లో ఆ దేశ ఆరోగ్య వ్యవస్థ పతనం అంచునకు చేరుకున్నదని ఇంటర్నేషనల్ ఫెడరేషన్ ఆఫ్ రెడ్ క్రాస్ & రెడ్ క్రెసెంట్ సొసైటీస్ (ఐఎఫ్ఆర్‌సీ) మంగళవారం హెచ్చరించింది. ఖార్టూమ్‌లో ఎక్కడికీ వెళ్లలేని పరిస్థితులు ఉన్నాయని, మానవతా సాయం అందించడం దాదాపు అసాధ్యమైందని ఐఎఫ్ఆర్‌సీ హెడ్ ఫరీద్ ఐవర్ అన్నారు. ఆయన నైరోబీ నుంచి వీడియో సమావేశంలో విలేకరులతో మాట్లాడారు. వివిధ సంఘాల వారు, ప్రజలు చిక్కుకుపోయి సాయం కోరుతున్నట్లు తెలిపారు.

కాల్పులు విరమించాలి- దాడి ఆగాలి: ఐరాస, డబ్ల్యూహెచ్ఓ

సుడాన్‌లో హింసను నిలిపివేయాలని ఐరాస ప్రధాన కార్యదర్శి ఆంటోనియో గుటర్రస్ పిలుపునిచ్చారు. ఈ పరిస్థితులు దేశానికి మంచిది కాదన్నారు. గుటర్రస్‌తో పాటు ప్రపంచ దేశాలు కూడా ఘర్షణ వద్దని, శాంతి నెలకొల్పాలని పిలుపునిచ్చాయి. మానవతా చట్టాలు, ఆరోగ్య హక్కు చట్టాలను ఉల్లంఘిస్తున్నారని, ఆరోగ్య సంరక్షణ వ్యవస్థపై దాడులను వెంటనే ఆపివేయాలని ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్ఓ) సూచించింది. ఇప్పటికే ఆరోగ్య సిబ్బంది ముగ్గురు చనిపోయారని, కాల్పులను తక్షణమే విరమించుకోవాలని డబ్ల్యూహెచ్ఓ అధికార ప్రతినిధి మార్గరెట్ హారిస్ పిలుపునిచ్చారు. ఇది సంక్లిష్ట పరిస్థితి, వెంటనే దాడులను ఆపడం అనివార్యమని నొక్కిచెప్పారు.

మూలపేట పోర్టుకు నేడు శంకుస్థాపన

ఉత్తరాంధ్ర జిల్లాల్లో ఇదొక చారిత్రక ఘట్టం: మంత్రి గుడివాడ అమర్‌నాథ్

విశాలాంధ్ర బ్యూరో-విశాఖపట్నం : ఉత్తరాంధ్రలో ఒక చారిత్రక ఘట్టానికి అంకురార్పణ జరగబోతోందని, శ్రీకాకుళం జిల్లా మూలపేట వద్ద రూ.3 వేల కోట్ల వ్యయంతో చేపట్టనున్న పోర్టు నిర్మాణానికి ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి బుధవారం శంకుస్థాపన చేయనున్నారని రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ తెలిపారు. రాష్ట్రంలో పూర్తిగా వెనుకబడిన ప్రాంతమైన శ్రీకాకుళం జిల్లా పారిశ్రామికంగా, ఆర్థికంగా పరిపుష్టి చెందాలన్న సంకల్పంతో సీఎం జగన్ తీసుకున్న అనేక నిర్ణయాలు ఇప్పుడు సఫలీకృతం కాబోతున్నాయని అన్నారు. ఇందులో భాగంగానే మూలపేట పోర్టు నిర్మాణానికి అంకురార్పణ జరగబోతోందని తెలిపారు. మంగళవారం స్థానిక సర్క్యూట్ హౌస్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మంత్రి మాట్లాడుతూ భావనపాడు పోర్టు నిర్మిస్తామని చెప్పి గత ప్రభుత్వం ఉత్తరాంధ్ర ప్రాంత ప్రజలను, ముఖ్యంగా శ్రీకాకుళం జిల్లా వాసులను మోసం చేసిందని, కానీ జగన్‌మోహన్ రెడ్డి ఆ విధంగా చేయలేదని, ఎన్నికల సమయంలో శ్రీకాకుళం జిల్లాలో పోర్టు నిర్మిస్తామని ఇచ్చిన హామీని వాస్తవ రూపంలో తీసుకువచ్చేందుకు అడుగులు ముందుకు వేస్తున్నారని తెలిపారు. ఈ మూలపేట పోర్టులో తొలి దశలో 23.5 మిలియన్ టన్నుల హ్యాండ్లింగ్ సామర్థ్యం కలిగిన నాలుగు బెర్తులను నిర్మిస్తున్నామన్నారు. రాష్ట్రంలో ఉన్న సముద్ర తీరాన్ని, వనరులను సద్వినియోగం చేసుకుంటామని సీఎం జగన్ అనేక సందర్భాల్లో చెప్పారని, అందులో భాగంగానే మారిటైం బోర్డు సహకారంతో మూలపేట పోర్టు నిర్మాణాన్ని చేపడుతున్నామని చెప్పారు. బందరు, రామాయపట్నం పోర్టుల నిర్మాణాన్ని మరింత వేగవంతం చేసి, రామాయపట్నం పోర్టుకు ఈ ఏడాది డిసెంబరు లేదా వచ్చే ఏడాది జనవరిలో తొలి వెసెల్ వచ్చే విధంగా చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. అలాగే జువ్వలదిన్నె ఫిషింగ్ హార్బర్ నిర్మాణ పనులు పూర్తికావస్తున్నాయని, శ్రీకాకుళం జిల్లా ఎచ్చెర్లకు చెందిన బుడగట్లపాలెంలో రూ.170 కోట్లతో మరొక ఫిషింగ్ హార్బర్ నిర్మించనున్నామని మంత్రి వివరించారు. మూలపేట పోర్టు, ఆరు వరుసల రహదారి నిర్మాణం పూర్తయితే శ్రీకాకుళం జిల్లా పారిశ్రామికంగా ఎంతో అభివృద్ధి చెందుతుందని అమర్‌నాథ్ ఆశాభావం వ్యక్తం చేశారు. అలాగే మే 3న సుమారు 3,500 కోట్ల రూపాయలతో నిర్మించనున్న భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయానికి ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి శంకుస్థాపన చేయనున్నారని తెలిపారు. ఈ కార్యక్రమానికి హాజరు కావలసిందిగా కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి జ్యోతిరాదిత్య సింధియాను ఆహ్వానించామన్నారు. 2025 తొలి అంకంలో మొదటి విమానం భోగాపురం విమానాశ్రయంలో ల్యాండ్ అవుతుందని మంత్రి అమర్‌నాథ్ ఆశాభావం వ్యక్తం చేశారు. ఇప్పటికే శ్రీకాకుళం జిల్లాలో వైద్య కళాశాలలు నిర్మిస్తున్నామని, ఉద్దానం కిడ్నీ బాధితుల కోసం పరిశోధనా కేంద్రాన్ని ఏర్పాటు చేశామని అన్నారు. గత ప్రభుత్వం ఈ ప్రాంతానికి ఎప్పుడైనా ఇంత మేలు చేసిందా అని ఆయన ప్రశ్నించారు. భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం, మూలపాడు పోర్టు నిర్మాణం పూర్తయితే చత్తీస్‌గఢ్, ఒడిశా తదితర రాష్ట్రాల నుంచి ఖనిజాలు, గ్రానైట్స్, వివిధ రకాల ఉత్పత్తులు దేశ, విదేశాలకు ఎగుమతి చేయడానికి ఎంతగానో ఉపకరిస్తుందని చెప్పారు. జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం సంక్షేమ పథకాలకు అధిక మొత్తాన్ని వెచ్చించి, అభివృద్ధిని విస్మరించిందని ప్రతిపక్షాలు చేస్తున్న విమర్శలకు శ్రీకాకుళం జిల్లాలో చేపడుతున్న విస్తృత అభివృద్ధి కార్యక్రమాలతో చెక్ చెప్పనున్నామని అమర్‌నాథ్ అన్నారు. ఇటీవల విశాఖలో జరిగిన పారిశ్రామిక సదస్సులో ఎంవోయూలు ఒక్కటొక్కటిగా కార్యరూపం దాలుస్తున్నాయని చెప్పారు. ఇప్పటికే 99 వాణిజ్య సంస్థలు రాష్ట్రంలో పరిశ్రమలను ఏర్పాటు చేసుకునేందుకు ముందుకు వచ్చాయని, ప్రస్తుతం ఇవి స్థల పరిశీలనలో ఉన్నాయని, దీనికి సంబంధించి చీఫ్ సెక్రటరీ అధ్వర్యంలో ప్రభుత్వం వేసిన రెండు కమిటీలు అధ్యయనం చేస్తున్నాయని మంత్రి వివరించారు. రామాయపట్నం పోర్టుకు సమీపంలో 3,500 ఎకరాల భూమిని పారిశ్రామిక అవసరాల కోసం సిద్ధం చేశామని, అలాగే మూలపేట వద్ద ఉన్న కేంద్ర ప్రభుత్వ భూములను కూడా రాష్ట్ర ప్రభుత్వానికి బదలాయించమని కోరామన్నారు. ఏది ఏమైనా మూలపేట పోర్టు, భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయంతో ఉత్తరాంధ్ర ముఖచిత్రం మారబోతుందని ఆయన స్పష్టం చేశారు.

విశాఖ స్టీల్ ప్లాంట్‌ను కేంద్ర ప్రభుత్వమే నడపాలి

విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణపై కేంద్ర ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాలకు సంబంధించి విలేకరులు అడిగిన ప్రశ్నకు మంత్రి అమర్‌నాథ్ సమాధానం చెబుతూ విశాఖపట్నం స్టీల్ ప్లాంట్ కేంద్ర ప్రభుత్వ సంస్థగానే ఉండాలని అన్నారు. ప్లాంట్‌ను ముక్క ముక్కలు చేసి విక్రయించడానికి కేంద్ర ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలను విరమించుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు. కేంద్ర ప్రభుత్వ పాలసీలో భాగంగా విశాఖపట్నం స్టీల్ ప్లాంట్‌ను విక్రయిస్తామని చెప్పడం విడ్డూరంగా ఉందని, నష్టాల్లో ఉన్న అనేక పరిశ్రమలను కేంద్రం ఇప్పటికీ నడుపుతోందని, అటువంటప్పుడు విశాఖ స్టీల్ ప్లాంట్‌ను నడపడానికి ఎందుకు వెనకాడుతోందని ప్రశ్నించారు. 32 మంది ప్రాణ త్యాగంతో సాధించుకున్న విశాఖ స్టీల్ ప్లాంట్‌ను ప్రైవేటీకరించడానికి కేంద్రం, దాన్ని కొంటామంటూ తెలంగాణ ప్రభుత్వం రోజుకో మాటతో విశాఖపట్నం వచ్చి అలజడి సృష్టిస్తున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. స్టీల్ ప్లాంట్‌ను ప్రైవేటీకరించకూడదన్నది తమ ప్రభుత్వ అభిమతమని, ప్లాంట్ ప్రైవేటీకరణను నిరసిస్తూ కార్మికులు చేపడుతున్న ఉద్యమాలకు రాష్ట్ర ప్రభుత్వం దన్నుగా నిలుస్తుందని అమర్‌నాథ్ స్పష్టం చేశారు.

హరీశ్ ప్రశ్నలకు సమాధానమేది?

(మొదటిపేజీ తరువాయి)

కుదేలయ్యాయని తెలిపారు. అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా జగన్ రాష్ట్ర ప్రజలకు చెప్పిన మాటలు, చేసిన వాగ్దానాలు ఎందుకు అమలు చేయలేదు? కేంద్రంలో ఏ ప్రభుత్వం ఉన్నా మెడలు వంచి ప్రత్యేక హోదా సాధిస్తామన్న విషయం ఏమైంది? విభజన చట్ట హామీల అమలు, వెనుకబడిన ఉత్తరాంధ్ర, రాయలసీమ ప్రాంతాల అభివృద్ధి నిధుల సంగతేమైంది? కడపలో ఉక్కు ఫ్యాక్టరీ, పోలవరం జాతీయ ప్రాజెక్టు నిర్మాణం ఎందుకు జరగలేదు? కనీసం కేంద్ర బడ్జెట్లలో రాష్ట్రానికి నిధులు కేటాయించేలా ఎందుకు ప్రయత్నించలేదు? కేంద్రంపై ఒత్తిడి పెంచి విశాఖ ఉక్కు ప్రైవేటీకరణను ఎందుకు ఆపలేకపోయారు? 'మాట తప్పి, మడమ తిప్పడం' తప్ప జగన్ ఈ నాలుగేళ్లలో ఏమి సాధించారు' అని రామకృష్ణ ప్రశ్నించారు. రాష్ట్రానికి అడుగడుగునా ద్రోహం చేసిన కేంద్ర ప్రభుత్వ అనాలోచిత నిర్ణయాలకు దాసోహమనడం తప్ప వైసీపీ ఎంపీలు చేసిందేమీ లేదని విమర్శించారు. అదానీ అవినీతిపై దేశవ్యాప్తంగా చర్చ కొనసాగుతున్నప్పటికీ మీరెందుకు స్పందించడం లేదని నిలదీశారు. ప్రజల ఆస్తులను కారుచౌకగా అప్పగించడం వెనుక ఆంతర్యం ఏమిటని ప్రశ్నించారు. తెలంగాణ మంత్రులు ఎద్దేవా చేస్తుంటే జగన్‌కు చీమకుట్టినట్లయినా లేదా? అని నిందించారు.

'భోగాపురం' సమస్యలు తీరేదెప్పుడు?

(మొదటిపేజీ తరువాయి)

మరాడపాలెం పూర్తిగా కనుమరుగవుతున్నాయి. ఈ గ్రామాల్లో సుమారు 300 ఇళ్లున్నాయి. ఇళ్లు కోల్పోతున్న వారికి ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజ్ కింద 5 సెంట్ల స్థలం, 9.2 లక్షల రూపాయల నగదు ఇస్తున్నారు. రెల్లిపేట, బొల్లింకలపాలెం గ్రామాలకు సంబంధించి 120 కుటుంబాలకు గూడెపువలస సమీపంలో 17 ఎకరాల్లో స్థలం కేటాయించారు. ముడసర్లపేట, మరాడపాలెం గ్రామాలకు లింగాలవసల కొండపై 27 ఎకరాలు స్థలం అభివృద్ధి చేయగా, ఆ గ్రామాల వారు అక్కడ ఇళ్లు నిర్మించుకుంటున్నారు. గూడెపు వలసలో నిర్వాసిత స్థలం ఇళ్ల నిర్మాణానికి కొంత అనుకూలంగా ఉన్నా, లింగాల వలసలో మాత్రం ఇబ్బందులు తప్పడం లేదు. అయితే నిర్వాసితులకు 5 సెంట్ల భూమితో పాటు 9.5 లక్షల రూపాయలు అందిస్తామన్నారని, అందులో 50 వేల రూపాయలు రవాణా కింద పరిగణించడం జరుతుందని భూ సేకరణ ప్రక్రియ ప్రారంభంలో అప్పటి అధికారులు చెప్పినప్పటికీ రవాణాగా పేర్కొన్న 50 వేలు మాత్రం ఇవ్వలేదని నిర్వాసితులు చెబుతున్నారు. అలాగే విమానాశ్రయం అప్రోచ్ రోడ్డుకు సంబంధించి భూములు కోల్పోయిన రైతుల సమస్య కూడా ఎటూ తేలలేదు. అప్రోచ్ రోడ్డులో భూములు కోల్పోయిన గూడెపు వలస రైతులకు రూ.57 లక్షలు, కంచేరుకు రూ.52 లక్షలు, సవరవిల్లి గ్రామ రైతులకు రూ.59 లక్షల వంతున పరిహారం చెల్లిస్తామని, రైతులు త్వరగా భూములు అప్పగించాలని అధికారులు కోరారు. అయితే గూడెపు వలసకు రూ.85 లక్షలు, కంచేరుకు రూ.80 లక్షలు, సవరవిల్లికి రూ.90 లక్షలు చెల్లించాలని, అప్రోచ్ రోడ్ భూముల విషయంలో గత జేసీ, ఆర్డీవో ఇచ్చిన హామీ ప్రకారం పరిహారం చెల్లించాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు. అంతేకాకుండా విమానాశ్రయానికి. అప్రోచ్ రోడ్డుకు బలవంతంగా భూములు తీసుకున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు, కోస్టల్ కారిడార్, జాతీయ రహదారిని అనుసంధానించే రోడ్డు కోసం హైవే అథారటీ సర్వే నిర్వహిస్తోందని, ఉన్న కాస్త భూమి కూడా పోతే తమ పరిస్థితేంటని రైతులు ప్రశ్నిస్తున్నారు. వీటితో పాటు 18 సంవత్సరాలు నిండిన వారికి పునరావాస ప్యాకేజీ సమస్య పరిష్కారం కాలేదు. ఇక వలసలు వెళ్లిన వారి ఇళ్లేమైనా ఉంటే ఇంటికి సెంటున్నర వంతున భూమిని అందజేస్తున్నారు. మిగిలిన నిర్వాసితులకు ఇచ్చినట్లే తమకు నష్టపరిహారం ఇవ్వాలని వారు కోరుతున్నారు. ప్రస్తుతం ఉంటున్న గ్రామాల నుంచి నిర్వాసిత ప్రాంతాలకు తరలి వెళ్లేందుకు కొంత సమయం అడిగినా ఇవ్వలేదని, అప్పటికప్పుడు ఊరు విడిచి రావడంతో అనేక సమస్యలు ఎదుర్కొంటున్నామని నిర్వాసితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉపాధి పనులకు సైతం తమ కాలనీ దూరంగా ఉందంటున్నారు. భూ సేకరణకు సంబంధించి స్థానికంగా ఉన్న పరిస్థితుల ఆధారంగా ఎకరాకు రూ.28 లక్షల నుంచి రూ.60 లక్షల వరకు నష్టపరిహారం పొందినవారు కూడా ఉన్నారు. వీరిలో చాలామంది కాలనీలో ఇళ్లను నిర్మించుకున్నారు. ఇళ్లను కోల్పోయి 5 సెంట్ల భూమి, రూ.9 లక్షల పరిహారం అందుకున్న వారిలో కొంతమంది ఆర్థిక పరిస్థితులకు అనుగుణంగా ఇళ్ల నిర్మాణం చేపడుతుండగా, వచ్చిన పరిహారం ఇళ్ల నిర్మాణానికి చాలదంటూ గుడిసెల్లోనే నివాసం ఉంటున్నవారూ ఉన్నారు. భోగాపురం విమానాశ్రయం భూసేకరణలో తలెత్తిన అనేక సమస్యలతో పోలిస్తే, ఇంకా మిగిలి ఉన్న నిర్వాసితుల సమస్యలు చాలా చిన్నవిగానే కన్పిస్తున్నా, సగటు నిర్వాసితుని కోణంలో అవి పెద్ద సమస్యలేనన్నది వాస్తవం. వాటిపై కూడా అధికారులు దృష్టి సారించి పరిష్కారం చూపాలని నిర్వాసితులు కోరుతున్నారు.

ఏపీఎస్ఆర్టీసీకి జాతీయ అవార్డులు

ఇద్దరు డ్రైవర్లకు 'హీరోస్ ఆన్ రోడ్' ప్రదానం

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఆర్టీసీని జాతీయ అవార్డులు వరించాయి. హీరోస్ ఆన్ రోడ్ పేరుతో అవార్డుల్ని అసోసియేషన్ ఆఫ్ స్టేట్ రోడ్ ట్రాన్స్‌పోర్ట్ అండర్ టేకింగ్స్ (ఏఎస్ఆర్‌టీయూ) ప్రకటించగా, అందులో ఏపీఎస్ఆర్టీసీకి చెందిన ఇద్దరు డ్రైవర్లు ఎంపికయ్యారు. అన్ని రాష్ట్రాల ఆర్టీసీల నుంచి మొత్తం 42 మంది సేఫ్టీ డ్రైవర్లకు మంగళవారం దిల్లీలో అవార్డులు అందజేశారు. రెండు విభాగాల్లో (సిటీ, మోఫిస్సిల్) ఈ అవార్డులను ఏఎస్ఆర్‌టీయూ ప్రకటించింది. సిటీ కేటగిరీలో ఆంధ్రప్రదేశ్-సింహాచలం డిపోకి చెందిన డ్రైవర్ ఎస్ఏఎన్ రాజు, ఆత్మకూరు-కర్నూలు డిపోకు చెందిన ఏఎం బాషాకు ట్రోఫీ, ప్రశంసాపత్రంతో పాటు నగదు పురస్కారాలు అందజేశారు. డ్రైవర్లు, వారి కుటుంబ సభ్యుల సమక్షంలో ఏఎస్ఆర్‌టీయూ కార్యదర్శి అల్కా ఉపాధ్యాయ ఈ అవార్డులు ప్రదానం చేశారు. డ్రైవర్ రాజు తన 33 ఏళ్ల 10 నెలల సర్వీసులో ఇప్పటివరకు ఒక్క ప్రమాదం చేయలేదు. డ్రైవర్ బాషా తన 36 ఏళ్ల 6 నెలల సర్వీసులో ఒక్క ప్రమాదమూ చేయలేదు. దిల్లీలో జరిగిన అవార్డుల ప్రదానోత్సవానికి సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్(ఆపరేషన్స్) కేఎస్ బ్రహ్మానందరెడ్డి హాజరయ్యారు. ప్రయాణికులను సురక్షితంగా గమ్యస్థానాలకు చేర్చడంలో ఏపీఎస్ఆర్టీసీ ముందుంటుందని, డ్రైవర్లకు శిక్షణ తరగతులు నిర్వహిస్తామని బ్రహ్మానందరెడ్డి తెలిపారు. అవార్డు అందుకున్న డ్రైవర్లను అభినందించారు. వారిని ఆదర్శంగా తీసుకోవాలని సహచర డ్రైవర్లకు సూచించారు. బాషా, రాజు మాట్లాడుతూ జాతీయ స్థాయిలో ఏపీఎస్ఆర్టీసీ పొందిన ఖ్యాతిలో తాము భాగస్వాములైనందుకు ఆనందంగా ఉందన్నారు. రాష్ట్రస్థాయిలో మూడుసార్లు ఏపీఎస్ఆర్టీసీ అవార్డుల్ని అందుకున్నట్లు వారు చెప్పారు.

నేడు బిల్కిస్, రేపు ఇంకెవరైనా...

- 11 మంది దోషులను ఏ కారణాలతో విడుదల చేశారు
- మేమే సొంతంగా నిర్ణయాలు తీసుకుంటాం
- కేంద్రంపై సుప్రీంకోర్టు అసహనం

న్యూదిల్లీ: బిల్కిస్ బానోపై సామూహిక అత్యాచారం కేసులో 11 మంది దోషులను ముందస్తుగా విడుదల చేయడానికి సంబంధించి పత్రాలను సమర్పించాలన్న కోర్టు ఆదేశాలను కేంద్రప్రభుత్వం సవాల్ చేసింది. ఆ మేరకు పత్రాలను సమర్పించాలని అనుకోవడం లేదని, అలా చేసేందుకు తమకు అవకాశం ఉన్నదని సర్వోన్నత న్యాయస్థానానికి వెల్లడించింది. దీనిపై న్యాయస్థానం స్పందిస్తూ నేడు బిల్కిస్, రేపు ఇంకెవరైనా కావచ్చు. మీరు, నేను కూడా కావచ్చు. ముందస్తు విడుదలకు కారణాలను మీరు చూపకపోతేగనుక అందుకు కారణాలు మేము ఏమైనా ఊహించుకోవచ్చు. సొంతంగా నిర్ణయాలనూ తీసుకోవచ్చు' అంటూ కేంద్రంపై అసహనం వ్యక్తంచేసింది. 'ఓ గర్భిణి సామూహిక అత్యాచారానికి గురైంది. అనేకమంది హత్యకు గురయ్యారు. ఐపీసీలోని 302 సెక్షన్ కింద నమోదైన కేసులతో బాధితురాలి కేసును పోల్చరాదు. కమలా పండుతో ఆపిల్‌ను పోల్చలేము. అలాగే మారణహోమాన్ని/ఊచకోతను ఒకరి హత్యతో పోల్చలేము. సాధారణంగా నేరాలన్నవి వర్గానికి, సమాజానికి వ్యతిరేకంగా జరుగుతుంటాయి. అసమానులను సమానంగా చూడరాదు. ఏ అంశాలను ఆధారంగా చేసుకొని 11 మంది దోషులను ముందస్తుగా విడుదల చేశారు? ఇలా చేసే ముందు ప్రభుత్వం బుర్రపెట్టి ఆలోచించిందా? వివేకంగా వ్యవహరించిందా? నేడు బిల్కిస్, రేపు ఇంకెవరైనా కావచ్చు. మీరు నేను కూడా కావచ్చు. ముందస్తు విడుదలకు కారణాలను మీరు చూపకపోతేగనుక అందుకు కారణాలు మేము ఏమైనా ఊహించుకోవచ్చు' అని జస్టిస్ కేఎం జోసఫ్, జస్టిస్ బీవీ నగరత్న ధర్మాసనం వ్యాఖ్యానించింది. జస్టిస్ జోసఫ్ మాట్లాడుతూ, ప్రభుత్వం వివేకాన్ని ఉపయోగించిందా? అనేదే ప్రధాన ప్రశ్న అని అన్నారు. ఈ నిర్ణయం తీసుకోవడానికి ఆధారం ఏమిటని ప్రశ్నించారు. దోషులు తమ సహజ జీవితంలో మిగిలిన భాగమంతా జైలులోనే గడపాలని జ్యుడిషియల్ ఆర్డర్ చెప్తోందన్నారు. ఆ దోషులను కార్యనిర్వాహక శాఖ ఆదేశాలతో విడుదల చేశారన్నారు. మీరు కారణాలు చెప్పకపోతే, మేము మా సొంత నిర్ణయాలు తీసుకుంటామన్నారు. 2002 గుజరాత్ అల్లర్లలో బిల్కిస్‌పై సామూహిక అత్యాచారం జరిగింది. ఆమె కుటుంబంలో ఏడుగురు హత్యకు గురయ్యారు. ఈ కేసులో దోషులుగా తేలిన 11 మంది ముందస్తుగా విడుదల కావడాన్ని సవాల్ చేస్తూ గతేడాది నవంబరులో బిల్కిస్ బానో సుప్రీంకోర్టును ఆశ్రయించారు. దీనిపై గుజరాత్ ప్రభుత్వం, కేంద్రప్రభుత్వ వివరణ కోరుతూ మార్చి 27న సుప్రీంకోర్టు ఆదేశాలిచ్చింది. 11 మంది విడుదలకు సంబంధించిన పత్రాలను సమర్పించాలని సూచించింది. వీరిని విడుదల చేసే ముందుకు జరిగిన నేరతీవ్రతను పరిగణనలోకి తీసుకొని ఉండాల్సిందని అభిప్రాయపడింది. ఇదిలావుంటే మే 2వ తేదీన ఈ కేసులో దోషుల రెమిషన్‌ను సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్లను సుప్రీంకోర్టు విచారించనున్నది. ఇప్పటికే దోషులకు నోటీసులు జారీ చేసి వారి స్పందనను కోరింది.

ఎకో ప్రాజెక్టుతో మెరుగైన వైద్యం

వైద్యారోగ్య కుటుంబ సంక్షేమ శాఖ ముఖ్య కార్యదర్శి కృష్ణబాబు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి : ఎకో ఇండియా సంస్థతో ఏపీ వైద్యారోగ్య శాఖ ఒప్పందం చేసుకుందని, ఎకో ప్రాజెక్ట్ ద్వారా ప్రజలకు మరింత మెరుగైన వైద్యం అందిస్తామని రాష్ట్ర వైద్యారోగ్య కుటుంబ సంక్షేమ శాఖ ముఖ్య కార్యదర్శి ఎంటీ కృష్ణబాబు చెప్పారు. ఆరోగ్య వ్యవస్థ బలోపేతం, సిబ్బంది సామర్థ్యం పెంచేలా ఎకో ఇండియా అధ్వర్యంలో ఎకో ప్రాజెక్టుపై రెండు రోజుల సదస్సును ఆయన విజయవాడ లెమన్ ట్రీ హోటల్‌లో మంగళవారం జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. కృష్ణబాబు మాట్లాడుతూ ఎకో ఇండియాతో చేసుకున్న ఒప్పందంలో భాగంగా వివిధ వైద్య కార్యక్రమాలపై వైద్య సిబ్బందికి పూర్తిస్థాయి శిక్షణ ఇస్తామని, గర్భిణీలు, పాలిచ్చే తల్లులు, బీపీ, షుగర్, క్యాన్సర్ బాధితులకు నాణ్యమైన వైద్యసేవలు అందించేలా శిక్షణ ఉంటుందన్నారు. వార్డు బాయ్ నుంచి అత్యున్నత స్థాయి వైద్యాధికారి వరకు ఎకో ప్రాజెక్టుపై శిక్షణ ఇస్తామని వివరించారు. ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఫ్యామిలీ డాక్టర్ విధానం పైనా వైద్య సిబ్బందికి శిక్షణ ఇస్తామని, ప్రతి ఆరు నెలలకు ఒకసారి ఈ శిక్షణ కొనసాగుతుందన్నారు. ఫ్యామిలీ డాక్టర్ విధానం ప్రారంభించిన తర్వాత ప్రతి వ్యక్తి ఆరోగ్య డేటా డిజిటలైజ్ చేస్తున్నామని వివరించారు. ఎమర్జెన్సీ కేసుల్లో చాలామంది స్థానిక ఆస్పత్రులపైనే ఆధారపడతారని, అందుకే గ్రామీణ స్థాయిలో మెరుగైన వైద్యం అందించేలా వైద్య సిబ్బందికి శిక్షణ ఉంటుందన్నారు. ఆశా కార్యకర్తలు, ఏఎన్ఎం తదితర సిబ్బందికి వివిధ విధానాల్లో శిక్షణ ఇస్తారని వివరించారు. ఏపీలో మెరుగైన వైద్య సదుపాయాల ద్వారా ముందస్తు రోగ నివారణ జరుగుతోందని, గ్రామ స్థాయిలోనే దాదాపు 80 శాతం రోగాలకు చికిత్స అందించాలనేదీ ప్రభుత్వ లక్ష్యమన్నారు. రెండేళ్లలో 48 వేలకు పైగా వైద్య సిబ్బందిని నియమించామని, వారందరికీ ఎకో ప్రాజెక్టు ద్వారా శిక్షణ నిర్వహిస్తామని తెలిపారు. ఈ ఏడాది ఐదు వైద్య కళాశాలలను ప్రారంభించబోతున్నామని, ఇప్పటికే విజయనగరం వైద్య కళాశాలకు అనుమతులు వచ్చాయని చెప్పారు. ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్, నేషనల్ హెల్త్ మిషన్ డైరెక్టర్ జె.నివాస్ మాట్లాడుతూ వైద్యారోగ్య విభాగాన్ని బలోపేతం చేయడంలో భాగమే ప్రాజెక్ట్ ఎకో అన్నారు. ఎకో ప్రాజెక్ట్ అసోసియేట్ వైస్ ప్రెసిడెంట్ సందీప్ భల్లా మాట్లాడుతూ ఏపీ వైద్య ఆరోగ్య శాఖ కార్యక్రమాల అమలుకు, వాటిని బలోపేతం చేసేందుకు ఎకో ప్రాజెక్ట్ ఉపయోగపడుతుందన్నారు.

ఇవేం ఎండలు

(మొదటిపేజీ తరువాయి)

అవకాశం ఉందని బయట తిరగడానికి భయపడుతున్నారు. ఏప్రిల్‌లోనే ఎండ తీవ్రత ఈ స్థాయిలో ఉందంటే, ఇక రోహిణీ కార్తెలో పరిస్థితి ఎలా ఉంటుందోనని ప్రజలు బెంబేలెత్తుతున్నారు. ముఖ్యంగా పిల్లలు, గర్భిణీలు, వృద్ధులు ఎండకు తల్లడిల్లిపోతున్నారు. ఇదే పరిస్థితి మరో రెండు రోజులు కొనసాగే అవకాశం ఉందని, అప్రమత్తంగా ఉండాలని డా.బీఆర్ అంబేద్కర్ విపత్తుల నిర్వహణ సంస్థ అధికారులు ప్రజలను హెచ్చరిస్తున్నారు. ఐఎండీ అంచనాల ప్రకారం బుధవారం కూడా రాష్ట్రవ్యాప్తంగా 98 మండలాల్లో వడగాడ్పులు, గురువారం 70 మండలాల్లో వడగాడ్పులు వీచే అవకాశం ఉందని తెలిపారు. ఆ మేరకు క్షేత్రస్థాయిలో ప్రజలకు వడగాడ్పుల హెచ్చరిక ఎప్పటికప్పుడు సందేశాల ద్వారా పంపుతున్నామని, ఈ సమాచారం అందినప్పుడు ప్రజలు తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచిస్తున్నారు. మన్యం జిల్లా కొమరాడలో తీవ్రస్థాయిలో వడగాడ్పులు వీచే అవకాశం ఉందని తెలిపారు. అల్లూరి జిల్లాలో 7, అనకాపల్లిలో 16, తూర్పుగోదావరిలో 2, ఏలూరులో 2, గుంటూరులో 3, కాకినాడలో 10, కృష్ణాలో 2, ఎన్టీఆర్‌లో 8, పల్నాడులో ఒకటి, పార్వతీపురం మన్యంలో 12, శ్రీకాకుళంలో 4, విశాఖపట్నంలో 2, విజయనగరంలో 19, వైఎస్ఆర్‌లో 10 మండలాల్లో వడగాడ్పుల ప్రభావం ఉంటుందని తెలియజేశారు.

రైస్ మిల్లు కూలి నలుగురి మృతి

కర్నాల్: హరియాణాలోని కర్నాల్‌లో ఘోర విషాదం నెలకొంది. మంగళవారం తెల్లవారుజామున 3 గంటల సమయంలో మూడంతస్తుల రైస్ మిల్లు భవనం కూలిపోవడంతో నలుగురు కార్మికులు మృతి చెందారు. మరో 20 మంది కార్మికులకు గాయాలయ్యాయి. ప్రమాద సమయంలో రైస్‌మిల్లులో 150 మంది కార్మికులు నిద్రిస్తున్నట్లు తెలుస్తోంది. ఘటనా స్థలానికి పోలీసులు, సహాయక సిబ్బంది చేరుకున్నారు. శిథిలాల్లో చిక్కుకున్న వారి కోసం సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. క్షతగాత్రులను సమీప ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

ఆలయ భూముల రక్షణకు పటిష్ఠ చర్యలు

ఉప ముఖ్యమంత్రి, దేవాదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: రాష్ట్రంలోని దేవాలయాలు, ధార్మిక సంస్థల భూముల పరిరక్షణ కోసం ప్రభుత్వం కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటుందని ఉప ముఖ్యమంత్రి, దేవదాయ, ధర్మదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ అన్నారు. మంగళవారం విజయవాడలోని శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి దేవస్థానం 6వ అంతస్తులోని శ్రీ మల్లిఖార్జున మహా మండపంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ దేవాలయాల భూములు అన్యాక్రాంతం కాకుండా అవసరమైన అన్ని చర్యలు తీసు కుంటున్నామన్నారు. వివాదాస్పద దేవాలయాల భూములకు త్వరలో విముక్తి కల్పించనున్నట్లు తెలిపారు. అందులో భాగంగానే దేవాదాయ భూముల తనిఖీలు, ప్రాథమిక ఆధారాలు, వివాదంలో ఉన్న భూములు, 22ఏ క్రింద రిజిస్టర్ అయిన భూములు, సర్వే నంబర్‌కు సంబంధించిన సబ్ డివిజన్లు, ఎండోమెంట్, రెవెన్యూ శాఖల ఆధీనంలో ఉన్న భూములు, వివాదాలు లేని ఆస్తులు, శాశ్వతంగా భూమి భద్రత, రీసర్వే సెటిల్‌మెంట్ రికార్డులు, 1బి ప్రతుల పరిశీలన, కోర్టు కేసుల విషయాలు, అన్యాక్రాంతం అయిన భూములు తదితర అంశాలపై ఈరోజు జరిగిన విస్తృత స్థాయి సమీక్షా సమావేశంలో చర్చించామన్నారు. దేవదాయ శాఖ ఎండోమెంట్ కమిషనర్లు, 26 జిల్లాల దేవదాయ శాఖ అధికారులు, దేవాలయాల ఈవోలు, అధికారులు, కార్యనిర్వాహణా ధికా రులు పాల్గొన్న సమీక్షా సమావేశంలో దేవాలయాల భూములు కాపాడటం కోసం అవసరమైన మార్గదర్శకాలు జారీ చేశామని వెల్ల డించారు. ఇప్పటికే దేవదాయ శాఖ భూములను కన్జర్వేషన్ ల్యాండ్‌గా ఇవ్వాలని రెవెన్యూ శాఖతో చెప్పామ న్నారు. ఇందుకు సంబంధించిన ఎన్‌వోసీ కూడా జారీ చేశామన్నారు. మంత్రి స్థాయి నుంచి క్షేత్ర స్థాయి ఉద్యోగుల వరకు దేవదాయ శాఖ ఆస్తులను కాపాడటం ప్రతి ఒక్కరి బాధ్యత అని, ఉద్యోగులందరూ బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తించాలని పిలుపునిచ్చారు. దేవదాయ భూములు దేవుడికే చెందేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. దేవుడికి రావాల్సిన ఆదాయం సక్ర మంగా రాకపోతే కఠిన చర్యలుంటాయని మంత్రి హెచ్చరించారు. రాష్ట్రంలోని దేవాలయాలకు సంబంధించిన ఆస్తుల రికార్డులను భద్రపరిచే ప్రక్రియ పూర్తి పారదర్శకంగా చేపడుతు న్నామన్నారు. ఒక్కసారి ఆస్తుల వివరాలు ఆన్ లైన్‌లో పొందుపరిచాక క్లాసిఫికేషన్ చేస్తామన్నారు. ఈ క్రమంలో రాష్ట్రవ్యాప్తంగా 4,09,000 ఎకరాలను గుర్తించిన దేవదాయ శాఖ, వాటి పరిరక్షణకు తగు చర్యలు చేపట్టిం దన్నారు. వివాదాల్లో ఉన్న దేవదాయ భూముల సమస్యలను సత్వరం పరిష్కరించేలా ఎప్పటికప్పుడు చర్యలు తీసుకుంటున్నామన్నారు. త్వరలోనే రాష్ట్రవ్యాప్తంగా 175 దేవాలయాల్లో పూర్తి స్థాయిలో కంప్యూటరీకరణ ప్రక్రియను పూర్తి చేస్తామని తెలిపారు. ఉత్తరాంధ్ర, కోస్తాంధ్ర, రాయలసీమ ప్రాంతాల నుంచి ఒక్కో ప్రాంతాన్ని పైలట్ ప్రాజెక్టు క్రింద ఎంపిక చేసి సంబంధిత ప్రాంత దేవాలయాల ఆస్తుల వివరాలు ఆన్ లైన్‌లో పొందుపరు స్తామన్నారు. రాష్ట్రంలో దాదాపు 6,000 చిన్న ఆలయాలకు సంబంధించి ధూప, దీప నైవేద్యాల క్రింద ప్రతి నెలా ఆన్ లైన్ ద్వారా రూ.5,000 నేరుగా దేవాలయాల అకౌంట్‌లో జమ చేస్తున్నామని వివరించారు. ఇక ప్రకృతి సహకరించాలని, పాడి పంటలు సమృద్ధిగా పండాలని మే 12 నుంచి 17వ తేదీ వరకు అత్యంత శాస్త్రోక్తంగా ఆగమ శాస్త్ర విధానాలను అనుసరించి 500 మంది రుత్వికులతో విజయవాడలోని ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో 'చండి, రుద్ర, రాజశ్యామల, సుదర్శన సహిత శ్రీలక్ష్మీ మహాయజ్ఞం' ను అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్నట్లు మంత్రి తెలిపారు. దేవదాయ శాఖ, తిరుమల తిరుపతి దేవస్థానం సంయుక్తంగా నిర్వహించే ఈ కార్యక్రమానికి రాష్ట్ర ప్రభుత్వం తరపున ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి హాజరవుతారని తెలిపారు. కార్యక్రమంలో దేవదాయ శాఖ కమిషనర్ ఎస్.సత్యనారాయణ పాల్గొన్నారు.

విద్యుత్ కాంట్రాక్టు కార్మికులను క్రమబద్ధీకరించాలి

ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఓబులేసు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: విద్యుత్ సంస్థల్లో కాంట్రాక్టు కార్మికు లందరినీ క్రమబద్ధీకరించాలని, విద్యుత్ ఉద్యోగులందరికీ 45 శాతం ఫిట్ మెంట్ వెంటనే వేతన సవరణ చేయాలని ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.ఓబులేసు డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేస్తూ, కార్మికులు పోరాడి సాధించుకున్న 44 కార్మిక చట్టాల సవరణ పేరుతో కేంద్ర ప్రభుత్వం నాలుగు కోడ్‌లుగా మార్పు చేసి కార్మికుల హక్కులను కాలరాసేలా చట్టాలను సవరించిందని మండిపడ్డారు. ట్రాన్స్‌కో, జెన్‌కో డిస్కమ్‌లలో పని చేస్తున్న కాంటాక్ట్ కార్మికులందరికీ 163 జీవో ప్రకారం సీఎం జగన్ గతంలో ప్రతిపక్ష నేతగా ఉన్నప్పుడు ఇచ్చిన హామీ మేరకు క్రమబద్ధీకరించాలన్నారు. వారికి పీఆర్సీ అమలు కావాల్సి ఉన్నప్పటికీ ఇంతవరకు అమలు చేయలేదని, 1999-2004 మధ్య నియమించిన ఉద్యోగులందరికీ ఈపీఎఫ్ నుంచి జీపీఎఫ్ మార్పు చేసి పెన్షన్లు కల్పించాలని తెలిపారు. ఏపీ జెన్‌కో నెల్లూరు కృష్ణపట్నం దామోదర సంజీవయ్య థర్మల్ విద్యుత్ పవర్ ప్లాంట్ 2,400 మెగావాట్లను 25 ఏళ్ల లీజు పేరుతో రాష్ట్ర మంత్రివర్గం నిర్ణయించిందని, ప్లాంట్ నష్టాల్లో ఉందనే కుంటి సాకులు చెబుతూ అదానీకి కట్టబెట్టాలని ప్రభుత్వం చూస్తోందన్నారు. ప్రైవేటీకరణ నిర్ణయాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. తెలంగాణలో పీఆర్సీ ఏడు శాతం ఇవ్వడం, అక్కడి ఉద్యోగుల అంగీకారం మేరకే జరిగిందన్నారు. ఆంధ్రప్రదేశ్‌ను తెలంగాణతో పోల్చుకుని పీఆర్సీ ముందుకు పోకూడదని, తెలంగాణ, ఆంధ్ర ఉద్యోగులకు జీతభత్యాలలో చాలా వ్యత్యాసం ఉందని వివరించారు. అన్నీ దృష్టిలో ఉంచుకుని ఆంధ్రప్రదేశ్‌లో విద్యుత్ ఉద్యోగులకు 45 శాతం ఫిట్‌మెంట్ ఇవ్వాలని ఓబులేసు డిమాండ్ చేశారు.

మొక్కజొన్న, పసుపు కొనుగోలు కేంద్రాలేవి?

శనగ పంటకు వేగవంతం చేయాలి

మార్క్‌ఫెడ్ ఎండీకి ఆంధ్రప్రదేశ్ రైతుసంఘం వినతి

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: మొక్కజొన్న, పసుపు పంటల సేకరణకు కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని, శనగ పంట కొనుగోలును వేగవంతం చేయాలని ఆంధ్రప్రదేశ్ రైతుసంఘం డిమాండ్ చేసింది. ఆంధ్రప్రదేశ్ మార్క్‌ఫెడ్ ఎండీ రాహుల్ పాండేకు ఆంధ్రప్రదేశ్ రైతుసంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేవీవీ ప్రసాద్, కార్యదర్శులు పి.జమలయ్య, మల్నీడు యల్లమందరావు, గుంటూరు జిల్లా రైతుసంఘం అధ్యక్షుడు కొల్లి రంగారెడ్డి మంగళవారం ఈ మేరకు వినతిపత్రం అందజేశారు. మొక్కజొన్న, పసుపు, శనగ పంట రైతులు ఎదుర్కొంటున్న సమస్యల్ని ఆయన దృష్టికి తీసుకొచ్చారు. రాష్ట్రంలో మొక్కజొన్న ఐదు లక్షల ఎకరాలకు పైగా సాగుచేశారని, శ్రీకాకుళం, విజయనగరం, తూర్పుగోదావరి, ఏలూరు, బాపట్ల, గుంటూరు, ఎన్టీఆర్ తదితర జిల్లాల్లో మొక్కజొన్న పంట పండించారని వివరించారు. ఈ ఏడాది పత్తిపంట దెబ్బతినడంతో రెండోపంటగా మొక్క జొన్నను రైతాంగం సాగుచేశారని, నెల రోజుల క్రితం క్వింటా మొక్కజొన్న రూ.2,400 ఉండగా, ఇప్పుడు రూ.1,700కు పడిపోయిందని వివరిం చారు. కనీస మద్దతు ధర రూ.1,962 దక్కడం లేదని, వ్యాపారస్తులు సిండికేట్‌గా మారి, ధరలు తగ్గించి రైతుల కష్టార్జితాన్ని దోచుకుంటున్నారని విమర్శించారు. ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయకపోవడమే ఇందుకు కారణమన్నారు. పసుపు పంటను 43,683 ఎకరాల్లో రైతులు సాగుచేస్తున్నారని, పసుపు అధికంగా పండే రాష్ట్రాల్లో ఏపీ ఐదో స్థానంలో ఉందని వివరించారు. అల్లూరి సీతారామరాజు, గుంటూరు, కడప, కృష్ణా, బాపట్ల తదితర జిల్లాల్లో పసుపు గణనీయంగా సాగవు తోందని, పసుపు మార్కెట్‌లో ఏర్పడుతున్న హెచ్చు తగ్గుల కారణంగా రైతులు తీవ్రంగా నష్టపోతున్నా రన్నారు. ఇటీవల కురిసిన అధిక వర్షాలకు ఆరబెట్టిన పసుపు కొమ్ములు తడిచి రంగు మారడంతో వ్యాపారులు అతి తక్కువ ధరకు కొనుగోలు చేస్తున్నారని, మద్దతు ధర క్వింటా రూ.6,850 చొప్పున రైతులకు లభించడం లేదని, ప్రస్తుత మార్కెట్‌లో రూ.4,500 నుంచి రూ.5,500 అధికశాతం మంది రైతులకు దక్కడం లేదని వివరించారు. ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు తెరవకపోవడంతో పసుపు రైతులు నష్టపోతు న్నారు. శనగ పంట 8.27 లక్షల ఎకరాల్లో సాగైందని, కడప, నంద్యాల, అనంత పురం, కర్నూలు, ప్రకాశం, బాపట్ల తదితర జిల్లాల్లో గణనీయంగా పండించారని తెలిపారు. పంట కొనుగోలు చేయడంలో ప్రభుత్వం జాప్యం చేస్తోందని, ఇప్పటి వరకు కేవలం 47 వేల టన్నులు మాత్రమే ప్రభుత్వం కొనుగోలు చేసినట్లు అంచనా ఉందన్నారు. వ్యాపారస్తులు సిండికేట్‌గా మారి రూ.4,400 కంటే తక్కువగా కొనుగోలు చేస్తూ రైతాంగానికి తీవ్ర నష్టం కలిగిస్తున్నారని చెప్పారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి కనీస మద్దతు ధరలకైనా మొక్కజొన్న, పసుపు సేకరణకు వెంటనే కొనుగోలు కేంద్రాలు ప్రారంభించాలన్నారు.

త్వరలో కొనుగోలు కేంద్రాలు: రాహుల్ పాండే

రైతుసంఘం నేతల వినతిపై మార్క్‌ఫెడ్ ఎండీ రాహుల్ పాండే స్పందిస్తూ మొక్కజొన్న, పసుపు సేకరణ కోసం కొనుగోలు కేంద్రాలు త్వరలో ప్రారంభిస్తామని ముందుగా రైతులు పేర్ల నమోదు ప్రక్రియ ప్రారంభించాలని ఆదేశించామని తెలిపారు. శనగ పంటను ఇప్పటికే కొనుగోలు చేస్తున్నామని, దానిని వేగవంతం చేసేందుకుగాను అన్ని జిల్లాల అధికారులతో టెలీకాన్ఫరెన్స్‌లు నిర్వహిస్తామని హామీ ఇచ్చారు.

దిల్లీకి సీఎం జగన్

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: రాష్ట్ర విభజనకు సంబంధించిన అపరిష్కృత అంశాల్లో కొన్ని కొలిక్కి వచ్చాయని ఏపీ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కేఎస్.జవహర్‌రెడ్డి తెలిపారు. రెండ్రోజుల్లో ముఖ్యమంత్రి జగన్ దిల్లీకి వెళతారన్నారు. ఇందుకోసం తన విదేశీ పర్యటననూ జగన్ వాయిదా వేసుకున్నారన్నారు. మంగళవారం సచివాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో జవహర్‌రెడ్డి మాట్లాడుతూ కేంద్ర కార్యదర్శుల సమావేశం కోసం బుధవారం దిల్లీ వెళుతున్నట్లు తెలిపారు. కేంద్ర కార్యదర్శుల సమావేశంతో పాటు ఉన్నత స్థాయిలో నిర్ణయాలు తీసుకోవడానికి సీఎం అవసరం దిల్లీలో ఉందని, అందుకే ఆయన వెళు తున్నారన్నారు. సీఎం దిల్లీ పర్యటనపై మీడియాలో దుష్ప్రచారం జరుగుతోందన్నారు. నిధుల్లేక ఆర్థికశాఖ సూచనల మేరకే జగనన్న వసతి దీవెనను వాయిదా వేసినట్లు జవహర్ రెడ్డి తెలిపారు.

డిసెంబరుకు గిరిజన మ్యూజియం పూర్తి

ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జవహర్‌రెడ్డి

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: అల్లూరి సీతారామ రాజు జిల్లా లంబసింగి గిరిజన స్వాతంత్ర్య సమరయోధుల మ్యూజియం పనులను డిసెంబరు చివరకు పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.ఎస్.జవహర్‌రెడ్డి స్పష్టం చేశారు. దేశవ్యాప్తంగా గిరిజన స్వాతంత్ర్య సమరయోధుల మ్యూజియం నిర్మాణాల ప్రగతిపై మంగళవారం దిల్లీ నుంచి ప్రధాన మంత్రి సలహాదారు అమిత్ ఖేర్ వివిధ రాష్ట్రాల ప్రభుత్వ ప్రధాన కార్యదర్శులతో వీడియో సమావేశం నిర్వహించారు. ఈ వీడియో సమావేశంలో పాల్గొన్న సీఎస్ మాట్లాడుతూ అల్లూరి సీతారామరాజు జిల్లా లంబసింగిలో దాదాపు రూ.35 కోట్ల అంచనాతో గిరిజన స్వాతంత్ర్య సమరయోధుల మ్యూజియం నిర్మిస్తున్నామన్నారు. కేంద్ర ప్రభుత్వ మ్యాచింగ్ నిధులు రూ.15 కోట్లు, సీఎస్ఎస్ పథకం నిధులతో పాటు రాష్ట్ర గిరిజన సంక్షేమ బిల్డింగ్ నిధుల కలిపి దాదాపు రూ.35 కోట్ల అంచనాతో లంబసింగిలో చేపట్టిన ఈ మ్యూజియం నిర్మాణ పనులు శరవేగంగా జరుగు తున్నాయని వివరించారు. ఇప్పటికే అంతర్గత రహదారులు, నీటి సరఫరా పనులు ప్రగతిలో ఉన్నాయని, నాలుగు విభాగాలుగా పనులు కొనసాగు తున్నాయని చెప్పారు. ట్రైబల్ హట్‌తో కూడిన రెస్టారెంట్, ఎంట్రెన్స్ ప్లాజా, యాంపీ థియేటర్, మ్యూజియం, హార్డ్ స్కేపింగ్, ల్యాండ్ స్కేపింగ్, కాంపౌండ్ గోడ వంటి పనులు వేగవంతంగా జరుగుతున్నట్లు తెలిపారు. ఈ వీడియో సమావేశంలో ప్రధాన మంత్రి సలహాదారు అమిత్ ఖేర్ మాట్లాడుతూ వివిధ రాష్ట్రాల్లో మంజూరయిన గిరిజన స్వాతంత్ర్య సమరయోధుల మ్యూజియాల నిర్మాణాలను సకాలంలో పూర్తి చేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శులను కోరారు. ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రజత్ భార్గవ, గిరిజన సంక్షేమ శాఖ కార్యదర్శి కాంతిలాల్ దండే, గిరిజన సంక్షేమ శాఖ సంచాలకులు జె.వెంకట మురళి, అదనపు సంచాలకులు ఇ.రాంబాబు, శ్రీనివాస్ పాల్గొన్నారు.

చీనీ పంటకు గిట్టుబాటు ధర కల్పించాలి

సీఎం జగన్‌కు మల్లికార్జున లేఖ

విశాలాంధ్ర-అనంతపురం అర్బన్: నష్టాల బాటలో నడుస్తున్న చీనీ పంటకు గిట్టుబాటు ధర కల్పించాలని, రైతులకు సరైన మార్కెట్ విధానం ఏర్పాటు చేయాలని ఏపీ రైతు సంఘం అనంతపురం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ మల్లికార్జున మంగళవారం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి లేఖ రాశారు. జిల్లాలో సుమారు లక్ష ఎకరాల్లో రైతులు చీని పంట సాగు చేశారని, పంటకు గిట్టుబాటు ధర లేక రైతులు ఆర్థికంగా నష్టపోతున్నారని తెలిపారు. ప్రభుత్వం చీనీ రైతులకు సరైన మార్కెట్ విధానం, గిట్టుబాటు ధర, కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయకపోవడంతోనే రైతులు ఇబ్బంది పడుతున్నారని పేర్కొన్నారు. లక్షల రూపాయలు పెట్టుబడులు పెట్టి పండించిన పంటకు సమయానికి సరైన ధరలు లేకపోవడంతో రైతన్నలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొం టున్నారని వివరించారు. దళారుల బెడద రైతులను వదలడం లేదని తెలిపారు. గతేడాది ఇదే నెలలో టన్ను 70 వేల నుండి 80 వేల రూపాయలు ధర పలకగా...ఈ ఏడాది అమాంతం ధర తగ్గి టన్ను కేవలం 25 వేల నుండి 30 వేల రూపాయలు మాత్రమే పలుకుతుందని, దీంతో రైతులకు ఏ మేరకు నష్టం జరుగుతోందో ప్రభుత్వం అర్థం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. పంటలకు గిట్టుబాటు ధర కల్పించి న్యాయం చేస్తామని ప్రభుత్వం పదేపదే ప్రకటనలు గుప్పిస్తోందని, ఆచరణలో అమలు కావడం లేదని విమర్శించారు. అనేక కష్టనష్టాలకు గురవుతున్న రైతులను ఆదుకోవడానికి ప్రభుత్వం చర్యలు చేపట్టకపోవడం దారుణమని వ్యాఖ్యానించారు. చీనీ పంట టన్నుకి కనీస మద్దతు ధర 70 వేల రూపాయలు కల్పించాలని, ప్రభుత్వమే కొనుగోలు చేసి రైతాంగాన్ని ఆదుకోవాలని ఆంధ్రప్రదేశ్ రైతుసంఘం మల్లికార్జున సీఎం జగన్‌కు విజ్ఞప్తి చేశారు.

రాబోయే ఎన్నికల్లో మోదీని గద్దె దించుతాం

సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు డేగా ప్రభాకర్



విశాలాంధ్ర-అమలాపురం : రాబోయే ఎన్నికలలో మోదీ ప్రభుత్వాన్ని గద్దె దించుతామని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు డేగా ప్రభాకర్ అన్నారు. మంగళవారం అమలాపురం ప్రెస్ క్లబ్‌లో జరిగిన సీపీఐ జిల్లా విస్తృత కార్యవర్గ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరయిన డేగా ప్రభాకర్ మాట్లాడుతూ ఏడేళ్ల కాలంలో దేశంలో మనువాద, నియంతృత్వ విధానాలతో రాజ్యాంగాన్ని ధ్వంసం చేస్తున్న అప్రజాస్వామిక మోదీ పాలనకు చరమగీతం పాడాలని సీపీఐ, సీపీఎం దేశ వ్యాప్తంగా ప్రచార భేరి కార్యక్రమానికి పిలుపునిచ్చాయని తెలిపారు. అందులో భాగంగా డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లాలో ఈ నెల 22న ప్రచార జాతాను ప్రారంభించుకొని 28న మండపేటలో ముగించాలని జిల్లా కార్యదర్శి ప్రవేశపెట్టిన ప్రతిపాదనను కార్యవర్గం ఏకగ్రీవంగా ఆమోదించి ముందుకు తీసుకువెళ్లాలని నిర్ణయించారు. తొలుత పార్టీ జిల్లా కార్యదర్శి కె. సత్తిబాబు ప్రచార భేరి ఉమ్మడి కార్యక్రమంలో విధి విధానాలను వివరించారు. అన్ని నియోజకవర్గ కార్యదర్శులకు ప్రచార భేరికి సంబంధించిన ప్రచార సామగ్రిని అందించారు. ఈ సమావేశానికి ఆహ్వానితులుగా హాజరయిన డాక్టర్ చెలికాని స్టాలిన్, చెల్లుబోయిన కేశవ శెట్టి ప్రచార భేరి కార్యక్రమంపై సూచనలు చేశారు. సమావేశంలో పెద్దిరెడ్డి రాము, శీలం వెంకటేష్, ఎన్.శ్రీనివాస్, సిహెచ్ తాతారావు జి.రవి, కె.రామకృష్ణ, ఎ.సత్యనారాయణ పాల్గొన్నారు.

పెండింగ్ ప్రాజెక్టులన్నీ పూర్తి చేస్తాం

మంత్రి కొన్న భూములు పేదలకు పంచుతాం

నారా లోకేశ్ హామీలు



విశాలాంధ్ర-ఆస్పరి: తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వస్తే రాయలసీమలో పెండింగ్ ప్రాజెక్టులన్నీ పూర్తి చేస్తామని ఆ పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ హామీ ఇచ్చారు. లోకేశ్ చేపట్టిన యువగళం పాదయాత్ర కర్నూలు జిల్లా దేవనకొండ మండలం మీదుగా ఆస్పరి మండలంలోకి మంగవారం మధ్యాహ్నం ప్రవేశించింది. వలగొండ గ్రామం బస్టాండ్ దగ్గర లోకేశ్‌కు బస ఏర్పాటు చేశారు. విరామం అనంతరం సాయంత్రం అక్కడే ఏర్పాటు చేసిన బహిరంగ సభలో లోకేశ్ మాట్లాడుతూ ఆలూరు నియోజకవర్గ ప్రజల ఉత్సాహం చూస్తే రాష్ట్రంలో సైకో పనైపోయిందని భావిస్తున్నానన్నారు. బ్రిటీషు పాలకులను గడగలాడించిన చరిత్ర ఆలూరు ప్రజలదని, ఇక్కడ ఎందరో పోరాటయోధులు ఉన్నారని గుర్తుచేశారు. ఆలూరు గడ్డపై పాదయాత్ర చెయ్యడం తన అదృష్టంగా భావిస్తున్నానన్నారు. యువగళం పాదయాత్రను అడ్డుకోవడానికి జగన్ అనేక ప్రయత్నాలు చేశారని, ఎమ్మెల్సీ ఎన్నికల్లో యువత నియంత కొమ్ములు వంచారన్నారు. కర్నూలు జిల్లా పశ్చిమ ప్రాంతం కరువుకు నిలయంగా మారిందన్నారు. రాయలసీమ సాగునీటి ప్రాజెక్టులకు బడ్జెట్లో నిధులు కేటాయించకపోవడం దారుణమని విమర్శించారు. వేదవతి ప్రాజెక్టు నిర్మాణానికి చంద్రబాబు 1900 కోట్ల నిధులు కేటాయించి పనులు ప్రారంభించారన్నారు. కార్మికశాఖ మంత్రి గుమ్మనూరు జయరాం ఒక్క పరిశ్రమనైనా ఆలూరుకు తీసుకొచ్చారా అని ప్రశ్నించారు. పరిశ్రమల పేరుతో పేదల నుండి లాక్కున్న భూములను ప్రభుత్వ ధరలకే కొనుగోలు చేసి తిరిగి రైతులకే పంచుతామని, ఆ బాధ్యత తెలుగుదేశం పార్టీ తీసుకుంటుందని హామీ ఇచ్చారు. మంత్రి జయరాం నియోజకవర్గంలో కర్నాటక మద్యం, పేకాట క్లబ్బులు మూడు పువ్వులు...ఆరు కాయలుగా వర్ధిల్లుతున్నాయన్నారు. పశ్చిమ ప్రాంతం అభివృద్ధి కోసం వేదవతి ప్రాజెక్టును 8 టీఎంసీల సామర్థ్యంతో పూర్తి చేస్తామన్నారు. దళితుల గురించి తాను మాట్లాడిన మాటలను వక్రీకరించి, దళితుల్ని అవమానపర్చిన భారతి రెడ్డి క్షమాపణ చెప్పి తీరాల్సిందేన్నారు. సభలో ఉపాధ్యక్షుడు కోట్ల సూర్యప్రకాశ్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే కోట్ల సుజాతమ్మ, యువ నాయకులు రాఘవేంద్రరెడ్డి, పత్తికొండ టీడీపీ బాధ్యులు కేఈ శ్యాంబాబు, ఆలూరు మాజీ బాధ్యులు వైకుంఠం మల్లికార్జున, వైకుంఠం శివప్రసాద్, వ్యాపారవేత్త వైకుంఠం జ్యోతి, మండల కన్వీనర్ పరమారెడ్డి, మాజీ డైరెక్టర్ కృష్ణ యాదవ్, మాజీ వైస్ చైర్మన్ సాలీ సాహెబ్ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగుల సమస్యలపై నిర్లక్ష్యం వద్దు : రవీంద్రనాథ్

విశాలాంధ్ర-విజయవాడ(గాంధీనగర్): ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లను తక్షణమే పరిష్కరించాలని, వారి సమస్యల పరిష్కారంలో ప్రభుత్వానికి నిర్లక్ష్యం తగదని ఏఐటీయూసీ ఏపీ అధ్యక్షులు రావులపల్లి రవీంద్రనాథ్ అన్నారు. ఆయన మంగళవారం విజయవాడ ధర్నా చౌక్‌లో సీపీఎస్ రద్దు-ఓపీఎస్ అమలు కోసం చేపట్టిన ధర్నాలో మాట్లాడుతూ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించడంపై ప్రభుత్వం నిర్లక్ష్య వైఖరిని విడనాడాలని డిమాండ్ చేశారు. సీపీఎస్‌ను రద్దు చేసి ఓపీఎస్‌ను అమలు చేయాలని, ఆ మేరకు ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. సీపీఎస్ వల్ల ఉద్యోగుల్లో అనేక మంది తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొన్నారని, ప్రభుత్వోద్యోగుల హెల్త్‌కార్డులను కార్పొరేట్ ఆసుపత్రులు అంగీకరించడం లేదని, రిటైర్ అయిన ఉద్యోగి ఏదేని కారణంతో చనిపోతే ఆ కుటుంబానికి ప్రయోజనాలు అందడం లేదని రవీంద్రనాథ్ అన్నారు. ఉద్యోగులకు బయికాలు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. ఉద్యోగులను అవహేళన చేయడాన్ని వైసీపీ శ్రేణులు మానుకోవాలన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని, వారికి రావాల్సినవి అందజేయాలని లేనిపక్షంలో మలివిడత ఆందోళనకు సిద్ధంగా ఉన్నామని హెచ్చరించారు. ఏపీ జేఏసీ అమరావతి రాష్ట్ర కోశాధికారి వీవీ మురళీకృష్ణ నాయుడు మాట్లాడుతూ పీఆర్సీ, డీఏ బకాయిలు, ఎర్న్/సరెండర్ లీవులు, మెడికల్ రీయింబర్స్‌మెంట్, రిటైర్మెంట్ తర్వాత చనిపోయిన వారికి చెల్లింపులను చేపట్టాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఏది ఎప్పటిలోగా చెల్లిస్తారో లిఖితపూర్వకంగా హామీ ఇవ్వాలన్నారు. సీపీఎస్ రద్దు, ఒప్పంద ఉద్యోగుల క్రమబద్ధీకరణ, ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల జీతాలు పెంపు వంటి అంశాల్లో నేటికీ స్పష్టత రాలేదని చెప్పారు. ఒకటో తేదీనే జీతాలు/ పెన్షన్ల చెల్లింపు, హెల్త్ కార్డుల పుర్తిస్థాయి వినియోగంపై కూడా స్పష్టతివ్వాలని కోరారు. ధర్నాలో జేఏసీ నేతలు డి.ఈశ్వర్, వైఎస్ రావు, జీపీఎస్ నగరాధ్యక్షులు హుస్సేన్, డి.శ్రీనివాస్, తిరుమల శివయ్య, బి.కిషోర్‌కుమార్ పాల్గొన్నారు.

పీఏసీఎస్‌లో ప్రైవేట్ పెట్టుబడిపై రైతు, ఉద్యోగ సంఘాలతో చర్చించాలి

సీపీఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ ఆదేశాలపై వ్యవసాయ పరపతి సంఘాల (పీఏసీఎస్) లో ప్రైవేట్ పెట్టుబడిని అనుమతిస్తూ రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయానికి వ్యతిరేకంగా సహకార ఉద్యోగ సంఘాలు సాగిస్తున్న ఆందోళనకు మద్దతు ప్రకటిస్తున్నట్లు, దీనిపై రైతు, ఉద్యోగ సంఘాలతో చర్చించాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేస్తూ, పీఏసీఎస్‌ను కామన్ సర్వీస్ సెంటర్లుగా మారుస్తూ ఈనెల 17న ప్రభుత్వం జీవో జారీ చేసిందని గుర్తు చేశారు. సహకార సంఘాలు చేసే అన్ని రకాల వ్యాపారాలు ప్రైవేట్ పరం కానున్నాయని, రైతు భరోసా కేంద్రాలూ వాటికి అనుసంధానం అవుతాయని వివరించారు. ధాన్యం తదితర పంటల ఉత్పత్తుల సేకరణలో మిల్లర్ల ఇష్టారాజ్యం అవుతోందని, ఇప్పటికే ధాన్యం అమ్ముడు పోక రైతులు నానా అవస్థలు పడుతున్నారని పేర్కొన్నారు. రికార్డులలో మద్దతు ధర చూపిస్తూ ఆచరణలో ధరలను తగ్గిస్తూ రైతులను ముంచుతున్న వైనం అందరికీ తెలుసని, ఈ జీవోను ఉపసంహరించాలన్నారు. సహకార రంగంలో ప్రైవేట్ వ్యాపారస్తులకు ద్వారాలు తెరుస్తూ 2022 నవంబరులో రాష్ట్ర ప్రభుత్వం 1964 సహకార చట్టానికి సవరణ చేసిందని గుర్తు చేశారు. దాని ప్రకారం 50 శాతం వాటా ప్రైవేట్ వ్యక్తుల చేతిలోకి పోతాయని, ప్రైవేట్ ఫైనాన్సింగ్ బ్యాంకు ప్రతినిధులూ ఇందులో చొరబడతారని ఆందోళన వ్యక్తం చేశారు. కేంద్రం ఒక పథకం ప్రకారం సహకార రంగాన్ని తన చేతుల్లోకి తీసుకుని భూస్థాపితం చేస్తోందని, రైతుల ఆస్తిగా ఉన్న సహకార రంగాన్ని ప్రైవేట్ కంపెనీల పరం చేసే ప్రక్రియలో భాగంగానే రాష్ట్ర ప్రభుత్వం ఈ జీవో తెచ్చిందన్నారు. తక్షణమే ఈ జీవోను ఉపసంహరించుకుని సహకార రంగాన్ని బలోపేతం చేయాలని, దీని కోసం రైతు, ఉద్యోగ సంఘాలు చేసే ఆందోళనకు మద్దతు ప్రకటిస్తున్నామని శ్రీనివాసరావు తెలిపారు.

నైపుణ్యాభివృద్ధితో జీవనోపాధి: వెంకయ్యనాయుడు

విశాలాంధ్ర-రాజాం: రాజాంలోని జీఎంఆర్‌వీఎఫ్ క్యాంపస్‌లో నాబార్డు మద్దతుతో నడుస్తున్న నైపుణ్యాభివృద్ధి కేంద్రాన్ని మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్య నాయుడు మంగళవారం సందర్శించారు. రిఫ్రిజిరేషన్, ఎయిర్ కండీషనింగ్ కోర్సులో శిక్షణ పొందిన విద్యార్థులతో వెంకయ్య నాయుడు సంభాషించారు. శిక్షణ, జీవనోపాధి, ఉపాధిని కనుగొనడంలో స్కిల్ డెవలప్‌మెంట్ దోహదపడుతుందని ఆయన చెప్పారు. పారిశ్రామిక వేత్తగా ఎదగాలని, ఇతరులకు ఉపాధి కల్పించాలని ఆకాంక్షించారు. నాబార్డ్ డీడీఎం నాగార్జున... రైతు ఉత్పత్తిదారుల సంఘాలు, స్వయం సహాయక సంఘాలలో నాబార్డు అభివృద్ధి పనుల గురించి వివరించారు.

సీనియర్ జర్నలిస్ట్ రామకృష్ణారావు మృతి

విశాలాంధ్ర బ్యూరో-విశాఖపట్నం: సీనియర్ జర్నలిస్ట్ ఆకిరి రామకృష్ణారావు మంగళవారం ఉదయం విశాఖపట్నం మద్రి పాలెంకు చెందిన జర్నలిస్టు కాలనీలోని స్వగృహంలో మృతి చెందారు. ఆయన ఆకాశ వాణి, దూరదర్శన్ విశాఖపట్నం, హైదరాబాద్, దిల్లీ కేంద్రాల డైరెక్టర్‌గా పని చేశారు. ఆకిరి రామకృష్ణారావు మృతి పట్ల ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రెస్ అకాడమీ మాజీ చైర్మన్ అదపాక సత్యారావు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఎక్కువ కాలం ఆకాశవాణి, దూరదర్శన్ వార్తా విభాగం ఇన్‌ఛార్జ్‌గా ఉన్న రామకృష్ణారావు జర్నలిస్టులతో సత్సంబంధాలు నడిపే వారిని, ఎంతో ఆత్మీయత కనబరిచేవారని తెలిపారు. రాష్ట్రపతులు, ప్రధాన మంత్రులు, ఇతర వీవీఐపీల పర్యటనల సందర్భంగా కృష్ణారావు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించేవారని గుర్తు చేశారు. ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

సంపాదకీయం

సుప్రీంకోర్టు చట్టబద్ధ పాలనకు పూచీ పడ్తుందా?

ఉత్తరప్రదేశ్‌లో రాజకీయ నాయకుడి అవతారమెత్తిన కరడుగట్టిన మాఫియా నాయకుడు అతీఖ్ అహమద్, ఆయన సోదరుడు అష్రాఫ్‌ను పోలీసు నిర్బంధంలో ఉండగానే ఇతరులెవరో కాల్చి చంపడంపై స్వతంత్ర విచారణకు ఆదేశించాలన్న అభ్యర్థనను సుప్రీంకోర్టు అంగీకరించింది. వచ్చే సోమవారం విచారణ జరగవచ్చు. న్యాయవాది విశాల్ తివారీ అతీఖ్ అహమద్, ఆయన సోదరుడి హత్యతో పాటు ముఖ్యమంత్రి యోగీ ఆదిత్యనాథ్ హయాంలో 2017 నుంచి జరిగిన 183 ఎన్ కౌంటర్ల మీద కూడా త్వరితంగా విచారణ చేపట్టాలని సుప్రీంకోర్టులో అర్జీ పెట్టుకున్నారు. దీనికి సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి డి.వై. చంద్ర చూడ్ అంగీకరించారు. చట్టబద్ధ పాలనను పరిరక్షించడానికి నిర్దిష్టమైన మార్గదర్శకాలు, నిర్దేశాలు జారీ చేయాలని కూడా న్యాయవాది తివారీ తన పిటిషన్ లో కోరారు. తమ కళ్లెదుటే ముగ్గురు వ్యక్తులు అతీఖ్ అహమద్ ను ఆయన సోదరుడు అష్రాఫ్ ను కాల్చి చంపడం దేశమంతటినీ కలవరపరచింది. అంతకన్నా ఘోరమైన అంశం ఏమిటంటె ఈ కాల్పులు జరుపుతున్నప్పుడు కానీ ఆ తరవాత కానీ పోలీసులు ఆ ముగ్గురి మీద ఎలాంటి చర్యా తీసుకోకపోవడం పోలీసుల అసమర్థతకు మాత్రమే తార్కాణం కాదు. యోగీ ఆదిత్యనాథ్ ప్రభుత్వమే ఎన్ కౌంటర్లను బాహాటంగా ప్రోత్సహిస్తున్నప్పుడు పోలీసులు ఇంతకన్నా భిన్నంగా వ్యవహరిస్తారను కోలేం. తమ పని ముగించిన తరవాత లవలేశ్ తివారీ, సన్నీ సింగ్, అరుణ్ మౌర్య ఆయుధాలు కింద పారేసి జై శ్రీరాం అన్న నినాదాలు చేసి తాము లొంగి పోతున్నామని ప్రకటించారు. తామూ గొప్ప మాఫియా నాయకులుగా చెలామణీ కావడానికే ఈ హత్యకు పాల్పడ్డామని ప్రస్తుతం జ్యుడీషియల్ నిర్బంధంలో ఉన్న హంతకులు చెప్పారట. ఇదీ జనం దృష్టిని మళ్లించడానికి పోలీసులు అల్లిన కట్టుకథలాగే కనిపిస్తోంది. ఆ ముగ్గురూ దిగువ మధ్య తరగతికి చెందిన వారే. అలాంటప్పుడు వారి దగ్గర అత్యంత ఖరీదైన పిస్తోళ్లు ఎక్కడి నుంచి వచ్చినట్టు? శక్తిమంతమైన వారెవరో వారికి దన్నుగా నిలవక పోతే ఇంత సాహసానికి వారు ఒడిగట్టి ఉండరు. ఈ సంఘటనపై పోలీసు ఉన్నతాధికారులెవరూ ఇప్పటిదాకా పెదవి విప్ప లేదంటే ఈ మొత్తం వ్యవహారంలో నిగూఢమైన ఆంతర్యం ఏదో ఉన్నట్టే కనిపిస్తోంది. యోగీ ఆదిత్యనాథ్ ప్రభుత్వం మాత్రం వెంటనే ఒక న్యాయ విచారణతో పాటు మొత్తం మూడు రకాల విచారణలకు ఆదేశించింది. విచారణ జరిపే వారిలో నిష్పక్షపాతంగా ఉండేవారు ఒక్కరైనా ఉన్న దాఖలాలు లేవు. పనిలో పనిగా ప్రభుత్వంలో ఉన్న వారికి భద్రత మరింత పెంచారు. ఇదీ దృష్టి మళ్లించే ఉద్దేశంతోనే జరిగినట్టు ఉంది. వీరిద్దరికీ వైద్యం చేయించడం కోసం గత శనివారం రాత్రి దాదాపు పది గంటల సమయంలో పోలీసులు ఆసుపత్రికి తీసుకొచ్చినప్పుడు ఈ హత్యలు జరిగాయి. ఆసుపత్రి వర్గాల వారు చెప్పిన దాన్నిబట్టి నిర్బంధంలో ఉన్న అన్నదమ్ములిద్దరినీ తీసుకొస్తున్నట్టు ముందుగా తెలియజేయనే లేదట. కేవలం 15 నిమిషాల ముందే ఈ విషయం ఆసుపత్రి వారికి తెలిసింది. అలాగైతే ఆసుపత్రి వారికే ముందుగా సమాచారం ఇవ్వనప్పుడు అక్కడికి పత్రికా విలేకరులు ఎలా వచ్చినట్టు? పత్రికా విలేకరుల బృందంలో దూరిపోయిన ముగ్గురు యువకులకు ఈ సమాచారం ఎవరు అందించి నట్టు? ఈ హత్యలు జరగడానికి కొద్దిగా ముందే అతీఖ్ అహమద్ కుమారుడు అసద్ అంత్యక్రియలు జరిగాయి. కొడుకు అంత్యక్రియలకు అతీఖ్‌ను హాజరు కానివ్వలేదు. అసద్ కూడా ఎన్‌కౌంటర్లోనే మరణించాడు. ఇంత కట్టుదిట్టం చేసినవారు ఆసుపత్రికి హఠాత్తుగా ఎందుకు తీసు కొచ్చారు అంటే సమాధానం లేదు. ఒక వేళ తమకు ముందే చెప్పి ఉంటే నిర్బంధంలో ఉన్న వారి దగ్గరికే వైద్య బృందాన్ని పంపించి ఉండేవాళ్లం అని ఆసుపత్రి వర్గాల వారు అంటున్నారు.

అతీఖ్ అహమద్‌ను ఆయన సోదరుడిని హతమార్చడం దైవ నిర్ణయం అని ఉత్తరప్రదేశ్ ఆర్థికమంత్రి సురేశ్‌ఖన్నా అన్నారంటే యోగీ ప్రభుత్వం ఎన్‌కౌంటర్ల విషయంలో ఇదివరకు సుప్రీంకోర్టు ఇచ్చిన ఆదేశాలను కూడా ఖాతరుచేయడం లేదని రుజువు అవుతోంది. ముఖ్యమంత్రి యోగీ ఆదిత్య నాథ్ మంగళ వారం మరో సందర్భంలో మాట్లాడుతూ ఏ మాఫియా ముఠా కూడా పరిశ్రమలకు అడ్డు తగలలేదని హామీ ఇవ్వడం కూడా ఎన్ కౌంటర్లను ఆయన ప్రభుత్వం ఒక విధానంగా అనుసరిస్తున్నట్టు స్పష్టం అవుతోంది. అతీఖ్ అహమద్ గుజరాత్ జైలులో ఉంటే ఇంకో కేసులో విచారణ కోసం ప్రయాగ్‌రాజ్ (అలహాబాద్) తీసుకొచ్చారు. అప్పుడే ఉత్తరప్రదేశ్ పోలీసులు తనను మట్టు బెడ్తారని అతీఖ్ ఆందోళన వ్యక్తం చేశారు. అలాగే జరిగింది. తనను అలహాబాద్ జైలుకు తరలించకూడదని పెట్టుకున్న పిటిషన్ ను సుప్రీంకోర్టు తోసిపుచ్చింది. అతీఖ్ ను గుజరాత్ నుంచి అలహాబాద్ తీసుకెళ్లడం అంటే మరణ శిక్ష విధించినట్టేనని అతీఖ్ న్యాయవాది మొరపెట్టుకున్నారు. ఆయన వ్యక్తం చేసిన భయాందోళన నిజమైంది. అతీఖ్, అష్రాఫ్‌కు కావలసిన భద్రత కల్పిస్తామని యోగీ ప్రభుత్వం సుప్రీంకోర్టుకు హామీఇచ్చింది. తమ ఆదేశాన్ని ధిక్కరించిన యోగీ ప్రభుత్వం విషయంలో సుప్రీంకోర్టు ఏం చర్య తీసుకుంటుందో తెలియదు కానీ యోగి ఇచ్చిన హామీ కూడా బాబరీ మసీదు విషయంలో అప్పటి ముఖ్యమంత్రి కల్యాణ్ సింగ్ ఇచ్చిన హామీలాగే ఉల్లంఘించడానికే ఉపకరించింది. మాఫియాను మట్టిగరిపిస్తాం అని గత ఫిబ్రవరిలో యోగి ఆదిత్య నాథ్ చేసిన ప్రకటనను సుప్రీంకోర్టు ఎందుకు పరిగణించలేదో అంతుబట్టదు. యోగి ప్రకటనను అత్యున్నత న్యాయస్థానం చట్ట వ్యతిరేకమైందిగా భావించి ఉండాల్సింది. యోగి ఆదిత్యనాథ్ నేరస్థులను మట్టు బడ్తాం అని చెప్తున్నా ఆయన సామాజిక వర్గానికి చెందిన 32 మంది మాఫియానాయకులు ఇప్పటికీ బలాదూరుగా తిరుగుతూనే ఉండడం యోగిపాలనలో పక్షపాతవైఖరికి నిదర్శనం. ఇదే యోగీ ఆదిత్య నాథ్ లోకసభ సభ్యుడిగా ఉన్నప్పుడు 2006లో తన ప్రాణాలకు ముప్పు ఉంది కనక భద్రత కల్పించాలని అప్పటి లోకసభ స్పీకర్ సోమనాథ్ చటర్జీ ముందు కళ్లనీళ్లు పెట్టుకున్నారు. ఇప్పుడు మాత్రం ఆటవిక న్యాయం అమలు చేస్తున్నారు. ఆయనకు చట్టబద్ధ పాలన మీద ఏ మాత్రం నమ్మకం లేదు. జనవాణిని లెక్క చేయరు. చట్టాన్ని ఉల్లంఘించి బుల్డోజర్ల ద్వారా సామాన్యుల, ముఖ్యంగా ముస్లింల ఇళ్లు కూల్చి వేయడం, ఎన్‌కౌంటర్లను ఆశ్రయించడం ఆయన పాలన ఎంత ప్రజాకంటకమైందో తెలియజేస్తోంది. హంతకులు ముగ్గురూ అతీఖ్, అష్రాఫ్‌ను పోలీసులు తీసుకు రాక ముందే వైద్యకళాశాల ఆసుపత్రి దగ్గర ప్రత్యక్షమయ్యారు. నిర్బంధంలోఉన్న వారిని ఆసుపత్రికి తీసుకొస్తున్నట్టు పోలీసులు చెప్పకపోతే పత్రికా ప్రతినిధులైనా సంఘటనాస్థలానికి ఎందుకు వస్తారు. ఈ విలేకరుల మొఖాలు పోలీసులకు పరిచితమైనవేగా! అలాంటప్పుడు హంతకులు విలేకరులలో కలిసిపోయి హత్యకు పాల్పడ్డారంటే నమ్మడం కష్టం.

అడుగంటుతున్న భూగర్భ జలాలు

ప్రకృతి ప్రసాదించిన సహజవనరులతోనే ప్రాణికోటి మనుగడ సుసాధ్యం అయ్యింది. ఏమీ అడగకుండా అన్నీ అందుబాటులో ఉంచింది భూమాత. గాలి, నేల, నీరు అనే మూడు అత్యుత్తమవనరులను అందించింది. నేల తల్లి, వాయు దేవుడు, గంగామాతలను ఆరాధిస్తూ జీవిస్తున్నారు. నీరు ప్రాణాధారమయ్యింది. నీటి నిల్వల్లో సాగరాలు, సరస్సులు, చెరువులు, ఆనకట్టలు, భూగర్భజలాలు, ఉపరితలజలాలు, మంచుకొండలు, గ్లేసియర్లు లాంటివి ప్రముఖంగావస్తాయి. ఉపరితల జలవనరులు, భూగర్భ జల సంపదల తోనే సకల జీవరాశులు మనుగడను సాగిస్తున్నాయనడంలో ఎలాంటి అతిశయోక్తి లేదు. భూఉపరితల జలాలతో పాటు భూగర్భ జల వనరులను కాపాడుకోవడానికి వేరు వేరు మార్గాలను అనుసరించాల్సి ఉంటుంది. ఉపరితల జల వనరులు పెరిగితే భూగర్భ జలాలు సమృధిగా లభిస్తాయనే విషయం మనకు తెలుసు. ఊరిచెరువు మత్తడిదునికితే ఆ ఊరి వ్యవసాయ బావుల్లో భూగర్భ జలవనరులు పొంగిపొర్లుతూ గ్రామదేవత సస్య శ్యామలంగా హరిత తివాచీలను పరిచినట్లు ఆనందాల విందును చేస్తుంది.

నానాటికీ తరిగిపోతున్న ఉపరితల జలరాశులను కళ్లారా చూస్తున్న మానవ సమాజం తగు ముందు జాగ్రత్తలను తీసుకోవాల్సిన సమయం ఆసన్నమైంది. పారిశుధ్య వ్యవస్థలు, పరిశ్రమలు, వ్యవసాయం, పర్యావరణ వ్యవస్థలు, వాతావరణ మార్పులకు భూగర్భ, ఉపరితల జలాలు ఆధారం. భూగర్భ జలనిధులు తరిగిన కొలది నీటి కొరత, నీటి నాణ్యతకు తూట్లు పడడం జరుగుతున్నది. మే-2022లో నిర్వహించిన "సుస్థిర అభివృద్ధి లక్ష్యాల సాధనకు నీరు కీలకం" అంశంపై అంతర్జాతీయ సదస్సుతో పాటు డిసెంబర్8న 2022న జరిగిన 'భూగర్భ జలాలపై శిఖరాగ్ర సమావేశం'తో పాటు 23-24మార్చిలో నిర్వహించిన ఐరాస సదస్సు నేపథ్యంలో భూగర్భ జల అంశానికి మరోసారి ప్రాధాన్యం సంతరించుకున్నది. ప్రపంచ దేశాల్లో భూగర్భ జలాల మీద ఇండియా అత్యధికంగా ఆధారపడిఉన్నది. 2017లో 248.69బిలియన్ క్యూబిక్‌మీటర్స్ నీరు అందుబాటులో ఉండగా, ఇండియాలో ఉపయోగించే భూగర్భనీటి నిధుల్లో 89శాతం వ్యవసాయ రంగానికి, 9శాతం గృహఅవసరాలకు,2 శాతం పారిశ్రామిక అవసరాలకు వాడుతున్నాం.

కేంద్ర భూగర్భ జలాల బోర్డు అంచనాల ప్రకారం వార్షికంగా అందుబాటులో ఉండే భూగర్భ జలాల్లో 70శాతం వరకు మాత్రమే వాడుకో వచ్చని నిర్ణయించారు. భారతదేశం 2004లో 58 శాతం, 2017లో 63 శాతం వరకు భూగర్భ జలాలను వినియోగించడం గమనించారు. దేశం లోని పంజాబ్, రాజస్థాన్, హర్యానా, ఢిల్లీ, చండీఘర్, హిమాచల్, తమిళనాడు, పుదుచ్చేరి రాష్ట్రాలు దాదాపు 70 శాతం వరకు వాడడం జరిగింది. భారతంలోని 22 రాష్ట్రాలు కేంద్రపాలిత ప్రాంతాల్లోని 534 జిల్లాల్లోని 202జిల్లాలు దాదాపు 71 నుంచి 385శాతం వరకు వినియోగించు కోవడం మరింత భయానికి కారణమవుతున్నది. 2030 నాటికి దేశంలోని అన్ని జిల్లాలు 70శాతం వరకు మాత్రమే వాడుకునేలాచర్యలు తీసుకోవడం ప్రారంభమైంది. భూగర్భ జలాలను అధికంగా తోడినపుడు జలంలో ప్రమాదకర ఫ్లోరైడ్, ఐరన్, లవణ ధర్మం, నైట్రేట్స్, ఆర్సెనిక్ పరిమాణాలు పెరిగి ప్రజారోగ్యం సంక్షోభంలో పడవచ్చని హెచ్చరిస్తున్నారు. 2006లోనే 109 జిల్లాలో నైట్రేట్ సమస్యలను ఎదుర్కోగా నేడు 335 జిల్లాల నీటి నాణ్యతలు ప్రమాదపు అంచున నిలబడడం గమనించారు.

ప్రస్తుత 'కేంద్ర జలాల కమిషన్'తో పాటు 'కేంద్ర భూగర్భ జలాల బోర్డు'లను ఏకం చేస్తూ భూగర్భ, ఉపరితల జలాల నియంత్రణకు నడుం బిగించాలని 2016లోనే 'మిహిర్ షా కమిటీ' సిఫార్సు చేయడం కూడా గుర్తు చేసుకోవాలి. స్థానిక వనరులను దృష్టిలో ఉంచుకొని వర్ష నీరు, ఉపరితల జలం, నేలలో నీరు భూగర్భ జల లభ్యతలను పరిగణనలోకి తీసుకొని అవసర ప్రణాళికలు రూపొందించాల్సి ఉంటుంది. భూగర్భ జలాలతో ఉపరితల జలాలను అనుసంధానం చేయడానికి ప్రాంతాల వారీగా చొరవ తీసుకోవాలి. ఉపరితల, భూగర్భ జలాల లభ్యతల ఆధారంగానే వ్యవసాయ పంటలను, పంటల సాంద్రతలను నిర్ణయించు కోవాలి. నేడు అనేక రాష్ట్ర ప్రభుత్వాలు ఉచిత కరెంట్ అందుబాటులో ఉంచడంతో రైతులు విచక్షణారహితంగా వేయి మీటర్ల లోతు వరకు బోర్లను వేసి భూగర్భ జలాలను పాతాళంలోంచి పైకి లాగడంతో భవిష్యత్తు తరాలు ప్రమాదంలో పడనున్నాయని గమనించాలి. భూగర్భ జలాలతో నీటి ఎద్దడి, శుష్క భూములు, పాక్షిక శుష్క ప్రాంతాల అవసరాలు తీరడానికి ప్రభుత్వ చట్టాలకు మరింత పదును పెట్టాల్సిన అగత్యం ఏర్పడుతున్నది.

భూగర్భ జలాల లభ్యతతో సామాజిక-పర్యావరణ సవాళ్లు ముడిపడి ఉన్నాయి. ప్రభుత్వాలు సాంకేతిక, ఆర్థిక, న్యాయపరమైన, పాలనపరమైన మధ్యవర్తిత్వాలు సకాలంలో జరిగితే రాబోయేతరాలకు నీటిలభ్యత సమస్యలు ఉండవని గమనించాలి. జలంతో జీవనం, జీవనంతోనే ఆరోగ్యం సిద్ధిస్తాయని ఆశిద్దాం. భూగర్భ, ఉపరితల జలవనరులను అమూల్య జాతిసంపదగా గుర్తించి కాపాడుకోవాలి.

మధుపాళి

ఏడేళ్లుగా రోజుకు వందకోట్ల బ్యాంకు మోసాలు

నంటూ బెనర్జీ

స్టాక్ మార్కెట్‌లలో కొన్ని కంపెనీల షేర్లను అమానుషంగా ధర పెంచి వాటిపై భారీగా బ్యాంకు రుణాలు తీసుకోవడం ఎక్కువైంది. ఇలా తీసుకున్న రుణాలు లక్షలకోట్లలో ఉన్నాయి. అనేకమంది బడాబాబులు తీసుకున్న రుణాలు ఎగవేసి విదేశాలకు పారిపోయారు. చాలామంది దేశంలోనే ఉన్నారు. బ్యాంకులకు చెల్లించని రుణాలను పుస్తకాలలో సర్దుబాటుచేసి వాటిని నిరర్థక ఆస్తులుగా పరిగణించి రద్దు చేస్తున్నారు. ఇటీవల కుంభకోణానికి పాల్పడిన అదానీ గ్రూపు కూడా షేర్ల ధరలను కృత్రిమంగా పెంచి వేల కోట్లు బ్యాంకుల నుంచి రుణాలు తీసుకున్నట్లుగా ఆరోపణలు వచ్చాయి. అన్నిటికంటే ఆశ్చర్యకరమైన అంశం గత ఏడేళ్లుగా ప్రధాని నరేంద్ర మోదీ పాలనలో రోజుకు వందకోట్ల రూపాయల బ్యాంకు మోసాలు జరిపినట్లుగా రిజర్వు బ్యాంకు (ఆర్‌బీఐ) అంగీకరించింది. ఆర్‌బీఐ బైటపెట్టలేని అంశాలు ఇంకాఎన్నో ఉన్నాయి. 2015 ఏప్రిల్ నుండి 2021 డిసెంబరు నాటికి 2.5లక్షల కోట్ల ఆర్థిక మోసాలు జరిగినట్లు గుర్తించారు. లిస్టెడ్ కంపెనీలు కూడా ఇలాంటి మోసాలకు పాల్పడ్డాయి. అయితే రుణాలిచ్చే బ్యాంకులు, లేదా ఆర్థికసంస్థలు స్టాక్‌మార్కెట్లలో షేర్లు, ఆస్తులు నిజ విలువను తెలుసుకోవలసి ఉంటుంది. కంపెనీలకు భారీ మొత్తాలను రుణాలుగా ఇచ్చేసమయంలో బ్యాంకు నియమ, నిబంధనలను తప్పనిసరిగా పాటించాలి. ఆస్తులు, షేర్ల ధరల అంచనాలను తప్పుగా వేసినట్లయితే అవి చివరికి ఆర్థిక నష్టాలకు గురిచేస్తాయి. రుణాలు తీసుకున్నవారు తిరిగి చెల్లిస్తారా లేదా అనే అంశాలను కూడా పరిగణలోకి తీసుకోవాలి. అయితే ఇలాంటి అంశాలను అలక్ష్యంచేసి రుణాలు పొందేవారితో కుమ్మక్కయ్యే అవకాశాలు కూడా ఉన్నాయి.

షేర్ల ధరలు కొనుగోలుకు, సంపాదనకు మధ్య నమ్మలేనంత ఎక్కువగా తేడా ఉంటుంది. పెంచిన ధరమీదే రుణాలు ఇస్తున్నారు. ఇలాంటి రుణాలే అత్యధిక సమస్యగా మారుతుంది. రుణాలిచ్చిన ఆర్థిక సంస్థలు లేదా బ్యాంకులు అమాంతం పెంచిన షేర్ల ధరలను పట్టించుకోకుండా తాకట్టుపెట్టుకుని రుణాలు ఇస్తున్నందునే అవి ఆర్థికమోసాలకు గురవుతున్నాయి. షేర్ల ధరలను సక్రమంగా అంచనా వేయకపోవడం అనేది చాలా ప్రాధాన్యతగల అంశం. ఇచ్చిన రుణాలు

తిరిగి చెల్లించడానికి తగినంత విలువైన ఆస్తిని తాకట్టుపెట్టుకోవడం అవసరం. మన స్టాక్‌మార్కెట్‌లలో దాదాపు 18 లిస్టెడ్ కంపెనీలు అధికవిలువకు షేర్లను తాకట్టుపెట్టుకుని రుణాలను మంజూరుచేసే లాంటి కంపెనీలలో అదానీ కంపెనీ ఒక్కొక్క షేరు ధరను అమాంతం 254రూపాయల విలువగా పెంచినట్టు తెలుస్తోంది. ఒక్కొక్కసారి 100నుంచి 200వరకు అధిక విలువను వేసినట్టు సమాచారం. అయితే అదానీ కంపెనీల షేర్లు అత్యధికంగా దిగువస్థాయికి పడిపోయాయన్న సమాచారం ఉంది.

గత ఏడాది పార్లమెంటులో ఆర్థిక శాఖ సహాయమంత్రి బ్యాంకులు 11.17లక్షలకోట్ల రుణాలను గత ఆరేళ్లకాలంలో అంటే 2021-22 ఆర్థిక సంవత్సరంనాటికి రద్దు చేసినట్లు వెల్లడించారు. అంతక్రితం 5ఏళ్ల కాలంలోనే షెడ్యూల్డ్ వాణిజ్యబ్యాంకులు 10.09లక్షల కోట్లు రద్దు చేసినట్లు ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ వెల్లడించారు. ప్రజల కష్టార్జితం బ్యాంకుల్లో డిపాజిట్లు చేస్తారు. వీటిపై ఇచ్చే అతి తక్కువ వడ్డీని ఆసరా చేసుకుని జీవనం సాగిస్తారు. అలాంటి నిధులను బ్యాంకులు, దోపిడీదారులు కలిసి ప్రజాద్రోహానికి పాల్పడుతున్నారు. ఎగవేత దారుల పేర్లనుకూడా చెప్పకుండా దాచేస్తున్నారు. ఇంతవరకు ఎంతమంది బకాయిలు చెల్లించకుండా ఉన్నారనేది ప్రజలకు తెలియదు.

పార్లమెంటులో ఏనాడూ ఈ విషయాన్ని చెప్పలేదు. ఆర్థికశాఖ సహాయమంత్రి భగవత్‌కిషన్ రావ్ కరాడ్ లోక్‌సభలో మాట్లాడుతూ ఆర్‌బీఐ మార్గదర్శకాలను అనుసరించి బ్యాంకులకు రుణాలు చెల్లించ కుండా ఎగవేసినవారి పేర్లను వెల్లడించడంలేదని, వారి ఆస్తులను మాత్రమే వేలం వేస్తామని చెప్పారు. ఒక పద్ధతి ప్రకారమే బ్యాంకులను దోపిడీ చేస్తున్నప్పటికీ బ్యాంకులను నియంత్రించే వారులేదా ప్రభుత్వం కనీసం ఈ అంశంపై మాట్లాడే దాఖలాలులేవు. ప్రతి సంవత్సరం వేలు, లక్షలకోట్లు బ్యాంకులను మోసగిస్తున్నప్పటికీ ప్రభుత్వానికి చీమ కుట్టినట్లు కూడా లేదు. నష్టాలను ప్రజలే అనుభవిస్తున్నారు. కావాలని బ్యాంకులను మోసగిస్తున్నారా లేక నిజంగానే నష్టాలు వస్తున్నాయా అనే అంశాన్ని కూడా పరిశీలించడంలేదు. పైగా ప్రభుత్వం అలాంటివాళ్లనే ప్రోత్సహించడం మనం చూస్తున్నాం.

అత్యధికంగా మోసాలు జరిగింది ప్రభుత్వరంగ బ్యాంకులలోనే. ప్రభుత్వరంగ బ్యాంకులలో ఉన్నతస్థాయి యాజమాన్యం మోసకారులపై చర్యలు తీసుకోవాలన్న ఆలోచన కూడా కనిపించదు. ప్రైవేటురంగ బ్యాంకులతో పోల్చుకుంటే ప్రభుత్వరంగ బ్యాంకుల యాజమాన్యం చాలా అలక్ష్యంగా కనిపిస్తుంది. ఎస్ బ్యాంకు సహ వ్యవస్థాపకులు రాణాకపూర్ 466.51కోట్లు మోసానికి పాల్పడ్డారని సీబీఐ చార్జిషీటు దాఖలుచేసి ఆయనను అరెస్టు చేసింది. అలాగే ఐసీఐసీఐ బ్యాంకు మానేజింగ్ డైరెక్టర్ చందా కొచ్చర్ ఆమె భర్త దీపక్ కొచ్చర్‌ను, వీడియోకాన్ చైర్మన్ వేణుగోపాల్ ధూత్‌ను ఆర్థిక అక్రమాలపై ఛార్జిషీటు పెట్టి సీబీఐ అరెస్టు చేసింది. ప్రభుత్వరంగ బ్యాంకులను కోట్లాదిరూపాయలు నష్టపరచిన వారిని, వారికి సహకరించిన వారిని గుర్తించి సీబీఐ, ఈడీ అధికారులు కేసులు నమోదుచేసి విచారణ జరిపి ఉండవలసింది. అయితే బ్యాంకులను మోసగించి ఈ దేశం నుంచే పారిపోయిన తర్వాత ఈ దర్యాప్తు సంస్థలు రంగంలోకి దిగాయి. 30మందికిపైగా దోపిడీదారులు విదేశాల్లో నివసిస్తున్నారు. వీరిలో విజయ్‌మాల్యా, నీరవ్‌మోదీ, నిషాల్ మోదీ, మెహుల్ ఛోక్సి, నితిన్ ధే సందేసర, దీప్తి చేతన్‌కుమార్ లాంటి వారు దేశం నుంచిపారిపోయిన వారిలో ఉన్నారు. బ్యాంకుల నుంచి రుణాలను తీసుకోవడంలో వీరు ఎలాంటి నియమ, నిబంధనలను పాటించలేదు. బ్యాంకులు కూడా ఆ నియమాలను పాటించకుండానే రుణాలు ఇవ్వడమే నేటి దుస్థితికి కారణం.

పెరుగుతున్న విద్యుత్ వాహనాలు

వాతావరణ కాలుష్యం తగ్గించడానికి ఉపయోగపడే విద్యుత్ వాహనాల సంఖ్య పెరుగుతోంది. వీటిలో ద్విచక్ర, నాలుగు చక్రాల వాహనాలున్నాయి. మన దేశంలో వాడుకలో ఉన్న విద్యుత్ వాహనాల్లో అత్యధికం ద్విచక్రవాహనాలే. వీటికి బ్యాటరీ మార్పిడితో అవసరముండదు. యజమానులు వారి ఇంటివద్దే రాత్రి సమయంలో బ్యాటరీని చార్జింగ్ చేసుకునే అవకాశం ఉంది. కేవలం వ్యాపారనిమిత్తం వాడుతున్న వాహనాలకు మాత్రమే బ్యాటరీ మార్పిడి అవసరముంటుంది. కేంద్రం కల్పిస్తున్న రాయితీలతో బాటు రాష్ట్రాలు కూడా అదనంగా మరికొన్ని రాయితీలు వీటికి కల్పించడంతో ముఖ్యంగా ద్విచక్రవాహనాల అమ్మకాలు ఊపందుకున్నాయి. కాని వీటి చార్జింగు కోసం ప్రస్తుతం తగినన్ని మౌలికవసతులు కల్పించకపోవడంతో భవిష్యత్తులో ఈ అమ్మకాలు తగ్గే అవకాశం ఉంది. చార్జింగ్ స్టేషన్ల నిర్మాణం చాలా వ్యవధితో కూడుకున్న ప్రక్రియ. వీటి నిర్మాణం కోసం కేంద్రం సానుకూలంగానే ఉంది. ఈ స్టేషన్ల ముఖ్యమైన పని ఖాళీ అయిన బ్యాటరీ స్థానంలో కొత్త బ్యాటరీని అమర్చడం. ఇందుకై కొంత పైకాన్ని వాహనదారుడు చెల్లించాలి. ఈ పైకాన్ని వాహనాల అమ్మకాలను ప్రోత్సహించడం కోసం, వాహనాన్ని తక్కువ ధరకు వినియోగదారునికి అందించడం కోసం బ్యాటరీలు లేకుండా వీటిని అమ్మవచ్చని కేంద్రం కంపెనీలకు వెసులుబాటు కల్పించింది. వాహన కొనుగోలుదారులు వీటి బ్యాటరీలను బయట మార్కెట్లో తక్కువ ధరకు కొనుక్కోవచ్చు. సాధారణంగా వీటి ధర వాహనం ధరలో 40శాతం కన్నా ఎక్కువ ఉండదు.

2030 నాటికి మొత్తం ద్విచక్ర, త్రిచక్ర వాహనాల అమ్మకాల్లో 80 శాతం ఎలక్ట్రిక్ వాహనాలు, నాలుగచక్రాల వాహన అమ్మకాల్లో 50 శాతం, బస్సుల అమ్మకాల్లో 40 శాతం నమోదవ్వాలని నీతిఅయోగ్ లక్ష్యం. దీనికిగాను భారీ స్థాయిలో దేశవ్యాప్తంగా చార్జింగు వసతి కల్పించవలసిన అవసరం ఉంది. 2021లో ముఖ్యంగా ద్విచక్ర, త్రిచక్ర వాహనాల అమ్మకాలు విపరీతంగా పెరిగాయి. 2021లో ద్విచక్ర, త్రిచక్ర వాహనాల అమ్మకాలు 2020 లో నమోదైన 1,19,652 నుండి 3,11,350 లకు అంటే 160 శాతం పెరిగాయి. 2021 డిశంబరులో ఒక్క ద్విచక్ర వాహనాలు అమ్మకాలే

ఒక అంచనా ప్రకారం దేశంలో 20 లక్షల విద్యుత్ వాహనాలకు చార్జింగ్ సేవలందించాలంటే 2026 నాటికి 4,00,000 చార్జింగ్ కేంద్రాలుండాలి. ప్రస్తుతం ఇవి కేవలం వేల సంఖ్యలో మాత్రమే ఉన్నాయి. రానున్న రోజుల్లో వీటి అమ్మకాలతో బాటు ఇవి కూడా పెరుగుతాయి. పెద్ద నగరాల్లోని కొన్ని సంస్థలు గేటెడ్ కాలనీల్లోని "రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ల" తో తమ కాలనీలలో బ్యాటరీ మార్పిడి కేంద్రాల స్థాపనకు సంప్రదింపులు జరుపుతున్నాయి. ఢిల్లీ ప్రభుత్వం తమ కార్యాలయాల దగ్గర ఇట్టి కేంద్రాలను ఏర్పాటు చేయాలని యోచిస్తోంది. అంతర్జాతీయ సంస్థలైనాబాదీదీ, పానసోనిక్‌లు కూడా భారీ ప్రణాళికలతో వీటి ఏర్పాటుకు ప్రయత్నంలో ఉన్నాయి.

24,725. ఇది గత నెల నవంబరుతో పోల్చితే నాలుగు రెట్లు ఎక్కువ. జనవరి 2022లో ఈ రెండింటి అమ్మకాలూ సుమారు 9.66 లక్షలు. దేశవ్యాప్తంగా సుమారు 55 సంస్థలు వీటిని తయారు చేస్తున్నాయి. బడా ద్విచక్ర వాహన తయారీ కంపెనీలు హీరో, బజాజ్, టివిఎస్, ఓలా ఎలక్ట్రిక్ వంటివి భారీ స్థాయిలో తయారీకి ప్రణాళికలు రూపొందించాయి. ఓలా ఎలక్ట్రిక్ ఏటా 20 లక్షల వాహనాలను తయారుచేసే సామర్థ్యంతో ఉంది. భవిష్యత్తులో కోటి వాహనాల తయారీకి లక్ష్యంతో ఉంది. ఆటోమొబైల్స్ విషయానికొస్తే, విద్యుత్ వాహనాల డిమాండ్ పెరుగుదల నత్త నడకలో ఉన్నా, టాటాస్ నెక్సన్ మోడల్, టైగర్ మోడల్ MG ZSEV (రూ.21 లక్షలు) వంటివి వాహన యజమానుల మన్ననలను పొందగలిగాయి. మహేంద్ర సంస్థ కూడా త్వరలో వీటి ఉత్పత్తిని ప్రారంభించనుంది. అత్యంత ఖరీదైన కార్ల అమ్మకాల్లో పేరుగాంచిన మెర్సిడెస్, ఆడి, దీవీలు కూడా ఇట్టి కార్లను ఇండియన్ విపణిలోకి తెచ్చాయి గాని వాటి ధరను బట్టి కొనడానికి భారీ సంఖ్యలో వస్తారని ఆ కంపెనీలు కూడా ఆశించటం లేదు. ఒక్క ఆడి కారు మోడలే కోటి రూపాయిలు.

ఒక అంచనా ప్రకారం దేశంలో 20 లక్షల విద్యుత్ వాహనాలకు చార్జింగ్ సేవలందించాలంటే 2026 నాటికి 4,00,000 చార్జింగ్ కేంద్రాలుండాలి. ప్రస్తుతం ఇవి కేవలం వేల సంఖ్యలో మాత్రమే ఉన్నాయి. రానున్న రోజుల్లో వీటి అమ్మకాలతో బాటు ఇవి కూడా పెరుగుతాయి. పెద్ద నగరాల్లోని కొన్ని సంస్థలు గేటెడ్ కాలనీల్లోని 'రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ల' తో తమ కాలనీలలో బ్యాటరీ మార్పిడి కేంద్రాల స్థాపనకు సంప్రదింపులు జరుపుతున్నాయి. ఢిల్లీ ప్రభుత్వం తమ కార్యాలయాల దగ్గర ఇట్టి కేంద్రాలను ఏర్పాటు చేయాలని యోచిస్తోంది. అంతర్జాతీయ సంస్థలైనాబాదీదీ, పానసోనిక్‌లు కూడా భారీ ప్రణాళికలతో వీటి ఏర్పాటుకు ప్రయత్నంలో ఉన్నాయి.

టాటా పవర్ సంస్థ సుమారు 1,000 స్టేషన్లు ఏర్పాటు చేసి త్వరలో వీటిని 10,000కు పెంచదలచింది. గృహసముదాయాలు, దుకాణాలు, కార్యాలయాల సముదాయాలున్న ప్రదేశాల్లో చార్జింగ్ మార్పిడి కేంద్రాలకు ప్రభుత్వం అనుమతులిచ్చింది. వీటి నిర్మాణం ప్రారంభ దశలోనే బిల్డర్లు మిగతా సదుపాయాల తరహాలో చార్జింగు కేంద్రాలను కూడా తమ బిల్డింగ్ ప్లానులో ఒక భాగంగా చేర్చాలి. వీటివలన సంబంధిత వ్యక్తులకు, శాఖలకు ఆదాయం కూడా లభిస్తుంది. జాతీయ రహదారులపై కూడా ఇట్టి స్టేషన్లను ఏర్పాటు చేస్తే, వాణిజ్య, విద్యుత్ వాహనాల గిరాకీ మరింత ఊపందుకుంటుంది. ఇప్పటికే రైల్వేవాహనాలు విద్యుత్‌తోనే చాలా ఏళ్ళ నుండి నడుస్తున్నాయి. వాణిజ్య వాహనాలు కూడా పెట్రోలు, డీజిలు రహిత ఇంధనాలవైపు మొగ్గుచూపాయి. 2030 నాటికి పెట్రోలియం ఉత్పత్తుల మొత్తం వినియోగంలో ఈ రెండింటి వాటా ఇపుడున్న 50 శాతం నుంచి 44 శాతానికి దిగుతుందని క్రిసిల్ రిసెర్చి సంస్థ పేర్కొంది. 2030 నాటికి కాలుష్య తీవ్రతను 45 శాతానికి తగ్గిస్తామని భారత్ హామీ ఇచ్చింది. ఈ ప్రక్రియలో రవాణా వాహనాల పాత్ర కీలకం. దేశీయ చమురు వినియోగంలో అత్యంత భారీగా వినియోగించేది రవాణా రంగమే. ప్రపంచ వ్యాప్తంగా మూడోవంతు చమురు వినియోగంతో అతి పెద్ద కాలుష్య విడుదల దేశంగా భారత్ నమోదైంది. చమురు దేశీయ వినియోగంలో 80 శాతం కేవలం రోడ్డు రవాణాయే వినియోగిస్తోంది. విద్యుత్ వాహనాల వాడకం దేశంలో ఆశించిన స్థాయిలో పెరగడంలేదు.

దీనికి ముఖ్యమైన కారణాలు: వాహనాలు ధరలు అధికంగా ఉండటం. ఓలా ద్విచక్ర వాహనం ప్రారంభ వెల రూ. 1.3 లక్షలు. వీటిని కొన్నాళ్ళు వాడిన తర్వాత తిరిగి అమ్మాలంటే ఎవరూ కొనరు ఒక వేళ కొన్నా చాలా తక్కువ ధరకే కొంటారు. వాహనానికి బ్యాటరీ కీలకం. బ్యాటరీ లేకుండా వాహనం వ్యర్థం. ఈ ఒక్క అంశంతో బ్యాటరీ అమ్మకపుదారులు ఏకమై వాటి ధరలను విపరీతంగా పెంచవచ్చు. కొన్ని ప్రాంతాల్లో చాలా తక్కువ సందర్భాల్లో ఈ వాహనాలు అగ్ని ప్రమాదానికి గురవుతున్నాయన్న వార్తలు వ్యాపించాయి. కమర్షియల్ వాహనాల బ్యాటరీ మార్పిడి కేంద్రాలు తక్కువ సంఖ్యలో ఉండడం. దీని వలన సుదీర్ఘ ప్రయాణాలు చేయలేరు. నాలుగు నెలల్లో ఈ స్టేషన్ల ఏర్పాటుకు విధి విధానాలను రూపొందించాలని నీతి అయోగ్ నిర్ణయించింది. వాణిజ్య వాహనాలకు ప్రభుత్వం ప్రకటించిన ఫేమ్ రాయితీలు కాగితాలకే పరిమితమయ్యాయి. భారత్ తన చమురు అవసరాలకు 85 శాతం ఇతర దేశాలపై ఆధారపడుతూ వస్తోంది. అంతర్జాతీయ క్రూడ్ ధరలు ఎప్పుడు పెరుగుతాయో అంతు పట్టని విషయం. గతంలో రికార్డు స్థాయిలో బేరల్ చమురు ధర 147శాతానికి కెళ్ళింది. అంతర్జాతీయంగా భవిష్యత్తులో ముడిచమురు ధర పెరిగితే రెట్టైలు స్థాయి చమురు ధరలు లీటరు రూ.200 లకు చేరవచ్చు. ఇప్పటికే శ్రీలంకలో లీటరు పెట్రోలు రూ.250లకు చేరింది. వాహన యజమానులు ప్రత్యామ్నయ మార్గాలవైపు దృష్టి సారించడం మంచిది. ఈ విషయంలో విద్యుత్ వాహనాలే ఇటు వినియోగదారులకు, అటు ప్రభుత్వాలకు ప్రత్యామ్నాయం.

డా.యస్.వై.విష్ణు, సెల్. 9963217252

బీరేన్ సింగ్ సర్కార్‌కు కష్టకాలం

- దిల్లీలో బీజేపీ అసంతృప్త ఎమ్మెల్యేల శిబిరం
- ప్రభుత్వ విధానాలపై కుకీ ఎమ్మెల్యేల్లోనూ అసహనం

చింగ్థంగన్బా ఇంఫాల్: మణిపూర్‌లోని బీజేపీ ప్రభుత్వానికి కష్టకాలం మొదలయింది. ఆ పార్టీ ఎమ్మెల్యేలు తీవ్ర అసంతృప్తితో రగిలిపోతున్నారు. బీజేపీ ఎమ్మెల్యేల బృందం దిల్లీకి వెళ్లి బీజేపీ కేంద్ర నేతలను కలవడంతో ముఖ్యమంత్రి ఎన్.బీరెన్ సింగ్ ప్రభుత్వంలో అసమ్మతి చెలరేగుతుందనే ఊహాగానాలు పెరిగాయి. ముఖ్యంగా ఒక ప్రముఖ పార్టీ నాయకుడు కూడా పార్టీ ఉన్నతాధికారికి ఫిర్యాదు చేయడం లేదా వివాదాన్ని తీసుకెళ్లడం క్రమశిక్షణారాహిత్యంతో సమానం కాదని వివరిస్తూ సోషల్ మీడియా పోస్ట్‌తో ముందుకు వచ్చారు. మణిపూర్ లోయకు చెందిన కనీసం నలుగురు బీజేపీ ఎమ్మెల్యేలు కేంద్ర నేతలను కలవడానికి దిల్లీకి వచ్చినట్లు పార్టీ నాయకులు ధ్రువీకరించారు. దిల్లీ వచ్చిన మణిపూర్ లోయకు చెందిన నలుగురు బీజేపీ ఎమ్మెల్యేలలో ఉరిపోక్ ఎమ్మెల్యే ఖైరెక్‌పామ్ రఘుమణి, ఈశాన్య రాష్ట్రాల కేంద్ర సహాయ మంత్రి బి.ఎల్.వర్మతో గ్రూప్ సమావేశాన్ని చూపుతున్న చిత్రాన్ని ఫేస్‌బుక్ సైట్ 'రఘుమణి ఫర్ ఉరిపోక్'లో పోస్ట్ చేశారు. 'వారు (థోక్చోం రాధేశ్యామ్ సింగ్, కరమ్ శ్యామ్, పనోం బ్రోజెన్, రఘుమణి) మణిపూర్ సమస్యలు, సరిహద్దు, అభివృద్ధి గురించి చర్చించారు' అని పోస్ట్ పేర్కొంది. అయితే ఇంతలో, కొత్త పరిణామంపై మరొక బీజేపీ ఎమ్మెల్యే ఆర్.కె.ఇమో సింగ్ తన అధికారిక ఫేస్‌బుక్ ఖాతాలో స్పందిస్తూ... 'మనమంతా మనం ఉన్న రాజకీయ పార్టీ నిర్దిష్ట భావజాలం, రాజ్యాంగానికి కట్టుబడి ఉన్నాము. శాసనసభ్యులుగా ఆ ప్రభుత్వం/ పార్టీ కార్యక్రమాలు, నిర్ణయాల ప్రకారం పని చేయడం మన బాధ్యత. ఒకరు ఫిర్యాదు చేయవచ్చు, ప్రభుత్వం/పార్టీ/మంత్రిపై ఉన్న వివాదాన్ని సముచిత నాయకుడి వద్దకు తీసుకెళ్లవచ్చు,ఫిర్యాదుదారుపై క్రమశిక్షణా చర్య తీసుకునేలా ఆ వివాదాన్ని మీడియాకు తీసుకెళ్లకూడదు' అని పేర్కొన్నారు. టూరిజం కార్పొరేషన్ మణిపూర్ లిమిటెడ్ చైర్మన్ పదవికి 'ఎలాంటి బాధ్యత అప్పగించలేదు' అని ఫిర్యాదు చేసూ టూరిజం కార్పొరేషన్ మణిపూర్ లిమిటెడ్ చైర్మన్ పదవికి లాంగ్‌తబల్ నియోజకవర్గం బీజేపీ ఎమ్మెల్యే కరమ్ శ్యామ్ సోమవారం రాజీనామా చేసిన మరుసటి రోజు జాతీయ నేతలను కలిసేందుకు దిల్లీకి వచ్చారు. అంతకుముందు, ఏప్రిల్ 8న హీరోక్ నియోజకవర్గానికి చెందిన బీజేపీ ఎమ్మెల్యే థోక్చోం రాధేశ్యామ్ ఇదే విధమైన ఫిర్యాదును పేర్కొంటూ సీఎం సలహాదారు పదవికి రాజీనామా చేశారు. లోయకు చెందిన ఎమ్మెల్యేలతో పాటు కుకీ తెగకు చెందిన అనేక మంది బీజేపీ ఎమ్మెల్యేలు కూడా దేశ రాజధానిలో శిబిరంలో ఉన్నారని భావిస్తున్నారు. పార్టీకి చెందిన ఇతర వర్గాలు పీటీఐతో మాట్లాడిన దాని ప్రకారం... 'ఈ పర్యటన అధికారికం కాదు. కానీ వారు కూడా కొంతమంది నాయకులను కలవడానికి తమ మనోవేదనలను చెప్పడానికి వెళ్లారని మేము నమ్ముతున్నాము' అని చెప్పారు. లోయ ఎమ్మెల్యేల అసమ్మతి సాధారణంగా వ్యక్తిగత చిరాకు నుంచి బయటపడినట్లు అర్థం చేసుకోబడినప్పటికీ, కుకీ ఎమ్మెల్యేల అసమ్మతి మరింత క్లిష్టంగా ఉంటుంది. ఇది ప్రభుత్వ విధానాలను కలిగి ఉంటుంది. కుకీ పరిశీలకులు తమ సంఘాన్ని లక్ష్యంగా చేసుకుంటారని నమ్ముతారు. కుకీ మెజారిటీ చురాచంద్‌పూర్‌లోని సైకోట్‌కు చెందిన కుకీ ఎమ్మెల్యే పావోలియన్‌లాల్ హౌకిప్ ఇటీవలే రిజర్వ్‌డ్ అటవీ ప్రాంతాల నుంచి కుకీ గ్రామస్తులను తొలగించడానికి సంబంధించిన ప్రభుత్వ విధానాలపై అసంతృప్తి వ్యక్తం చేశారు. 'రాష్ట్రంలో పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా రాష్ట్రం సరైన పరిష్కార విధానం లేకుండా, రిజర్వ్‌డ్, రక్షిత అడవులుగా రహస్యంగా ప్రకటించబడిన అంతకుముందు చిత్తడి నేలల్లోని నివాసాలను తొలగించడం సరైనదేనా?' అని హౌకిప్ ప్రశ్నించారు. రాష్ట్రానికి 'పర్వతాలు, లోయ రెండింటికీ సరైన పరిష్కార విధానం అవసరమని, అస్థిరమైన, విచిత్రమైన, లక్ష్య తొలగింపులు కాదని ఆయన స్పష్టం చేశారు. విధానపరమైన విషయాలను మంత్రివర్గం, అసెంబ్లీలో చర్చించాల్సిన అవసరం ఉందని, ఒక వ్యక్తి ఇష్టానుసారం కాదని తెలిపారు.

'రాష్ట్రంలో నివసించే వర్గాల మధ్య శాంతి, సామరస్యాన్ని తీసుకురావడంలో ప్రభుత్వ పాత్రపై కూడా హౌకిప్ ప్రశ్నలను లేవనెత్తారు. కాగా కొన్ని శక్తివంతమైన కుకీ సంస్థలు కుకీ రాజకీయ సమస్యకు పరిష్కారాన్ని డిమాండ్ చేస్తున్నాయి. ఇందులో పర్వత ప్రాంత ప్రజలకు ఎక్కువ అధికారం, ప్రత్యేక పరిపాలన కూడా ఉన్నాయి. మణిపూర్ శాసనసభలో కుకీ తెగకు చెందిన 10 మంది ఎమ్మెల్యేలు ప్రాతినిధ్యం వహిస్తున్నారు. వీరిలో ఏడుగురు బీజేపీ ఎమ్మెల్యేలు.

ముకుల్ రాయ్ దిల్లీలో ప్రత్యక్షం

న్యూదిల్లీ: పశ్చిమ బెంగాల్ అధికార పార్టీ టీఎంసీ కీలక నేత ముకుల్ రాయ్ కనిపించడం లేదని ఆయన కుమారుడు సుభ్రాంశు రాయ్ వెల్లడించిన కొద్ది గంటల్లోనే ముకుల్ దిల్లీ విమానాశ్రయంలో కనిపించారు. ఆయనకు దిల్లీ విమానాశ్రయంలో స్వాగతం పలికేందుకు ఓ వ్యక్తి వచ్చినట్లు తెలుస్తోంది. వారిద్దరూ మాట్లాడుకుంటుండగా ఓ పాత్రికేయుడు చిత్రీకరించిన వీడియోను సామాజిక మాధ్యమాల్లో పోస్ట్ చేశారు. అయితే ఈ వీడియో యథార్థత గురించి స్పష్టంగా తెలియడం లేదు. దీనిపై సుభ్రాంశు రాయ్ స్పందిస్తూ తన తండ్రి అనారోగ్యాన్ని తమకు అనుకూలంగా మలచుకుని, చిల్లర రాజకీయాలు చేయడానికి కొందరు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. ఓ పాత్రికేయుడు సామాజిక మాధ్యమాల్లో పోస్ట్ చేసిన వీడియోలో దిల్లీ విమానాశ్రయంలో ముకుల్‌రాయ్‌కి ఓ వ్యక్తి స్వాగతం పలుకుతున్నట్లు, తెలుపు రంగు కుర్తా, పైజమా ధరించినట్లు కనిపించింది. జాతీయ మీడియా కథనాల ప్రకారం విమానాశ్రయంలో ముకుల్ రాయ్ మాట్లాడుతూ తాను తరచూ దిల్లీకి వస్తూ ఉంటానని, ఈసారి కూడా కొంచెం పని ఉందని, అందుకే వచ్చానని చెప్పారు. తాను మెడికల్ చెకప్ కోసం ఇక్కడికి రాలేదన్నారు. తన రాకకు ప్రత్యేకంగా రాజకీయ కారణాలేవీ లేవన్నారు. ప్రత్యేకంగా ఓ పని మీద ఇక్కడికి వచ్చానన్నారు. తాను దిల్లీ రాకూడదా? తాను ఎమ్మెల్యేని, గతంలో ఎంపీగా చేశానని అన్నారు. సుభ్రాంశు సోమవారం మాట్లాడుతూ తన తండ్రి ముకుల్ రాయ్ కనిపించడం లేదని, ఆయనను ఫోన్ ద్వారా సంప్రదించలేకపోతున్నానని చెప్పారు. పోలీసులకు ఫిర్యాదు చేశారు. ముకుల్ రాయ్ టీఎంసీ నుంచి బీజేపీలో చేరారు. ఆ తర్వాత 2021లో జరిగిన శాసనసభ ఎన్నికల్లో టీఎంసీ విజయం సాధించడంతో మళ్లీ టీఎంసీలోకి వెళ్లిపోయారు.

ధబోల్కర్ హత్యకేసు దర్యాప్తును కోర్టు పర్యవేక్షించదు: బాంబే హైకోర్టు

ముంబై: హేతువాది నరేంద్ర ధబోల్కర్ 2013లో హత్యకు గురికాగా, ఆ కేసును కేంద్ర దర్యాప్తు సంస్థ (సీబీఐ) విచారిస్తోంది. ఈ వ్యవహారాన్ని బాంబే హైకోర్టు మంగళవారం సమీక్షించింది. ఈ కేసులో చార్జిషీటు దాఖలై విచారణ ప్రారంభమైందని కోర్టు పేర్కొంది. సీబీఐ దర్యాప్తును కోర్టు పర్యవేక్షించాల్సిన అవసరం లేదని తెలిపింది. దర్యాప్తు పూర్తి అయిందని నివేదికను దర్యాప్తు సంస్థ కేంద్ర కార్యాలయానికి సీబీఐ దర్యాప్తు అధికారి సమర్పించినట్లు జస్టిస్ ఏఎస్ గడ్కరీ, జస్టిస్ పీడీ నాయక్‌తో కూడిన డివిజన్ బెంచ్ ఉత్తర్వులు పేర్కొన్నాయి. 'ఈ కేసులో దర్యాప్తు ముగిసింది. విచారణ కొనసాగుతోంది. 2023, మార్చిలో 18 మంది సాక్షులను ప్రాసిక్యూషన్ విచారించారు' అని వెల్లడించాయి. మహారాష్ట్ర అంధశ్రద్ధ నిర్మూలన్ సమితి వ్యవస్థాపకుడు ధబోల్కర్ (67) 2013, ఆగస్టు 20న పూనేలో మార్నింగ్ వాక్‌కు వెళ్లిన సమయంలో కాల్చివేతకు గురయ్యారు. ఆయనపై సనాతన సంస్థకు చెందిన ఇద్దరు వ్యక్తులు కాల్పులు జరిపారు. 2014 నుంచి ఈ కేసు విచారణ కొనసాగుతోంది.

'ధారావి' టెండర్ షరతుల్లో మార్పు అదానీ కోసమే: కాంగ్రెస్

న్యూదిల్లీ: 'మోదానీ' ఆవహిస్తోందని, స్వలాభం కోసం మురికివాడలను సైతం వదిలిపెట్టబోదని ధారావి ప్రాజెక్టు అదానీ గ్రూపు చేజిక్కించుకోవడంపై కాంగ్రెస్ పార్టీ ఘాటు విమర్శలు చేసింది. మహారాష్ట్రలోని ధారావి మురికివాడ రూపురేఖలను మార్చడానికంటూ 'ధారావి రీడెవలప్‌మెంట్ ప్రాజెక్ట్' టెండర్‌ను అదానీ రియాల్టీ కంపెనీ గత నవంబర్‌లో చేజిక్కించుకొన్నది. ఈ ప్రాజెక్టు రీబిడ్డింగ్ అనేక సందేహాలకు దారితీసింది. ఇదే విషయంలో మోదీ ప్రభుత్వాన్ని కాంగ్రెస్ నిలదీసింది. ప్రధాని మోదీకి ఎంతో ఇష్టమైన వాణిజ్య సంస్థ 'అదానీ' కోసం టెండర్ షరతులను మార్చారా అని మంగళవారం ప్రశ్నించింది. హిండెన్‌బర్గ్ నివేదిక నేపథ్యంలో అదానీ గ్రూపుపై సంయుక్త పార్లమెంటరీ కమిటీ (జేపీసీ) విచారణ కోసం కాంగ్రెస్‌తో సహా విపక్షాలు డిమాండ్ చేస్తున్న విషయం విదితమే. హమ్ అదానీ కే హై కౌన్ సిరీస్‌లో భాగంగా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ తాజాగా ముంబై ధారావి మురికివాడ రీడెవలప్‌మెంట్ ప్రాజెక్టుకు సంబంధించి కొత్త టెండర్ అదానీ గ్రూపు దక్కించుకోగలగడంపై మోదీ ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. అదానీ గ్రూపుకు మద్దతిచ్చేందుకు ఏ విధంగా ఈ ప్రక్రియను మలిచారో వార్తా నివేదికల ద్వారా తెలుస్తోందని పేర్కొన్నారు.

'దుబాయ్‌కి చెందిన సెక్‌లింక్ టెక్నాలజీ కార్పొరేషన్ రూ.7,200 కోట్లకు బిడ్ వేసి హయ్యస్ట్ బిడ్డర్‌గా 2018 నవంబరులో నిలిచింది. అదానీ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌ను వెనక్కునెట్టింది. రైల్వే భూమి బదిలీ సమస్యలతో 2020 నవంబరులో ఆ టెండర్ రద్దు అయింది. 2022 అక్టోబరులో కొత్త షరతులతో టెండర్‌ను మహారాష్ట్ర పట్టణాభివృద్ధి శాఖ పిలిచింది. ఈ శాఖ ఉపముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ పరిధిలో ఉంది. ఈసారి రూ.5,069 కోట్లకు బిడ్ చేసి అదానీ గ్రూపు టెండర్ గెలుచుకుంది. వాస్తవ బిడ్ కంటే రూ.2,131 కోట్లు తక్కువ బిడ్ చేసి గెలిచింది. టెండర్ షరతుల్లో అనేక మార్పులు జరిగాయి. ఆర్థిక భాగస్వామి రియల్టీ అనుభవాన్ని పెంచడం ద్వారా సెక్‌లింగ్ మళ్లీ బిడ్ చేయలేకపోయింది. బిడ్డర్ నికర విలువ(నెట్‌వర్త్)ను రూ.10వేల కోట్ల నుంచి రూ.20వేల కోట్లకు పెంచడంతో అనేక మంది బిడ్డర్లు ఆగిపోయారు. టెండర్ గెలిచిన వారికి విడతల వారీ చెల్లింపులకు అవకాశం కల్పించారు. దీంతో ఆర్థిక కష్టాల్లో ఉన్న అదానీ గ్రూపుకు ఉపశమనం లభించింది. మురికివాడ రీడెవలప్‌మెంట్ డెడ్‌లైన్‌లనూ పెంచారు. నిర్దేశిత కాలం దాటితే ఏడాదికి కట్టే జరిమానాను రూ.2కోట్లకు పరిమితం చేశారు' అని జైరాం రమేశ్ తెలిపారు. ముందు టెండర్ గెలిచిన సంస్థను పక్కకు పెట్టి అదానీ గ్రూపునకు ఈ టెండర్ ఇప్పించేలా షరతుల్లో మార్పులు చేసే విధంగా మహారాష్ట్ర ప్రభుత్వంపై ప్రధాని మోదీ ఒత్తిడి తెచ్చారా అని ఆయన ప్రశ్నించారు.

భారత్‌లో యాపిల్ తొలి స్టోర్ ప్రారంభం

ముంబై: భారత్‌లో యాపిల్ తొలి రిటైల్ స్టోర్ ప్రారంభమైంది. కంపెనీ సీఈఓ టిమ్ కుక్ స్వయంగా తలుపులు తెరిచి వినియోగదారులను ఆహ్వానించారు. ముంబైలోని బాంద్రా కుర్లా కాంప్లెక్స్‌లో 'యాపిల్ బీకేసీ' పేరిట ఈ స్టోర్‌ను ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. భారత్‌లో వేగంగా విస్తరించేందుకు సిద్ధమైన యాపిల్... అందులో భాగంగా రిటైల్ స్టోర్‌లను అందుబాటులోకి తీసుకొస్తోంది. రెండో స్టోర్ 'యాపిల్ సాకేత్'ను దిల్లీలో తెరవనున్నారు. ముంబైలోని రిలయన్స్ జియో వరల్డ్ డ్రైవ్ మాల్‌లో యాపిల్ బీకేసీని ఏర్పాటు చేశారు. 20,800 చదరపు అడుగుల స్థలంలో ఏర్పాటు చేసిన ఈ స్టోర్‌లో వినియోగదారులు యాపిల్ ఉత్పత్తులన్నింటినీ కొనుగోలు చేయడానికి వీలుంటుంది. ఇతర సేవలు అందుబాటులో ఉంటాయి. ఈ స్టోర్‌ను ప్రారంభించడం కోసం కుక్ సోమవారమే ముంబైకి చేరుకున్నారు. నిన్న సాయంత్రం ఆయన ప్రముఖ నటి మాధురీ దీక్షిత్‌తో కలిసి 'వడా పావ్' ఆరగించారు. యాపిల్‌కు ప్రపంచవ్యాప్తంగా 500 రిటైల్ స్టోర్లు ఉన్నాయి. భారత్‌లో విస్తరణకు భారీ అవకాశాలు ఉన్నందున యాపిల్ ఇక్కడి మార్కెట్‌పై దృష్టి సారించింది. అందులో భాగంగా తయారీని చైనా నుంచి భారత్‌కు తరలిస్తోంది. విక్రయాలు సైతం భారీగా పుంజుకుంటున్నందున స్టోర్లను ప్రారంభించడం వల్ల మరింత మంది వినియోగదారులను ఆకర్షించే ప్రయత్నం చేస్తోంది. గతేడాది సెప్టెంబరు నాటికి భారత్‌లో ప్రీమియం స్మార్ట్‌ఫోన్ విక్రయాల్లో యాపిల్ వాటా 40 శాతం. శాంసంగ్, వన్‌ప్లస్ కంటే కూడా ఇది అధికం. మరోవైపు మొత్తం యాపిల్ ఉత్పత్తుల్లో మూడు శాతం భారత్‌లోనే తయారవుతున్నాయి. వీటిని వచ్చే కొన్నేళ్లలో ఐదు శాతానికి పెంచాలని కంపెనీ వ్యూహాలు రచిస్తోంది. భారత్‌లో ఫాక్స్‌కాన్, పెగాట్రాన్, విస్ట్రాన్ ఐఫోన్లను తయారు చేస్తున్న విషయం తెలిసిందే. త్వరలో ఎయిర్‌పాడ్స్, ఐప్యాడ్స్‌ను కూడా ఫాక్స్‌కాన్ తయారు చేసే యోచనలో ఉంది.

బిల్లులకు గవర్నర్ల సమ్మతికి గడువు విధింపుపై

స్టాలిన్ ప్రతిపాదనను పరిశీలిస్తున్నాం

కేరళ ముఖ్యమంత్రి విజయన్

తిరువనంతపురం : ఆయా రాష్ట్ర అసెంబ్లీలు ఆమోదించిన బిల్లులను గవర్నర్‌లు సమ్మతి తెలిపేందుకు గడువును నిర్ణయించేలా రాష్ట్ర అసెంబ్లీలో తీర్మానం చేయాలన్న తమిళనాడు ముఖ్యమంత్రి ఎం.కె.స్టాలిన్ ప్రతిపాదనను అత్యంత తీవ్రంగా పరిశీలిస్తామని వామపక్షాల పాలిత రాష్ట్రం కేరళ మంగళవారం తెలిపింది. ఈ విషయాన్ని కేరళ రాష్ట్ర ముఖ్యమంత్రి పినరయి విజయన్ లేఖ ద్వారా స్టాలిన్‌కు తెలియజేశారు. బిల్లులను ఆమోదించడానికి గవర్నర్‌లకు గడువును నిర్ణయించడానికి తమిళనాడు శాసనసభ ఆమోదించిన మాదిరిగానే కేరళ అసెంబ్లీలో తీర్మానాన్ని ఆమోదించాలని ప్రతిపాదించారు. ఏప్రిల్ 11న స్టాలిన్ పంపిన లేఖకు తన సమాధానంలో విజయన్... మన రాజ్యాంగ సమాఖ్య స్ఫూర్తిని రక్షించేవారిగా ఎన్నికయిన రాష్ట్ర ప్రభుత్వాల పని తీరును తగ్గించడాన్ని నిరోధించడానికి మనం ప్రతి ప్రయత్నానికి సహకరించాలి' అని అన్నారు. ఆర్టికల్ 200లో బిల్లులకు అనుమతి ఇవ్వడం దానిలోపు గవర్నర్ నిర్ణయం తీసుకోవడంపై అనేక రాష్ట్రాల అనుభవాన్ని అనుసరించి, రాజ్యాంగ పని తీరును సమీక్షించేందుకు జస్టిస్ ఎం.ఎన్.వెంకటాచలయ్య కమిషన్, కేంద్ర-రాష్ట్ర సంబంధాలపై జస్టిస్ ఎం.ఎం.పుంఛీ కమిషన్ గడువును సూచించాలని సిఫారసు చేశాయని విజయన్ తెలిపారు. 'బిల్లులకు ఆమోదం తెలిపే కాలవ్యవధిని రాజ్యాంగంలో ప్రత్యేకంగా పేర్కొననప్పటికీ, అది సహేతుకమైనదిగా ఉండాలి' అని తెలిపారు. 'ఈ విషయంలో మేము మీకు హృదయపూర్వక సహకారం అందించడానికి సిద్ధంగా ఉన్నాము. మీ లేఖలోని ప్రతిపాదనను అత్యంత తీవ్రంగా పరిశీలిస్తాము' అని కేరళ సీఎం లేఖలో పేర్కొన్నారు. ఏప్రిల్ 11న విజయన్‌కు రాసిన లేఖలో స్టాలిన్... ఆయా శాసనసభలు ఆమోదించిన బిల్లులను ఆమోదించడానికి గవర్నర్‌లకు కాలపరిమితిని నిర్ణయించడానికి తమిళనాడు అసెంబ్లీ తీర్మానం చేయవలసి వచ్చిన పరిస్థితులను వివరించారు. కేరళ అసెంబ్లీలో ఇదే విధమైన తీర్మానాన్ని ఆమోదించడం ద్వారా రాష్ట్ర ప్రభుత్వాలు, శాసనసభల సార్వభౌమాధికారం, ఆత్మగౌరవాన్ని నిలబెట్టడానికి ఈ విషయంలో తన మద్దతును అందించాలని కేరళ ముఖ్యమంత్రిని అభ్యర్థించారు.

కాంగ్రెస్ సీనియర్లతో రాజస్తాన్ ఎమ్మెల్యేల భేటీ

జైపూర్: రాజస్తాన్‌లో అసెంబ్లీ ఎన్నికల దృష్ట్యా ఉదయ్‌పూర్, కోటా, భరత్పూర్ డివిజన్ల కాంగ్రెస్ ఎమ్మెల్యేలు పార్టీ సీనియర్లతో భేటీకి క్యూకట్టారు. జైపూర్‌లోని పార్టీ కొత్త కార్యాలయంలో ఎమ్మెల్యేలతో ముఖ్యమంత్రి అశోక్ గెహ్లాత్, కాంగ్రెస్ రాష్ట్ర ఇంచార్జి సుఖిజిందర్ సింగ్ రంధావా, పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు గోవింద్ సింగ్ దోతాస్రా వేర్వేరుగా సమావేశమయ్యారు. అనేక అంశాలపై చర్చించారు. వసుంధర రాజే హయాంలో జరిగిన అవినీతిపై చర్యలు ఎందుకు తీసుకోలేదని గెహ్లాత్ ప్రభుత్వాన్ని సొంత పార్టీ నేత సచిన్ పైలెట్ నిలదీయడం, చర్యలను డిమాండ్ చేస్తూ 24 గంటల దీక్ష చేపట్టిన క్రమంలో పార్టీ నాయకుల్లో అలజడి మొదలైంది. వారంతా సీనియర్లతో కలిసి రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో తమకున్న అవకాశాలను అంచనా వేసుకునే పనిలో పడ్డారు. అయితే దీక్ష చేసి వారం అయినాగానీ ఎలాంటి చర్యలు తీసుకోలేదని టోంక్ ఎమ్మెల్యే పైలెట్ అసహనం వ్యక్తంచేశారు. సోమవారం పార్టీ నేతలతో సమావేశాలకు గైర్హాజరైన ఆయన షాపురా (జైపూర్), ఖేత్రి (ఝున్‌ఝును)లో రెండు బహిరంగ సభల్లో పాల్గొన్నారు. టోంక్... అజ్మేర్ డివిజన్‌లో ఉంది. అయితే అజ్మేర్, జోధపూర్ డివిజన్ల ఎమ్మెల్యేలతో సమావేశాల ఫొటోలను గెహ్లాత్ ట్వీట్ చేశారు. రాజస్తాన్‌ను నంబర్‌వన్ రాష్ట్రంగా నిలిపేందుకు 'మిషన్ 2030'కి సంబంధించి సలహాలు, సూచనలు ఇచ్చినట్లు పేర్కొన్నారు. పార్టీ షెడ్యూల్ ప్రకారం బుధవారం జరిగే వర్క్‌షాపుకు ఎమ్మెల్యేలతో పాటు పార్టీలోని ఇతర నేతలు, కార్యకర్తలు హాజరుకానున్నారు. కాగీ, గురువారం బికానీర్, జైపూర్ ఎమ్మెల్యేలను రంధావా, గెహ్లాత్, దోతాస్రా కలుస్తారు.

అతీఖ్ హత్యపై 24న సుప్రీం విచారణ

న్యూదిల్లీ: ఉత్తరప్రదేశ్‌లో 2017 నుంచి జరుగుతున్న ఎన్‌కౌంటర్ హత్యలపై స్వతంత్ర దర్యాప్తు జరపాలని కోరుతూ దాఖలైన పిటిషన్‌ను సుప్రీంకోర్టు మంగళవారం విచారణకు అంగీకరించింది. అడ్వకేట్ విశాల్ తివారీ దాఖలు చేసిన ఈ పిటిషన్‌పై ఈ నెల 24న విచారణ జరుపుతామని తెలిపింది. గ్యాంగ్‌స్టర్, మాజీఎంపీ అతీఖ్ అహ్మద్, ఆయన సోదరుడు అష్రాఫ్ హత్యలను ఈ పిటిషన్‌లో ప్రస్తావించారు.

సోదరులిద్దరూ పోలీస్ కస్టడీలో ఉండగా ప్రయాగ్‌రాజ్‌లో ఈ నెల 15న హత్యకు గురయ్యారని తెలిపారు. అతీఖ్, అష్రాఫ్‌లను శనివారం రాత్రి వైద్య పరీక్షల కోసం పోలీసు బందోబస్తు మధ్య ప్రయాగ్‌రాజ్‌లోని వైద్య కళాశాలకు తీసుకెళ్లారు. ఆ కళాశాల వద్ద మీడియాతో వారిద్దరూ మాట్లాడేందుకు ప్రయత్నించారు. అదే సమయంలో ముగ్గురు దుండగులు వారిపై కాల్పులు జరిపి, హత్య చేశారు. పోలీసులు, మీడియా ప్రతినిధుల సమక్షంలోనే ఈ దారుణం జరిగింది. ఈ దృశ్యాలు టీవీ చానళ్లలో ప్రత్యక్ష ప్రసారం అయ్యాయి. ఈ ఘటనపై ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ ప్రభుత్వం వెంటనే స్పందించింది. దాదాపు 17 మంది పోలీసులను సస్పెండ్ చేసింది.

ప్రత్యేక దర్యాప్తు బృందంతో దర్యాప్తునకు ఆదేశించింది. విశాల్ తివారీ దాఖలు చేసిన పిటిషన్‌ను భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్ విచారణకు స్వీకరించారు. దీనిపై అత్యవసర విచారణ జరపాలని తివారీ కోరారు. 2017 నుంచి ఇప్పటి వరకు రాష్ట్రంలో 183 ఎన్‌కౌంటర్లు జరిగాయని తెలిపారు. అతీఖ్, అష్రాఫ్ హత్యలపై స్వతంత్ర నిపుణుల కమిటీతో దర్యాప్తు జరిపించాలని కోరారు. యోగి ఆదిత్యనాథ్ ప్రభుత్వ హయాంలో 2017 నుంచి ఇప్పటి వరకు 183 ఎన్‌కౌంటర్లు జరిగినట్లు ఉత్తరప్రదేశ్ శాంతిభద్రతల విభాగం ప్రత్యేక డీజీపీ ప్రకటించారని తెలిపారు. ఈ ఎన్‌కౌంటర్లపై దర్యాప్తు జరిపేందుకు సుప్రీంకోర్టు విశ్రాంత న్యాయమూర్తి నేతృత్వంలో స్వతంత్ర నిపుణుల కమిటీని ఏర్పాటు చేయాలని, చట్టబద్ధ పాలనను కాపాడేందుకు ఆదేశాలు జారీ చేయాలని కోరారు. అతీఖ్, అష్రాఫ్ హత్యలపైనా ఈ కమిటీతో దర్యాప్తు చేయించాలని కోరారు.

అతీఖ్ అహ్మద్ కుమారుడు అసద్ కూడా ఎన్‌కౌంటర్‌లో ప్రాణాలు కోల్పోయిన సంగతి తెలిసిందే.

సన్నీసింగ్‌పై బిష్ణోయ్ ప్రభావం

పోలీసు విచారణలో వెల్లడి

ప్రయాగ్‌రాజ్: గ్యాంగ్‌స్టర్, మాజీ ఎంపీ అతీఖ్ అహ్మద్, అతడి సోదరుడు అష్రాఫ్ హత్య దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించింది. జర్నలిస్టుల్లా వచ్చిన సన్నీ సింగ్, లవ్లేశ్, అరుణ్ మౌర్య ఈ హత్యలకు పాల్పడ్డారు. అయితే ఇప్పుడు ఈ ఘటనకు సంబంధించి కీలక విషయాలు వెలుగులోకి వచ్చాయి. ఈ జంట హత్యల్లో ప్రధాన సూత్రధారుడు సన్నీసింగ్ అని తెలుస్తోంది. అతడే మిగతా ఇద్దరిని ఒప్పించి, ఈ దాడికి పాల్పడినట్లు విచారణలో వెల్లడైనట్లు సమాచారం. ఇందులో ప్రధాన సూత్రధారిగా సన్నీసింగ్‌ను భావిస్తున్నారు. గ్యాంగ్‌స్టర్ లారెన్స్ బిష్ణోయ్ ప్రభావం సన్నీసింగ్‌పై ఉన్నట్లు చెబుతున్నారు. లారెన్స్ వీడియోలు వీక్షించే అతీఖ్ హత్యకు ప్రణాళిక రచించినట్లు విచారణలో అంగీకరించినట్లు తెలుస్తోంది. ప్రముఖ పంజాబీ గాయకుడు సిద్ధూ మూసేవాలా హత్య వెనక లారెన్స్ గ్యాంగ్ ఉందన్న వార్తలు విన్న సన్నీ... ఆ తరహాలో ఓ పెద్దవ్యక్తిని హత్య చేసి పాపులర్ కావాలని కలలుకన్నట్లు చెబుతున్నారు. లవ్లేశ్, అరుణ్‌తో పోల్చుకుంటే సన్నీ ప్రమాదకారని, అతడిపై 10కిపైగా కేసులు ఉన్నాయని పోలీసు వర్గాలు తెలిపాయి. ఉత్తరప్రదేశ్‌లో సంచలనం సృష్టించిన ఉమేశ్ పాల్ హత్య కేసులో నిందితుడిగా ఉన్న అతీఖ్ అహ్మద్, అతడి సోదరుడు అష్రాఫ్ అహ్మద్‌ను జైలు నుంచి మెడికల్ చెకప్‌కు తీసుకెళ్తుండగా వారిపై ఆకస్మికంగా కాల్పులు జరిగాయి. దాంతో వారు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు..

మాఫియా పేరుతో బెదిరింపులు ఉండవు

అతీఖ్ హత్య తర్వాత సీఎం యోగి స్పందన

లక్నో: ఉత్తరప్రదేశ్ ప్రయాగ్‌రాజ్‌లో గ్యాంగ్‌స్టర్ అతీఖ్ అహ్మద్, అతడి సోదరుడు అష్రాఫ్ అహ్మద్ హత్యల తర్వాత ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ తొలిసారి స్పందించారు. రాష్ట్రంలో మాఫియా పేరుతో ఎవరినీ బెదిరించలేరని చెప్పుకొచ్చారు. 2017కు ముందు రాష్ట్రంలో శాంతి భద్రతలు దారుణంగా ఉండేవని, నిత్యం అల్లర్లతో మండిపోతుండేదని యోగి గుర్తు చేశారు. తాము అధికారంలోకి వచ్చాక మాఫియా అంతుచూశామన్నారు. యూపీ ప్రగతి బాటలో నడుస్తోందన్నారు. రాష్ట్రంలో చట్టబద్ధ పాలన కొనసాగుతోందన్నారు. లక్నోలో జరిగిన సమావేశంలో యోగి ఈ వ్యాఖ్యలు చేశారు. యూపీలో 2012 నుంచి 2017 వరకూ 700కు పైగా అల్లర్లు జరిగాయని, 2017 నుంచి ఇప్పటివరకూ ఒక్క ఘటనా అలాంటిది జరగలేదని, కర్ఫ్యూ పెట్టాల్సిన అవసరమే రాలేదన్నారు. మరోవైపు గ్యాంగ్‌స్టర్ అతీఖ్ అహ్మద్, అతడి సోదరుడు అష్రాఫ్ అహ్మద్ హత్యలపై న్యాయకమిషన్, సిట్ పోలీసుల దర్యాప్తు చురుగ్గా సాగుతోంది. ఈ తరుణంలో పోలీసుల దృష్టి అతీఖ్ అహ్మద్ భార్య షైస్తా పర్వీన్‌పై పడింది. అతీఖ్, అష్రాఫ్ అంత్యక్రియలకు హాజరుకాకపోవడంతో ఆమె ఆచూకీ తెలుసుకునేందుకు జల్లెడ పడుతున్నారు. అంత్యక్రియలకు షైస్తా పర్వీన్ తప్పకుండా హాజరవుతారని ప్రచారం జరిగింది. పరారీలో ఉన్న ఆమె తలపై 50 వేల రూపాయల రివార్డ్ ఉంది. భర్తను హత్య చేశారని తెలియగానే షైస్తా పర్వీన్ వెక్కివెక్కి ఏడ్చారని, అనంతరం ఆమె కళ్లు తిరిగి పడిపోయారని సన్నిహిత వర్గాల ద్వారా తెలిసింది. అతీఖ్ అహ్మద్ నేరసామ్రాజ్యాన్ని నడపడంలో షైస్తా పర్వీన్ కీలకంగా ఉన్నారని పోలీసులు అనుమానిస్తున్నారు. అతీఖ్ అహ్మద్ జైలులో ఉండగా మాఫియా సభ్యులతో అక్రమ వ్యవహారాలన్నీ ఆమెనే చక్కబెట్టారని పోలీసులు చెప్పారు. మరోవైపు ఫిబ్రవరి 24న న్యాయవాది ఉమేశ్ పాల్ హత్య సమయంలో బాంబులు విసిరిన గుడ్డూ ముస్లిం కోసం పోలీసులు వేట కొనసాగిస్తున్నారు. తాజాగా అతడి కదలికలు కర్నాటకలో బయటపడినట్లు సమాచారం. ఉమేశ్ పాల్‌పై అతీఖ్ తనయుడు అసద్, అతడి స్నేహితుడు గులాం కాల్పులు జరుపుతుండగా గుడ్డూ ముస్లిం నాటుబాంబులు విసిరాడు. నాటు బాంబులు అత్యంత వేగంగా తయారు చేయడంతో పాటు విసరడంలోనూ గుడ్డూ ముస్లిం నిపుణుడని, అతీఖ్ మాఫియా గ్యాంగ్‌లో ప్రస్తుతం కీలకంగా వ్యవహరిస్తున్నాడని పోలీసులకు సమాచారం ఉంది. దీంతో గుడ్డూ ముస్లిం ఆచూకీ బయటపడితే అతీఖ్ నేర సామ్రాజ్యానికి, పాకిస్థాన్ ఉగ్రవాద సంస్థలకు, ఐఎస్ఐకి ఉన్న సంబంధాలు బయటపడతాయని పోలీసులు భావిస్తున్నారు. మరోవైపు అతీఖ్ అహ్మద్ సోదరులను కాల్చి చంపిన లవ్లేశ్ తివారీ, సన్నీ సింగ్, అరుణ్ మౌర్యలను భద్రతా కారణాల దృష్ట్యా ప్రయాగ్ రాజ్ జైలు నుంచి నిన్న ప్రతాప్‌గఢ్ జిల్లా జైలుకు తరలించారు.

యోగి, సీజేఐకి అతీఖ్ లేఖ

లక్నో: ఇటీవల హత్యకు గురైన గ్యాంగ్‌స్టర్, మాజీ ఎంపీ అతీఖ్ అహ్మద్ రాసినట్లు చెబుతున్న ఓ రహస్య లేఖ తాజాగా వెలుగులోకి వచ్చింది. అతీఖ్, అతని సోదరుడు అష్రాఫ్ అహ్మద్‌ను జర్నలిస్టుల ముసుగులో ముగ్గురు శనివారం కాల్చిచంపిన విషయం తెలిసిందే. ఒకవేళ తాను మరణిస్తే.. ఆ లేఖను ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి, భారత ప్రధాన న్యాయమూర్తికి అందజేయాలని అతీఖ్ ముందుగానే సిద్ధం చేసినట్లు తెలుస్తోంది. ఈ మేరకు లేఖను ఆ ఇద్దరికీ పంపుతున్నట్లు అతీఖ్ తరపు న్యాయవాది విజయ్ మిశ్రా మంగళవారం వెల్లడించారు. ఒకవేళ ఏదైనా దుర్ఘటన జరిగితే లేదా తాను హత్యకు గురైతే.. ఆ లేఖను ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి, భారత ప్రధాన న్యాయమూర్తికి పంపాలని అతీఖ్ అహ్మద్ చెప్పారు. సీల్డ్ కవరులో ఉన్న ఆ లేఖ ఇప్పుడు తన దగ్గర లేదని, వేరే వ్యక్తి దాన్ని చేరవేయనున్నారని, లేఖలోని విషయాలూ తనకు తెలియవని న్యాయవాది విజయ్ మిశ్రా మీడియాకు తెలిపారు. భారీ నేర సామ్రాజ్యాన్ని ఏలడంతోపాటు సుదీర్ఘకాలం ప్రజాప్రతినిధిగా వ్యవహరించిన అతీఖ్ అహ్మద్.. ఆ లేఖలో ఏమి రాశారన్నదానిపై ఆసక్తికర చర్చ జరుగుతోంది.

ప్రధాని మోదీ పాలనకు అనర్హుడు

సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు

విశాలాంధ్ర-భీమవరం: నరేంద్ర మోదీ పాలనలో ఆర్థిక వ్యవస్థ చిన్నాభిన్నమైందని, అస్తవ్యస్త విధానాలతో నియంతలా వ్యవహరిస్తున్న మోదీ పాలకుడిగా అనర్హుడని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు విమర్శించారు. నియంత పాలనను తరిమికొట్టే సమయం ఆసన్నమైందని స్పష్టంచేశారు. బీజేపీ హటావో...దేశ్ బచావో నినాదంతో సీపీఐ, సీపీఎం అధ్వర్యంలో నిర్వహిస్తున్న ప్రచారభేరి కార్యక్రమం మంగళవారం ఐదో రోజుకు చేరింది. ఈ కార్యక్రమంతో రాష్ట్రంలోని అనేక ప్రాంతాలు దద్దరిల్లాయి. సీపీఐ, సీపీఎం నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున పాల్గొన్నారు. పశ్చిమగోదావరి జిల్లా భీమవరంలో నిర్వహించిన ప్రచారభేరి కార్యక్రమంలో ముప్పాళ్ల పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ మోదీ నిరంకుశంగా ప్రభుత్వరంగ సంస్థలన్నింటినీ అమ్మకానికి పెట్టారని ఆరోపించారు. ఎన్నికల సమయంలో రైతుల ఆదాయం రెట్టింపు చేస్తానని, ఏటా రెండు కోట్ల ఉద్యోగాలు కల్పిస్తానని, విదేశాలలో మూలుగుతున్న నల్లధనాన్ని తెచ్చి ప్రతి కుటుంబానికి రూ .15 లక్షలు ఖాతాలో జమ చేస్తానని వాగ్దానం చేసి ప్రజలను మోసగించారని విమర్శించారు. మోదీ అండదండలతో అదానీ ఏ విధంగా లక్షల కోట్లు సంపాదించాడో హిండెన్‌బర్గ్ నివేదిక బట్టబయలు చేసిందని ముప్పాళ్ల గుర్తుచేశారు. గ్రామీణ పేదలకు ఆధారమైన ఉపాధి హామీ పథకానికి బడ్జెట్లో నిధులు కేటాయించకుండా నిర్వీర్యం చేయటానికి కుట్ర చేశారన్నారు. రాష్ట్రానికి మోదీ తీరని ద్రోహం చేశారని, ప్రత్యేక హోదా, పోలవరం నిధులు, ప్రాజెక్టు నిర్వాసితుల సమస్యల పరిష్కారం, పరిహారం చెల్లింపు, అమరావతి రాజధాని నిర్మాణం, రైల్వే జోన్, రాయలసీమ, ఉత్తరాంధ్ర ప్రాంతాలకు ప్రత్యేక ప్యాకేజీ వంటి హామీలన్నీ పక్కనపెట్టేశారని మండిపడ్డారు. రాష్ట్రంలో ఏకైక పరిశ్రమ విశాఖ ఉక్కు ప్రైవేటీకరణకు కేంద్రం కుట్ర చేస్తుంటే రాష్ట్ర ప్రభుత్వం చేష్టలుడిగి చూస్తున్నదని విమర్శించారు. రాష్ట్ర ప్రయోజనాలను కాపాడవలసిన ముఖ్యమంత్రి జగన్...తన కేసులకు భయపడి మోదీ వద్ద సాగిలపడుతున్నారని ఎద్దేవా చేశారు. ప్రధాన ప్రతిపక్షం టీడీపీ, జనసేన కూడా మోదీనికి ప్రశ్నించకుండా నిస్సహాయ స్థితిలో ఉన్నాయన్నారు. దేశంలో మతోన్మాదాన్ని రెచ్చగొడుతూ లౌకికవాద పరిరక్షణకు తూట్లు పొడుస్తూ ప్రజల మధ్య విద్వేషాలు రెచ్చగొడుతున్న మోదీ సర్కారును గద్దె దించాలని పిలుపునిచ్చారు. సీబీఐ, ఈడీ, ఈసీ వంటి రాజ్యాంగబద్ధ సంస్థలను తమ జేబు సంస్థలుగా మార్చుకున్నారని విమర్శించారు. దేశంలో అరాచక పాలన కొనసాగుతోందన్నారు. ప్రజా వ్యతిరేక, నిరంకుశ, మతోన్మాద బీజేపీని సాగనంపాలని పిలుపునిచ్చారు. పేదల పక్షాన పోరాడేది వామపక్షాలు మాత్రమేనన్నారు. ప్రచారభేరి యాత్రలో సీపీఐ పశ్చిమగోదావరి జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు, రాష్ట్ర సమితి సభ్యులు కలిశెట్టి వెంకట్రావు, జిల్లా కార్యవర్గ సభ్యులు సీహెచ్ రంగారావు, ఎం.సీతారాం ప్రసాద్, జిల్లా సమితి సభ్యులు సనపల శ్రీనివాస్, గంజి రాజు, వై.విజయానంద్, ఆకల రాము, కె.రమేశ్, సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు డి.వాసుదేవరావు, భీమవరం పట్టణ కార్యదర్శి వైకుంఠరావు, చెల్లబోయిన వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

నరేంద్రమోదీని గద్దె దించాలి: ఈశ్వరయ్య

రాయచోటిటౌన్: 'ప్రచార భేరి' కార్యక్రమంలో భాగంగా అన్నమయ్య జిల్లా రాయచోటి ఎమ్మార్వో కార్యాలయం దగ్గర నుంచీ జగదాంబ సెంటర్ మీదుగా బోస్ నగర్, మదనపల్లి రోడ్ వరకూ ప్రచార కార్యక్రమం జరిగింది. ఇక్కడ సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు గుజ్జుల ఈశ్వరయ్య మాట్లాడుతూ 'నన్ను నమ్మండి...ఈ దేశానికి కాపలా దారుడిగా ఉంటాను' అని నమ్మబలికి మోదీ దేశాన్ని సర్వనాశనం చేశారని విమర్శించారు. పేదల రక్తాన్ని పీల్చి పిప్పి చేస్తున్న జిత్తుల మారి మోదీని గద్దె దింపాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. మోదీ హయాంలో అప్పులు పెరిగిపోయాయని చెప్పారు. ఈ దేశాన్ని పాలించిన 14 మంది ప్రధానులు 5 లక్షల కోట్ల రూపాయలు అప్పు చేస్తే మోదీ 8 ఏళ్ల పాలనలో ఏకంగా లక్ష కోట్ల రూపాయల అప్పులు చేశారని దుయ్యబట్టారు. నోట్ల రద్దుతో నల్లధనాన్ని తెలుపుగా మార్చి పేదల ఖాతాల్లో డబ్బులు వేస్తామని, ఉగ్రవాదం, నక్సలిజాన్ని అంతం చేస్తానని చెప్పి..ఏమి సాధించారని ప్రశ్నించారు. రైతులను నట్టేట ముంచే నల్ల చట్టాలు తెచ్చి, నెలల తరబడి రైతులకు నిద్రాహారాలు లేకుండా చేశారన్నారు. పెట్రోల్, డీజిల్, గ్యాస్, పప్పు, నూనె ధరలు ఇష్టానుసారం పెంచి, సామాన్యుడి నడ్డి విరిచారని ఆరోపించారు. ఏపీకి బీజేపీ ప్రభుత్వం చేసిందేమీ లేదని, అయినా ఈ రాష్ట్ర అధికార, ప్రతిపక్ష పార్టీలు మోదీకే ఊడిగం చేస్తున్నాయన్నారు. సీపీఎం జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు మాట్లాడుతూ రాష్ట్రానికి అన్యాయం చేస్తున్నా సీఎం జగన్ కేంద్రాన్ని పల్లెత్తు మాట అనడం లేదని నిందించారు. పథకాల పేరుతో ప్రజాధనాన్ని పంచి పెడుతూ రాష్ట్రాభివృద్ధిని గాలికొదిలేశారన్నారు. జగన్ మోహన్ రెడ్డి దుశ్చర్యలను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. సీ పీ ఐ జిల్లా సహాయ కార్యదర్శి పి.మహేశ్, సీపీ ఐ, సీపీఎం ఏరియా కార్యదర్శులు సిద్దిగాల్ల శ్రీనివాసులు, రామాంజులు, గిరిజన సమాఖ్య జిల్లా అధ్యక్ష కార్యదర్శులు బి.విశ్వనాథ నాయక్, శంకర్ నాయక్, దళిత హక్కుల పోరాట సమితి జిల్లా కార్యదర్శి సుధీర్ కుమార్, రైతుసంఘం జిల్లా కార్యదర్శి రంగారెడ్డి, ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు లవకుమార్, మహిళా సమాఖ్య నాయకురాలు సుమిత్రమ్మ, ఎంఆర్‌పీఎస్ నాయకులు రామాంజనేయులు, ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి జక్కల వెంకటేశ్, ప్రజానాట్య మండలి జిల్లా అధ్యక్షుడు భాస్కర్ యాదవ్, అశోక్, సీనియర్ నాయకులు వెంకటేశు, జగన్ తదితరులు పాల్గొన్నారు.

అంబేద్కర్ స్ఫూర్తితో యువత పనిచేయాలి: రామకృష్ణ

విశాలాంధ్ర-విజయవాడ: సమాజాన్ని చైతన్యవంతం చేసేందుకు డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ స్ఫూర్తితో యువత పని చేయాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ అన్నారు. బి.ఆర్.అంబేద్కర్ 132వ జయంతి మాలమహానాడు అధ్వర్యంలో మంగళవారం విజయవాడ అయ్యప్ప నగర్‌లో జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న రామకృష్ణ మాట్లాడుతూ దేశంలో సాంఘిక దురాచారాలను పారద్రోలటానికి బి.ఆర్.అంబేద్కర్ అనేక పోరాటాలు చేశారని గుర్తు చేశారు. అట్టడుగు వర్గాలకు రిజర్వేషన్లు కల్పించటంలో, మహిళల హక్కులను కాపాడటంలో ఆయన చేసిన కృషి మరువలేనిదన్నారు. మోదీ పాలనలో రాజ్యాంగానికి ముప్పు ఏర్పడిందని ఆందోళన వ్యక్తం చేశారు. దేశాన్ని కాపాడుకోవటానికి యువత ముందుకు రావాలన్నారు. సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు దోనేపూడి శంకర్ మాట్లాడుతూ అక్షరం విలువను ప్రపంచానికి చాటిన మహనీయుడు అంబేద్కర్ అన్నారు. ప్రపంచంలోనే పెద్ద ప్రజాస్వామ్య దేశానికి రాజ్యాంగ పరిషత్ చైర్మన్‌గా ఎంపికై ప్రతిష్టాత్మకమైన రాజ్యాంగాన్ని మనకు అందించారని తెలిపారు. తొలుత విజయవాడ తూర్పు నియోజకవర్గ శాసన సభ్యులు గద్దె రామ్మోహన్, అనురాధ దంపతులు కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం మాలమహానాడు నిర్వాహకులు కె.రామకృష్ణ, దోనేపూడి శంకర్, ఇతర అతిథులను దుశ్శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా 500 మందికి అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో బండి బాలయోగి, బండి సీతామహాలక్ష్మి, బి.అనిల్‌కుమార్, కృష్ణకిశోర్, దాసరి జయరాజ్, వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

సూడాన్‌లో చిక్కుకున్న
భారతీయుల్ని రక్షించాలి

- ఆహారం, నీరు లేక దయనీయ పరిస్థితుల్లో వారున్నారు
- జైశంకర్‌కు వినయ్ విశ్వం లేఖ



న్యూదిల్లీ: సూడాన్‌లో చిక్కుకున్న భారతీయులను రక్షించే చర్యలను వేగవంతం చేయాలని కోరుతూ కేంద్ర విదేశాంగ శాఖ మంత్రి ఎస్ జైశంకర్‌కు సీపీఐ ఎంపీ వినయ్ విశ్వం మంగళవారం లేఖ రాశారు. ఆ దేశంలో సైనిక ఘర్షణ క్రమంలో 200 మంది చనిపోగా 1800 మంది గాయపడ్డారని, రాజధాని ఖార్టూమ్‌లో ఆసుపత్రులు దెబ్బతిన్నాయని, వైద్య పరంగా మౌలిక వసతులు అందుబాటులో లేవని మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. రవాణా, ఆహారం, తాగునీటి సరఫరా నిలిచిపోయాయని, భారీ ఆయుధాల వినియోగంతో ఖార్టూమ్ విమానాశ్రయంపైనా ప్రభావం ఎక్కువగా ఉన్నదని లేఖలో విశ్వం పేర్కొన్నారు. క్లిష్ట పరిస్థితుల్లో అక్కడ చిక్కుకున్న భారతీయులు తినేందుకు ఆహారం, తాగేందుకు మంచినీళ్లు కూడా లేకుండా తీవ్ర ఇబ్బంది పడుతున్నారని, వారిని క్షేమంగా అక్కడ నుంచి తప్పించే ఏర్పాట్లు చేయాలని మంత్రిని కోరారు. ఎల్ ఫషెర్ నగరంలో కర్నాటకు చెందిన 31 మంది చిక్కుకున్నట్లు సమాచారం ఉన్నదన్నారు. వందలాది మంది భారతీయులు ముఖ్యంగా కేరళ, కర్నాటకకు చెందిన వారు దీన పరిస్థితుల్లో తమ ప్రాణాలను అరచేతిలో పెట్టుకొని బిక్కుబిక్కుమంటూ కాలం వెళ్లదీస్తున్నారని వినయ్ విశ్వం ఆందోళన వ్యక్తంచేశారు. భారతీయులు ఎవ్వరూ బయట తిరగవద్దని ఈనెల 16వ తేదీన చివరి హెచ్చరికలు జారీ అయ్యాయని, వారు ఆహారం, నీరు, మందులు వంటివి లేక ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. మన పౌరుల రక్షణ మనకు అతిముఖ్యమని నొక్కిచెప్పారు. సూడాన్‌లో చిక్కుకున్న భారతీయులను క్షేమంగా తరలించేందుకు తక్షణ చర్యలు తీసుకుంటున్నారని ఆశిస్తున్నానని లేఖలో విశ్వం పేర్కొన్నారు.

రష్యాతో భారత్ 'వందేభారత్' ఒప్పందం

న్యూదిల్లీ: వందే భారత్ రైళ్ల కోసం రష్యాతో భారత్ ఒప్పందం కుదుర్చుకుంది. 120 వందే భారత్ ఎక్స్‌ప్రెస్ రైళ్ల ఉత్పత్తి, సరఫరా, నిర్వహణ కోసం రష్యాకు చెందిన ట్రాన్స్‌మాష్‌హోల్డింగ్ (టీఎంహెచ్)తో ఒప్పందం కుదిరినట్లు రష్యా వార్తాసంస్థ టీఏఎస్ఎస్ వెల్లడించింది. వందే భారత్ రైళ్లను సరఫరా చేసేందుకు 1.8 బిలియన్ డాలర్లను భారతీయ రైల్వే రష్యాకు చెల్లించనుంది. 35 ఏళ్ల రైళ్ల నిర్వహణ కోసం మరో 2.5 బిలియన్ డాలర్లను ఇవ్వనున్నది. మొత్తంగా 6.5 బిలియన్ డాలర్ల ఒప్పందాన్ని భారత్ చేసుకోనున్నట్లు రష్యా వార్తా సంస్థ పేర్కొంది. జూన్ ఒకటో తేదీనాటికి ఈ ఒప్పందంపై సంతకాలు జరగవచ్చని తెలిపింది. 16-కోచ్‌లతో 120 వందే భారత్ రైళ్లలో ఒక్కొక్కటి లాతూర్‌లోని మరఠ్వాడా రైల్ కోచ్ ఫ్యాక్టరీ నుంచి ఉత్పత్తి అవనున్నాయి. ఈ రైళ్లన్నీ 2026 నుంచి 2030 వరకు సరఫరా కానున్నట్లు తెలుస్తోంది.మొదటి రెండు నమూనా రైళ్లు ట్రైల్స్‌కి 2025నాటికే సిద్ధంకానున్నాయి. 400 వందే భారత్ రైళ్లను తెచ్చే ప్రయత్నం చేస్తున్నట్లు భారతీయ రైల్వే మార్చిలో తెలిపిన విషయం విదితమే.

పుష్ప-2 ది రూల్ వీడియో ప్రకంపనలు

పాన్ ఇండియా స్టార్ అల్లు అర్జున్ హీరోగా డైరెక్టర్ సుకుమార్ తెరకెక్కించిన చిత్రం పుష్ప. పుష్ప సినిమా రికార్డుల గురించి, కలెక్షన్ల గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. పుష్ప సినిమా ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకులపై చూపించిన

ప్రభావం అంతా ఇంతా కాదు. పుష్పరాజ్ అనే క్యారెక్టర్‌ను అద్భుతంగా డిజైన్ చేసి ప్రపంచవ్యాప్తంగా అందరి దృష్టిని ఆకర్షించారు దర్శకుడు సుకుమార్. ఈ చిత్రాన్ని మైత్రి మూవీస్ ఇన్ అసోసియేట్ విత్ సుకుమార్ రైటింగ్స్ బ్యానర్‌పై నవీన్ ఎర్నేని, రవి శంకర్ యలమంచిలి నిర్మిస్తున్నారు. పుష్పరాజ్ పాత్రలో అల్లు అర్జున్ నటించిన తీరు, డైలాగ్ డెలివరీ, వాయిస్ మాడ్యులేషన్, యాటిట్యూడ్ ఇవన్నీ తెలుగు ప్రేక్షకులతో పాటు ప్రపంచవ్యాప్తంగా అందరికీ అద్భుతమైన అనుభూతులిచ్చాయి. అప్పటివరకు తెలుగు, మలయాళ ప్రేక్షకులకు మాత్రమే పరిచితమైన అల్లు అర్జున్ పుష్ప సినిమాతో ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకులందరికీ చేరువయ్యారు. పుష్ప సినిమా ప్రభావం ఎంతలా ఉందంటే క్రికెటర్లు, రాజకీయ నాయకులు సినిమాలోని డైలాగులను తమదైన స్టైల్‌లో చెబుతూ సోషల్ మీడియాలో హల్‌చల్ చేశారు. పుష్ప-2 ది రూల్ చిత్రం షూటింగ్ దశలో ఉంది. రీసెంట్‌గా ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ బర్త్ డే సందర్భంగా 'పుష్ప: ది రూల్" చిత్రం 'హంట్ ఫర్ పుష్ప' అనే కాన్సెప్ట్ వీడియో రిలీజ్ చేసింది చిత్రం బృందం. 3 నిమిషాల 17 సెకన్ల నిడివి ఉన్న ఈ 'హంట్ ఫర్ పుష్ప' కాన్సెప్ట్ వీడియో అద్భుతంగా ఉంది. సినిమాపై అంచనాలను పెంచేసింది. పాన్ ఇండియా మూవీగా వస్తున్న ఈ కాన్సెప్ట్ వీడియో 100 మిలియన్స్ పైగా వ్యూస్ సాధించింది. 3.3 మిలియన్ లైక్స్‌తో అరుదైన రికార్డ్‌ను సృష్టించింది. మొత్తానికి పుష్పను మించి 'పుష్ప: ది రూల్' ప్రకంపనలు సృష్టించనుంది.

ఎన్‌సీపీతోనే ఉన్నా... ఉంటా

బీజేపీతో చేతులు కలిపే ప్రసక్తే లేదు: అజిత్ పవార్

ముంబై: తాను బీజేపీతో చేతులు కలిపానంటూ వస్తున్న వదంతులను నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ (ఎన్‌సీపీ) సీనియర్ నాయకుడు, మహారాష్ట్ర మాజీ ఉపముఖ్యమంత్రి అజిత్ పవార్ మంగళవారం తోసిపుచ్చారు. శరద్ పవార్ నేతృత్వంలోని పార్టీలో తాను భాగమేనని చెప్పారు. తాను ఎన్‌సీపీతో తెగతెంపులు చేసుకుని బీజేపీతో చేతులు కలిపానన్న వార్తల్లో 'ఒక్క నిజం' లేదని ఆయన స్పష్టంచేశారు. 'నేను ఎన్‌సీపీతో ఉన్నాను...ఎన్‌సీపీతోనే ఉంటాను. ఎన్‌సీపీ ఏ నిర్ణయం తీసుకున్నా నేను అక్కడే ఉంటాను' అని అజిత్ పవార్ మహారాష్ట్ర అసెంబ్లీ వెలుపల విలేకరులతో అన్నారు. 'నా గురించి, నా ప్రజల గురించి గందరగోళం సృష్టించే ప్రయత్నం జరుగుతోంది. ఏది ప్రచారం చేసినా అందులో నిజం లేదు' అని ఆయన అన్నారు. బీజేపీతో చేతులు కలుపుతున్నట్లు వస్తున్న వదంతులకు సంబంధించి తాను ఏ ఎమ్మెల్యేల సంతకం తీసుకోలేదని ఎన్‌సీపీ నేత స్పష్టం చేశారు. 'ఎమ్మెల్యేల సంతకాలు తీసుకోలేదు. మేమంతా ఎన్‌సీపీకి విధేయులం. అలాంటి చర్చలు లేదా నిర్ణయం (బీజేపీ పొత్తుపై) జరగలేదు. ఇప్పుడు అన్ని వదంతులకు 'స్వస్తి' చెప్పాలి' అని అన్నారు.

అలాంటిదేమీ లేదు: శరద్ పవార్

నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ అధినేత శరద్ పవార్ మంగళవారం తన మేనల్లుడు, పార్టీ సీనియర్ నాయకుడు అజిత్ పవార్ తదుపరి రాజకీయ ఎత్తుగడపై ఊహాగానాలను తోసిపుచ్చారు. ఎన్‌సీపీ ఎమ్మెల్యేల సమావేశం ఏర్పాటుకు ఎవరూ పిలుపు ఇవ్వలేదని స్పష్టం చేశారు. అజిత్ పవార్ పార్టీ పనుల్లో బిజీగా ఉన్నారని, మీడియా ఈ అంశాన్ని లాగాల్సిన అవసరం లేదని ఆయన అన్నారు. అంతకుముందు సోమవారం, అధికార బీజేపీతో ఆయనకు పెరుగుతున్న సామీప్యతపై మహారాష్ట్ర రాజకీయ వర్గాల్లో తీవ్రమైన ఊహాగానాల నడుమ మంగళవారం ఎమ్మెల్యేల సమావేశాన్ని ఏర్పాటు చేసినట్లు వచ్చిన వార్తలను కూడా అజిత్ పవార్ కొట్టిపారేశారు. గత వారం అజిత్ పవార్ తన షెడ్యూల్ చేసిన సమావేశాలను అకస్మాత్తుగా రద్దు చేసుకోవడంతో ఆయన తదుపరి రాజకీయ ఎత్తుగడ గురించి ఊహాగానాలు చెలరేగాయి. బీజేపీ, ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండే శిబిరంపై మృదువుగా ఉన్నట్లు కూడా వ్యాఖ్యానాలు వచ్చాయి. కాగా, షిండే ప్రభుత్వంతో బీజేపీ భాగంగా ఉంది. ఇదిలాఉండగా, శరద్ పవార్ ఇటీవల ఉద్ధవ్ థాకరేతో మాట్లాడుతూ ఎవరైనా వ్యక్తిగత నిర్ణయం తీసుకున్నప్పటికీ, తమ పార్టీ బీజేపీతో ఎప్పటికీ చేతులు కలపదని చెప్పారంటూ శివసేన (యూబీటీ) నాయకుడు సంజయ్ రౌత్ ఆదివారం వదంతులకు మరింత బలం జోడించారు. మహారాష్ట్రలోని పూణె జిల్లాలోని పురందర్ ప్రాంతంలో మంగళవారం విలేకరులతో శరద్ పవార్ మాట్లాడుతూ మీడియా మదిలో ఏ చర్చలు జరుగుతున్నా అవి మా మనసుల్లో లేవని అన్నారు. 'ఈ చర్చలన్నింటికీ ప్రాముఖ్యత లేదు. నివేదికలకు అర్థం లేదు. ఎవరో వార్తలు సృష్టించడానికి ప్రయత్నిస్తున్నారు. ఎన్‌సీపీ గురించి నేను చెప్పగలను. మా సహచరులందరూ పార్టీని ఎలా బలోపేతం చేయాలనే దానిపై ఒక ఆలోచనలో ఉన్నారు. ఎవరి మనస్సులో మరో ఆలోచన లేదు' అని ఎన్‌సీపీ అధ్యక్షుడు స్పష్టం చేశారు. శివసేన (యూబీటీ), కాంగ్రెస్‌ను కలిగి ఉన్న మహా వికాస్ అఘాడి (ఎంవీఏ) లో ఒక భాగమైన శరద్ పవార్... ముంబైలో ఎన్‌సీపీ ఎమ్మెల్యేల సమావేశాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు వచ్చిన వదంతులను తోసిపుచ్చారు. అలాంటి సమావేశం ఏర్పాటుకు ఎవరూ పిలుపు ఇవ్వలేదని చెప్పారు. 'ఎన్‌సీపీ ఎమ్మెల్యేల సమావేశం గురించి నేను వార్తాపత్రికల్లో చదివాను. 100 శాతం నిజం అటువంటి సమావేశం ఏదీ జరగలేదు. అలాంటి సమావేశం ఏర్పాటుకు ఎవరూ పిలుపు ఇవ్వలేదు' అని అన్నారు. 'పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు (జయంత్ పాటిల్) తన ప్రాంతంలో మార్కెట్ కమిటీ ఎన్నికలలో బిజీగా ఉన్నారు. మరొక పార్టీ నాయకుడు అజిత్ పవార్ కూడా పార్టీ పనిలో బిజీగా ఉన్నారు. అందరికీ మార్గదర్శకత్వం వహిస్తున్నారు' అని తెలిపారు. ఎన్‌సీపీ అధ్యక్షుడు తన వివరణ తర్వాత, సమస్యను లాగే హక్కు మీడియాకు లేదని అన్నారు. అజిత్ పవార్, ఆయన వెంట వెళుతున్న పార్టీ ఎమ్మెల్యేల గురించి వస్తున్న ఊహాగానాలపై మీడియా ప్రతినిధులు అడిగిన ప్రశ్నలకు ఆయన సమాధానమిచ్చారు. శరద్ పవార్ పూణేలో తన కార్యక్రమాల తర్వాత ముంబైకి వెళతానని చెప్పారు. ముంబైలోని శివసేన (యూబీటీ) అధినేత ఉద్ధవ్ థాకరే నివాసం 'మాతోశ్రీ'లో కాంగ్రెస్ నేత కె.సి.వేణుగోపాల్‌తో భేటీ కావడంపై శరద్ పవార్‌ని ప్రశ్నించగా, తాను, రాహుల్ గాంధీ, ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖడ్గే, వేణుగోపాల్ దిల్లీలో సమావేశమయ్యామని చెప్పారు. 'జాతీయ స్థాయిలో ప్రతిపక్ష నాయకుల సమావేశాన్ని ఏర్పాటు చేయడం, ఒక కార్యక్రమాన్ని నిర్వహించడం అజెండా. ఆ సమావేశానికి థాకరేని ఆహ్వానించడానికి వేణుగోపాల్ మాతోశ్రీకి వచ్చారు. జాతీయ స్థాయిలో జరిగే విపక్షాల సమావేశానికి థాకరే, మేమందరం హాజరవుతామని, ఉమ్మడి కార్యక్రమంలో పాల్గొంటామని నేను కచ్చితంగా అనుకుంటున్నాను' అని శరద్ పవార్ అన్నారు.

రాజమహేంద్రితో ప్రత్యేక అనుబంధం

హీరో అక్కినేని అఖిల్

విశాలాంధ్ర - రాజానగరం: చరిత్రాత్మక నగరమైన రాజమహేంద్రవరంతో తమ కుటుంబానికి ప్రత్యేక అనుబంధం ఉందని సినీ హీరో అక్కినేని అఖిల్ అన్నారు. ఏజెంట్ చిత్రం ట్రీజర్ కోసం హైదరాబాద్ నుండి కాకినాడ వెళ్లేందుకు ప్రత్యేక విమానంలో మంగళవారం మధురపూడి విమానాశ్రయం విచ్చేసిన అఖిల్ మీడియాతో మాట్లాడుతూ తమ తాత అక్కినేని నాగేశ్వరరావు నుండి తన వరకు తూర్పుగోదావరి జిల్లా వచ్చిన ప్రతిసారీ రాజమహేంద్రికి చెందిన అభిమానులు, ప్రజలు ఎంతో ఆదరిస్తున్నారన్నారు. ఏజెంట్ సినిమా అన్ని వర్గాల ప్రేక్షకులను ఆకట్టుకుంటుందన్నారు. గత చిత్రాల కంటే ఏజెంట్ మూవీ కోసం చాలా కష్టపడ్డామని, సినిమా చాలా చక్కగా వచ్చిందని చెప్పారు. ఏజెంట్ సినిమా ప్రపంచవ్యాప్తంగా ఏప్రిల్ 28న భారీ అంచనాలతో విడుదల అవుతుందన్నారు. తమ చిత్రాన్ని ప్రతిఒక్కరు చూసి అఖండ విజయాన్ని అందించాలని కోరారు. అనంతరం కాకినాడకు అభిమానులతో కలిసి ర్యాలీగా తరలివెళ్లారు. మార్గమధ్యంలో కళాశాల విద్యార్థులు, అభిమానులు, మహిళలు అఖిల్‌ను చూసి, సెల్ఫీలు తీసుకునేందుకు ఎగబడ్డారు. అఖిల్ వెంట రాజమహేంద్రవరం అక్కినేని అభిమానుల సంఘం అధ్యక్షుడు కాటం రజనీకాంత్, జిల్లా ఇంతజ్ సినీ డిస్ట్రిబ్యూటర్స్, యర్రగుంట శివప్రసాద్, యర్రగుంట దుష్యంత్, సీనియర్ అక్కినేని అభిమానులు రాజకుమార్, సన్నీ డిఎల్, కాటం సంజయ్ కాంత్, సినీ దర్శకులు నాగేంద్ర రెంటాల, సుజిత్, నాని తదితరులు పాల్గొన్నారు.

వచ్చే ప్రభుత్వం మనదే

వైసీపీలో భూకంపం

జగన్‌కు ఇదే ఆఖరి అవకాశం

వై నాట్ పులివెందుల

కడప టీడీపీ సమావేశంలో చంద్రబాబు

విశాలాంధ్ర-కడప బ్యూరో: వచ్చే ఎన్నికల్లో నూటికి నూరు శాతం ప్రభుత్వం మనదేనని తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు అన్నారు. రాష్ట్రంలో మూడు ఎమ్మెల్సీ ఎన్నికల్లో విజయం సాధించామని, 108 అసెంబ్లీ స్థానాల్లో తెలుగుదేశం పార్టీకి మెజార్టీ వచ్చిందని, దీంతో వైసీపీలో భూకంపం మొదలైందని తెలిపారు. ఎన్నికల సమాయత్త జోన్ సమావేశాలలో భాగంగా జోన్-5 సమావేశం మంగళవారం కడపలో నిర్వహించారు. ఉమ్మడి కడప, కర్నూలు, అనంతరం జిల్లాల నుంచి అసెంబ్లీ, మండలి క్లస్టర్ కమిటీల అధ్యక్షులు, కార్యదర్శులు, బాధ్యులు హాజరయ్యారు. పార్టీ పని తీరు, పార్టీ చేపట్టిన బాదుడే బాదుడు, ఇదేం కర్మ కార్యక్రమాలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ వచ్చే ఎన్నికలలో గెలిచేందుకు మీ పనితనం ప్రధానమని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. ఎన్నికల్లో కష్టపడే వారికి పదవుల్లో ప్రాధాన్యం ఉంటుందని తెలిపారు. సీఎం నియోజకవర్గం నుంచి ఎమ్మెల్సీగా గెలిచామని, వై నాట్ పులివెందుల, వై నాట్ 175 అని అన్నారు. పైశాచిక ఆనందం పొందే జగన్‌మోహన్ రెడ్డికి ఇదే ఆఖరి అవకాశమని తెలిపారు. దాడులకు భయపడే పార్టీ తెలుగుదేశం కాదని అన్నారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి సంక్షేమ పథకాల పేరుతో బటన్ నొక్కినా, నొక్కకపోయినా ప్రజలు ఓటు బటన్ మాత్రం మనకే నొక్కుతారని చంద్రబాబు అన్నారు. జగన్ నాలుగేళ్ల పరిపాలనలో ఏ వర్గమూ సంతృప్తిగా లేదని, భూకబ్జాలు, రౌడీయిజం, ధరల పెరుగుదల, ప్రశ్నిస్తే కేసులు పెట్టడం, గంజాయి, గన్ కల్చర్ పెరగడం, జీవన ప్రమాణాలు తగ్గిపోవడం వంటి రకరకాల సమస్యలతో ప్రజలు విసిగి పోయారని విమర్శించారు. ఇలా సమస్యల్లో ఉన్న వారికి మనం ఇప్పుడు పరిష్కారం చూపించలేకపోయినా, వారి పక్షాన నిలబడి సంఘీభావం తెలిపి ప్రభుత్వం రాగానే మీ సమస్యలు పరిష్కరిస్తామంటూ వారికి భరోసా ఇవ్వాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. జగన్ అధికారంలోకి వచ్చాక రెండు లక్షల కోట్ల అవినీతికి పాల్పడ్డారని, ఆయనతో పాటు ఆయన పార్టీ నాయకులు, ఎమ్మెల్యేలు మరో రెండు లక్షల కోట్ల రూపాయల అవినీతికి పాల్పడ్డారని ఆరోపించారు. మరోవైపు ప్రజలపై రూ.5 లక్షల కోట్ల పన్నులు వేశారని, రూ.10 లక్షల కోట్ల అప్పులు చేశారని తెలిపారు. వివేకానంద రెడ్డి హత్య కేసు ప్రపంచానికే కేస్ స్టడీ లాంటిదని, వారు మాట్లాడే మాటలు వింటే ఊసరవెల్లి కూడా సిగ్గుపడుతుందని, ఈ కేసు కోసం మెజిస్ట్రేట్ కోర్టు నుంచి దిల్లీ కోర్టుల వరకు తిరుగుతున్నారని చంద్రబాబు విమర్శించారు. కడపకు వస్తుంటే ఎవరో నన్ను అడ్డుకోవాలని చూశారంట... ఇలాంటి రౌడీలకు తోక కత్తిరిస్తానని అన్నారు. ఒక్క పరిశ్రమ తీసుకురాకుండా, ప్రాజెక్టులు కట్టకుండా జగన్‌మోహన్ రెడ్డి రాయలసీమ ద్రోహిగా మారారని విమర్శించారు. సమావేశానికి పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెనాయుడుతో పాటు సీనియర్ నాయకులు సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి, కాల్వ శ్రీనివాసులు, పరిటాల సునీత, పల్లె రఘునాథ్ రెడ్డి, జిల్లాకు చెందిన నాయకులు శ్రీనివాస్ రెడ్డి, నరసింహారెడ్డి, సుధాకర్ యాదవ్, ఎమ్మెల్సీ రాంగోపాల్ రెడ్డి తదితర నేతలు హాజరయ్యారు.

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : R.V. RAMARAO. RNI No. 1138/57, Postal: Regd. No.VJA: VJ/042/2021-23, Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.